సంపుటిః 41 ఫోన్ నెం: 64843
సంచికః 3

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 78 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

అక్టోబరు, 1985

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-205

[ఫలితాలు]

ఆగస్టు '85 నెల "అపరాధ పరిశోధన పోటీ - 205"కు సరియైన సమాధానాలు:

1. కనిష్క.
2. ఆంధ్రప్రదేశ్.
3. విదేశీ పర్యటనలు.
4. నక్సలైట్లు.
5. ప్రతిపక్షాలు.

పై జవాబుల ప్రకారం ఐదుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి నవంబరు '85 నెలనుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎన్. రాధాకిషన్, బి.కాం., సబ్ పోస్టుమాస్టర్, అమరచింత-509 130. (మహబూబ్‌నగర్ జిల్లా)

(2) శ్రీ డి. జగపతిరాజు, బ్లాక్ నెం. 38/960, అజిత్ నగర్, విజయవాడ—15.

(3) శ్రీ ఏ. జగదీష్, 8-4-32, శ్రీ కిషన్ కాలనీ, వరంగల్—506 002.

(4) శ్రీ వి. రమణయ్య, C/o జి. లక్ష్మణాచారి, మార్వాడీగల్లీ, నిజామాబాదు—503 001.

(5) శ్రీ కె. నాగభూషణ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, దేవనహళ్ళి—562 110, బెంగుళూరుజిల్లా. (కర్ణాటక)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. లోయలోనిధి—స్వరూప్
12. గృహమేకదా స్వర్గసీమ—జొన్నలగడ్డ రామలక్ష్మి
41. విషంతాగిన హంతకుడు—దీపిక
59. గజదొంగ—'విశ్వమోహిని'
73. ఇండియా ఏజెంట్—సరసి
94. ప్రేమించకు కష్టాలొస్తాయ్—వసుంధర
115. ప్రమాదం పిలుస్తూంది—కొలుపూరి త్రిమూర్తి సత్యనారాయణ.
125. కిడ్నాపర్ ప్రతీకారం—ఎమ్.డి. చైతన్య
136. టెర్రరిస్ట్—చంద్రశేఖర అజాద్
146. గూండా నాయకుడు—పి.బి.యస్. ప్రకాశరావు
157. నరసింహావతారం—(సీరియల్) వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. అద్భుతశక్తి—ప్రతాప రవిశంకర్
44. మంచి కుటుంబం—వసుంధర
89. స్వప్నలోకం—పి. అరుణ
131. పోలీసు ఆతిథ్యం—వక్కంతం సూర్యనారాయణరావ్
155. విషకన్య (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

లోయలో నిధి

స్వరూప్

విసుగ్గా ఫోన్ క్రెడిల్ చేశాడు ఇన్స్పెక్టర్ శశాంక—

"డామిట్! హత్య....హత్య....హత్య....సంస్కారంతో తోటివారిని గౌరవిస్తూ బ్రతకాల్సిన సభ్య సమాజంలో—అడవిజంతువుల్లా మనిషిని మనిషి దారుణంగా చంపుకుంటూ, కసి, ప్రతీకారం, స్వార్ధాలతో పెట్రేగిపోతున్నాడు నేటి మానవుడు." గొణుక్కుంటూ క్యాప్ తగిలించుకుని కానిస్టేబుల్స్‌ను తీసుకుని జీప్‌లో బయల్దే

రాడు శశాంక.

పత్తేబాద్‌లో ఓ పెంకుటింటి ముందు ఆగింది జీప్.

అప్పటికే అక్కడ తిరనాల్లా వున్నారు జనం. పోలీస్ జీప్‌ను చూపి చాలామంది తప్పుకున్నారు.

ఆ ఇంటి గోడప్రక్కగా పడివుంది ఓ యువకుడి శవం. శవం దగ్గరగా కూర్చుని గుండెలు బాదుకుంటూ రోదిస్తోంది ఓ ముప్ఫైఎనిమిదేళ్ళ స్త్రీ. గోడవైపుకు నిలబడి చేతుల్లో ముఖాన్ని దాచుకుని రోదిస్తున్నాడు నలభైఐదేళ్ళ వ్యక్తి.

వాళ్ళిద్దర్నీ ఊరడిస్తున్నారు కొందరు పెద్ద మనుషులు.

శవానికి దూరంగా అందర్నీ పంపించి పరిశోధన ప్రారంభించాడు ఇన్‌స్పెక్టర్ శశాంక.

వెల్లకిలా పడివుంది శవం. హతుడికి ఇరవై సంవత్సరాలుండొచ్చు. దారుణంగా హింసించి చంపిన గుర్తుగా వళ్ళంతా గాయాలతో వున్నాడు.

శవాన్ని చూసి కసిగా పళ్ళుకొరికాడు శశాంక—

అలాంటి హత్య ఏలూర్లో అది మూడోది.

హెడ్ కానిస్టేబుల్‌కు కొన్ని సూచనలిచ్చి, ఏడుస్తున్న ఇద్దర్నీ ఇంటిలోనికి తీసుకెళ్ళి ప్రశ్నలవర్షం కురిపించసాగాడు శశాంక.

"ఈ విషాద సమయంలో మిమ్మల్ని ప్రశ్నలతో బాధించటం సముచితం కాకపోయినా మా ఉద్యోగధర్మం. దయచేసి నా ప్రశ్నలకు సమాధానాలిచ్చి సహకరిస్తారని ఆశిస్తాను." చెప్పటం ఆపాడు శశాంక.

అతనేం మాట్లాడలేదు. జేబురుమాలుతో కళ్ళనీళ్లు తుడుచుకుని మౌనంగా వుండిపోయాడు.

"మీ పేరు?" అడిగాడు శశాంక.

"చక్రపాణి"

"చనిపోయిన కుర్రాడు మీకేమౌతాడు?"

"నా కొడుకు"

"ఆమె—?"

"వాడి తల్లిని" చిన్నగా రోదిస్తూ అందామె.

"మీ కొడుకు హత్యకాబడటానికి కారణం ఏమై వుంటుందని మీ ఉద్దేశ్యం?" పరిశీలనగా అతని ముఖంలోకి చూస్తూ అడిగాడు శశాంక.

"అదే అర్థంగాని విషయం ఇన్స్పెక్టర్‌గారూ! వాడు జులాయి వెధవలా తిరిగే వ్యక్తి కాదు. రౌడీలతో స్నేహం చేసేలాంటి వాడు కాడు. ఆడపిల్లల్ని టీజ్ చేసే రోమియో కూడా కాడు బుద్ధిగా చదువుకునేవాడు. అలాంటి వాణ్ని దారుణంగా చంపటానికి ఆ కిరాతకులకు చేతులెలా వచ్చాయో. రెండ్రోజుల్నుండీ వాడు కనపడక అన్ని చోట్లా విచారిస్తున్నాను తెల్లవారు ఝామున వీధిలో కొచ్చే సరికి వాడి శవం...." రుద్ధ కంఠంతో చెప్పాడు చక్రపాణి.

"ఇంతకూ మీ అబ్బాయి పేరేమిటి? ఏ కాలేజిలో చదువుతున్నాడు?"

"వాడిపేరు చంద్రశేఖర్. కృష్ణా కాలేజిలో బి.కాం. పైనలియర్"

"మీ అబ్బాయికి ముఖ్యమైన స్నేహితులెవరైనా వున్నారా?"

"ఊఁ.... అయిదుగురితో ఎక్కువగా తిరుగుతుంటాడు. అందులో ఇద్దరు ఈ మధ్యే హత్య కాబడ్డారు."

ఆ మాట వింటూనే ఉలిక్కిపడ్డాడు శశాంక.

"దినేష్, హ్యాప్‌చంద్, పీళ్ళేనా మీ చంద్రశేఖర్ నేస్తాలు?" ఆదుర్దాగా ప్రశ్నించాడు శశాంక.

అవును అన్నట్లు తలాడించాడు చక్రపాణి.

"మిగిలిన ఇద్దరు స్నేహితులపేర్లు?"

"అనంత్, వర్ధన్" చెప్పాడు చక్రపాణి.

"అయిదుగురు మిత్రుల్లోనూ ముగ్గురు మరణించారంటే కారణం—ఈ అయిదుగురూ కలిసి ఎవరికో ఏదో హాని కలిగించారని నా అనుమానం. అలాంటిది మీకు తెలిసి ఏమయినా జరిగితే దాచకుండా నాతో చెప్పండి చక్రపాణిగారూ!" ఆసక్తిగా అడిగాడు శశాంక.

"నో....ఇన్‌స్పెక్టర్! వీళ్ళకి ఆదుకునే మనస్సుంది గానీ, ఆపద కల్గించే బుద్ధిలేదు." గట్టిగా చెప్పాడు చక్రపాణి.

"సరే. ఆ....అనంత్, వర్ధన్‌లను కలుసుకోవాలి నేను. వాళ్ళ అడ్రసులు మీకు తెలుసా?" అడిగాడు శశాంక.

"వాళ్ళు బయటేవున్నారు. పిలుచుకొస్తాను" అని బయటకు వెళ్ళి రెండ్నిముషాల్లో ఇద్దరు కుర్రాళ్ళని వెంట బెట్టుకొచ్చాడాయన.

వస్తూనే శశాంకకు విష్ చేశారిద్దరూ.

వాళ్ళిద్దర్నీ వుండమని చక్రపాణిని, ఆయన భార్యను బయటకు పంపేశాడు శశాంక.

"మీ మిత్రుడు హత్య కాబడటానికి కారణం ఎవరని ఊహిస్తున్నారు మీరు?" ఇద్దర్నీ పరిశీలిస్తూ అడిగాడు శశాంక.

"అసలు వాడు హత్యకాబడటమే మా ఊహకందని విషయం. ఎవరో దారుణమయిన హత్యలుచేసి, రికార్డు సృష్టించాలన్న ఉద్దేశ్యంతో ఇలా చంపారేమోనని మా అనుమానం. లేకపోతే చీమకుక్కూడా హాని తలపెట్టని వాడిని అంత దారుణంగా చంపటం హుఁ....మనిషైన వాడెవడూ

చేయతగ్గ పనికాదది" ఆవేశంగా అన్నాడు అనంత్.

"కేవలం రికార్డు సృషించటం కోసమే అయితే మీ స్నేహబృందాన్నే ఎందుకు ఎన్నుకుంటారు మిస్టర్ అనంత్" తీవ్రంగా ప్రశ్నించాడు శశాంక.

"అదేసార్ మా కర్థంకాని విషయం." అమాయకంగా అన్నాడు వర్ధన్.

"చూడండీ— మీరు నిజం చెపితే మీ మిత్రుల్ని చంపిన హంతకుల్ని పట్టుకోవటానికి వీలుపడుతుంది దయచేసి నా దగ్గర ఏ విషయాన్నీ దాచకుండా చెప్పండి. మీ రీ మధ్య కాలంలో అయిదుగురూ కలపి ఏదన్నా సాహసకార్యం చేశారా?"

ఉలిక్కిపడినట్లు చూశాడు అనంత్.

"ఏ విషయంలో?" అనడిగాడు.

"ఏదైనా కావచ్చు. ముఖ్యంగా ఏ ఆడపిల్లనైనా...." అంటూ అర్థోక్తిలో ఆపాడు శశాంక.

"ఆడవాళ్ళంటే మా కెంతో గౌరవముంది ఇన్‌స్పెక్టర్. తెలిసి ఏ ఆడపిల్లనీ మేమింతవరకూ టీజ్ చేయలేదు. మా కాలేజ్‌లో ఏ అమ్మాయిని అడిగినా మీ కీ విషయం తెలుస్తుంది" చెప్పాడు వర్ధన్.

"పోనీ మీకు తెలియకుండా వాళ్ళు ముగ్గురూ....!"

శశాంక మాట పూర్తి కాకుండానే అన్నాడు అనంత్.

"మాలో మాకు రహస్యాలు లేవు ఇన్‌స్పెక్టర్. మేము ఎలిమెంటరీ నుండి కాలేజి వరకూ కలపి చదివాం. మనుషులం వేరైనా మా మనసులొకటే" దృఢంగా చెప్పాడు.

"మొత్తానికి మీరు అసలు విషయం మాత్రం చెప్పటం లేదు. మీరు అయిదుగురూ కలపి ఏదో చేశారు. అందుకే మీ మిత్రుల్ని ఎవరో చంపారు. మీరు నాతో సహకరించక

పోతే నష్టపోయేది మీరే. మీ మిత్రులకు పట్టిన దుర్గతి మీకూ కలగకుండా వుండాలంటే ఇప్పటికైనా నిజం చెప్పండి" బెదరగొట్టాలని ప్రయత్నించాడు శశాంక.

"ఎలా జరగాలని వ్రాసివుంటే అలా జరగకపోదు ఇన్‌స్పెక్టర్. మా కలాంటి చావు ప్రాప్తిస్తుందని మాత్రం మేమనుకోవటం లేదు" చెప్పారు ఇద్దరూ నిర్భయంగా.

వాళ్ళిద్దర్నుండీ ఇక ఎలాంటి క్లూ దొరకదని వాళ్ళిద్దర్నీ పంపించేసి బయటకొచ్చాడు శశాంక.

అప్పటికి అంబులెన్స్, ఫింగర్ ప్రింటర్స్, ఫోటో గ్రాఫర్స్ రావటంతో.... అక్కడ పనులు పూర్తి చేసుకుని, శవాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించి దాని వెనుకే జీప్‌లో వెళ్ళిపోయాడు శశాంక.

వెళ్ళిపోతున్న అంబులెన్స్‌వైపు చూస్తూ ఆ ఇంటి అరుగుకు దూరంగా కూర్చునివున్న అనంత్‌వర్ధన్‌తో అన్నాడు.

"ఏది ఏమైనా మన మిత్రుల్ని పొట్టన పెట్టుకున్న వాళ్ళని నాశనం చేస్తేగానీ మన మిత్రుల ఆత్మ శాంతించదు" ఆవేశంగా అన్నాడు.

"ఎవరు చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో అర్థం కానిదే ఎవర్నని తుదముట్టిస్తాంరా!" విచిత్రంగా అనంత్‌నే చూస్తూ అన్నాడు వర్ధన్

"ఎవరు చంపుతున్నారో తెలియదుగానీ, ఎందుకు చంపుతున్నారో మాత్రం నేనూహించగలుగుతున్నాను. నా ఊహే నిజమైతే ఆ దుర్మార్గుల పాపం పండినట్లే" అంటూ మెల్లగా అయిదునిముషాలపాటు వర్ధన్ చెవిలో ఏదేదో చెప్పాడు అనంత్.

ఆశ్చర్యం .... ఆవేశం ముప్పిరిగొన్న వదనంతో "అలాగే" అన్నట్లు అనంత్‌ని చూశాడు వర్ధన్.

2

కృష్ణ కాలేజి ముందు మోటర్‌బైక్ ఆపి క్రిందకు దిగాడు శశాంక్.

కాలేజీ ప్రశాంతంగా వుంది. బహుశా చంద్రశేఖర్ మరణంతో కాలేజీకి శెలవు ప్రకటించి వుంటారు, అనుకుంటూ ప్రిన్స్‌పాల్ రూమ్‌వైపు నడిచాడు.

లోపల ప్రిన్సిపాల్ ఒక్కడే వుండి ఏవో ఫైళ్ళు చూస్తున్నాడు. అతనికి యాభై ఏళ్ళుంటాయి. తల చాలా వరకు నెరసి వుంది. మనిషి చాలా నెమ్మదస్తుడిలా అనిపిస్తాడు చూసిన వెంటనే.

శశాంకను చూసి నవ్వుతూ ఆహ్వానించాడాయన.

ఆయనకు ఎదురుగా వున్న సీట్‌లో కూర్చుంటూ....

"మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను సారీ!" అన్నాడు.

"ఫర్వాలేదు. ముఖ్యమైన విషయం కానిదే మీకు మా అవసరం వుండదు కదా!...." చిన్నగా నవ్వుతూ అన్నాడు ప్రిన్స్‌పాల్.

"అవును సర్. చంద్రశేఖర్ హత్య విషయమై మీతో మాట్లాడాలని వచ్చాను. ఇంతకుముందు హత్యకాబడ్డ దినేష్, వ్యాస్‌చంద్ మీ స్టూడెంట్స్. హతులు ముగ్గురూ మంచి మిత్రులనేది తెలుస్తోంది. వీరికి తోడు అనంత్, వర్ధన్ అని ఇద్దరు మిత్రులున్నారు. ఈ మిత్రబృందం మీద ఈ మధ్య కాలంలో ఎవరినుండైనా మీకు కంప్లైంట్స్ వచ్చాయేమో గుర్తుచేసుకు చెప్పగలరా!...."

"నిజానికి ఆ అయిదుగురు స్టూడెంట్స్ మా కాలేజికే గర్వకారణమైన వాళ్ళిన్స్‌పెక్టర్. ఆ వయసులో ఎడ్వంచర్స్ చేయాలనుకోవటంలో తప్పులేదు. అందుకే వాళ్ళు చేసిన పనికి మందలించి వదిలేశాను. ఇది చదివితే మీకే

అర్థం అవుతుంది" అంటూ....ఓ ఫైలుతీసి, పేజీలు తిరగేసి ఓచోట చేత్తో పట్టుకుని శశాంకకు ఫైలందించాడు.

ఆ ఫైల్లో....వాళ్ళ కాలేజి గురించి పత్రికల్లో వ్రాయబడిన వార్తలు కట్ చేసి, విడి పేపర్సుమీద ఆ వార్తను అంటించి....ఏ పత్రికలో ఏ తారీఖున ఆ వార్త ప్రింటు కాబడిందీ వివరాలు వ్రాపివున్నాయి.

ప్రిన్సిపాల్ చూపించిన వైపు దృష్టి మరల్చాడు శశాంక.

ప్రముఖ వారపత్రిక "ఈ రోజు"లో నెలరోజుల క్రిందట ప్రచురించబడిన వార్త అది.

నిధికోసం వెళ్ళిన యువకులకు చెరసాల ప్రాప్తి

విజయవాడ-7. ఇక్కడికి 18 కి.మీ. దూరంలో వున్న ఆనందపురంలోని ఆకాశలోయలోకి ఏలూరు కృష్ణా కాలేజి డిగ్రీ స్టూడెంట్స్ అయిదుగురు నిధి కోసం వెళ్ళి తిరిగి వస్తుండగా....ఆనందపురం గ్రామ ప్రజలు వాళ్ళని అనుమానంమీద ఆపి....ఆ ఊరి పెద్ద భూస్వామి అయిన మణిపాల్ వద్దకు తీసుకు వెళ్ళగా....వారిదగ్గర వున్న బాంబులు, ఆయుధాలు చూపి వారిని నక్సలైట్స్‌గా భావించిన భూస్వామి విజయవాడ క్రైం బ్రాంచికి కబురు చేయటంతో....ఒకటవ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యువకులను అరెస్టుచేసి కేసు పరిశీలనలోకి తీసుకున్నారు....

అది చదవటంతో శశాంక ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చాయి.

"ఆ తర్వాత ఏమయిందో....వాళ్ళెలా విడుదల

పొందారో చెప్పగలరా?" ఆసక్తిగా అడిగాడు శశాంక.

"అనంత్ పెదనాన్న మాజీ ఎం.పి. విజయవాడలో ఆయన మంచి పేరున్న వ్యక్తి కావటంతో తన పలుకుబడి ఉపయోగించి కేసు కొట్టించేసి వాళ్ళని విడుదల చేయించారని తెలిసింది" చెప్పారాయన

"థ్యాంక్స్ సర్ మంచి సమాచారం అందించారు" అంటూ ఆ ఫైలు ఆయనకు ఇచ్చేసి శెలవు తీసుకుని బయల్దేరాడు శశాంక.

3

వసంతవిహార్ హోటల్లో టిఫిన్ చేసి, సిగరెట్ వెలిగించి క్రిందకు దిగి వచ్చిన అనంత్‌ను చూడగానే "హలో గురూ!" అంటూ పలుకరించాడో వ్యక్తి.

ఆ వ్యక్తి వైపు "ఏమిటి?" అన్నట్లు తలెగరేసి చూశాడు అనంత్.

"నీతో కొంత పర్సనల్‌గా మాట్లాడాలి నాతోరా!" అన్నాడు.

ఆ మాటలో ఆజ్ఞాపన గ్రహించిన అనంత్—"ఏ విషయం?" అని సూటిగా అడిగాడు.

"నీ స్నేహితుల హత్య విషయం" చెప్పాడా అపరిచిత వ్యక్తి.

తనలో తనే చిన్నగా నవ్వుకుని "సరే పద" అంటూ అతనితో నడిచాడు అనంత్.

రోడ్డుకు ఎడంచేతి ప్రక్కనవున్న అంబాసిడర్ కారులో కూర్చున్నారు ఇద్దరూ. కారు రివ్వున దూసుకుపోయింది.

అప్పటివరకూ కిళ్ళీకొట్టు చాటున మఫ్టీ డ్రస్‌లో నిలబడి వున్న హెడ్ కానిస్టేబుల్ అక్కడికి దగ్గరలో వున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోకి నడిచి....జరిగింది వివరంగా ఇన్స్

పెక్టర్ శశాంకకు చెప్పాడు.

"కారు నంబరు గుర్తుందా?" అట్నుండి అడిగాడు శశాంక.

"ఏ.ఎమ్ ఎల్. 7777 సార్."

"ఆ కారు శ్రీ లక్ష్మిహోటల్ ప్రొప్రయిటర్ అరుణ్ ఘోష్‌ది కాబోలు."

"అవునుసార్. నాల్గు ఏడులకారు అతనికేవుంది. కొన్ని అక్రమ కలాపాల్లో మన డిపార్ట్‌మెంట్ కళ్ళుకప్పి చాలా సార్లు తప్పించుకున్నాడు కూడా."

"సరే. ఆ విషయం నేను చూసుకుంటాను. నువ్వు వెంటనే శ్రీలక్ష్మి హోటల్‌దగ్గర నిఘావేసివుండు. అనుమానం కలిగే సంఘటనలు ఏం జరిగినా వెంటనే నాకు తెలియపర్చు."

"అలాగేసార్." అంటూ ఫోన్‌పెట్టేశాడు హెడ్ కానిస్టేబుల్.

4

"మిస్టర్ అనంత్! నేనెవరో నీకు తెలిసే వుంటుంది" కోరగా నవ్వుతూ అన్నాడతను.

"కొన్ని నిమిషాల క్రిందటివరకూ నువ్వు హోటల్ శ్రీలక్ష్మి ప్రొప్రయిటర్ అరుణ్‌ఘోష్‌గానే తెలుసు. కానీ - నన్నిక్కడకు తీసుకురావటం.... ఈ డెన్ సెట్, ఈ గూండా గాళ్ళని చూస్తుంటే నువ్వే నా మిత్రులని చంపిన హంతకుడు 'అరుణ్‌ఘోస్ట్'వి అని తెలుస్తోంది."

"గుడ్. ఇంత తెలిసిన వాడికి వాళ్ళ ప్రాణాల్ని ఎందుకు వాళ్ళ శరీరాల్నుండి వేరు చేశానో కూడా తెలిసే వుండాలే" అదే నవ్వుతో అడిగాడు అరుణ్‌ఘోష్.

"నిధికోసమేగా!" భుజాలెగరేశాడు అనంత్.

"అవును. అందుకోసమే. ఆకాశలోయలోని కాళీమాత మండప పరిసరాల్లో నిధి వున్నట్లు గ్రంథాల్లో నేనూ చదివాను. ఎన్నోసార్లు అక్కడ నిధికోసం గాలించాను. ఆ నిధి రహస్యం సరిగ్గా అవగాహన చేసుకోలేక పోవటంతో దాన్ని సాధించలేకపోయాను. మీరు నిధికోసం వెళ్ళినట్లు తెలియడంతో మరలా వెళ్ళి పరిశీలించాను. అప్పటికే మీరు నిధి వున్న ప్రాంతాన తవ్వి ... ఖాళీ భోషాణం అక్కడే వదిలేసి, నిధిని కాజేసుకుపోయారు. 'ఆ నిధి ఎక్కడ దాచారో చెప్పమని' మీ వాళ్ళని ఎన్ని చిత్రహింసలు పెట్టినా చెప్పలేదు. మీరు వెళ్ళేసరికే ఎవరో ఆ నిధిని వశపర్చుకు వెళ్ళిపోయారని చెప్పారు. అది కట్టుకథని నాకు తెలుసు. అదే కథ నువ్వూ చెపితే ఏమవుతుందో నీకు తెలుసు."

"నే నలా చెప్పను"

"గుడ్. అయితే ఆ నిధి ఎక్కడ దాచారో చెప్పు" హుషారుగా అడిగాడు అరుణ్ ఘోష్.

"నాకొంత టైము కావాలి"

"ఎంత?"

"కనీసం ఓ అయిదారు గంటలైనా"

"నాకు ఓర్పు చాలా తక్కువ. అయినా అవసరం నాది కాబట్టి ఒప్పుకుంటున్నాను. సాయంత్రం నాలుగుగంటలకు ఖచ్చితంగా ఆ నిధి ఎక్కడ దాచిందీ చెప్పాలి. మరలా వాయిదా వేస్తే.... నీ శరీరంలో భాగాలను నేనూ వాయిదాల పద్ధతిలో వేరుచేయాల్సి వస్తుంది. గుర్తుంచుకో" అంటూ వెళ్ళిపోయాడు అరుణ్ ఘోష్.

5

"హలో.... ఇన్‌స్పెక్టర్ శశాంక హియర్"

"నేను సార్. త్రిషిప్టిన్ని"

"ఎనీ ఇన్ఫర్మేషన్?"

"యస్ సార్. రోజులాగే ఈరోజూ వర్ధన్ జిల్లా లైబ్రరీ హాల్లో రెండు నుండి మూడు వరకూ వున్నాడు. కానీ—ఈరోజు అతన్ని కలవటానిక్కి అనంత్ రాలేదు. వర్ధన్ హడావుడిగా ఎక్కడికో బయల్దేరి వెళుతున్నాడు సార్."

"అతనికి అనుమానం రాని విధంగా వెంటనే అతన్ని ఫాలో కా. అతను ఎక్కడికి వెళుతోందీ ప్రతీ పదినిముషాల కోసారి నాకు మెసేజ్ ఇస్తుండు"

"అలాగే సార్"

6

సమయం నాలుగూ పది—

శ్రీలక్ష్మి హోటల్‌కు దూరంగా జీప్‌ను ఆపాడు శశాంక.

జీప్‌ను చూడటంతోనే గబగబా వచ్చాడు హెడ్ కానిస్టేబుల్.

అతను కంగారుగా వస్తుండటంతో ఏదో జరిగి వుంటుదని భావించాడు శశాంక.

"ఏమిటి ... ఏమైంది?" అంటూ ఆత్రుతగా అడిగాడు.

"ఇప్పుడే అనంత్‌ను తీసుకుని ముగ్గురు గుండాలతో టాక్సీలో తంబిలేరు వంతెన వైపు పోతున్నాడు సార్ అరుణ్ ఘోష్" హడావుడిగా చెప్పాడు హెడ్‌కానిస్టేబుల్.

"తంబిలేరు వంతెనవైపా?" ఆశ్చర్యంగా అడిగాడు శశాంక.

ఎందుకంటే—అంతకు ముందే మెసేజ్ పంపిన శ్రీ ఫిప్టీన్....'తంబిలేరు వంతెన దాటిన తర్వాత వచ్చే 'బండరాళ్ళ దిబ్బ' పైకి వర్ధన్ నడుచుకు పోతున్నాడని....ఎందుకోసం ఈ సమయంలో ఒంటరిగా అక్కడికి వెళుతున్నాడో

అర్థం అవటం లేదనీ' ఇన్ఫర్మేషన్ ఇచ్చాడు.

అయితే వీళ్ళిద్దరు మిత్రులూ ఏదో వలపన్నారు. ఈ చిక్కుముడిని ఛేదించాలి అనుకుంటూ హెడ్ కానిస్టేబుల్ని జీపెక్కమని డ్రైవర్ని 'తంబిలేరు వంతెనవైపు పోనీయ్'మని ఆర్డర్ వేశాడు శశాంక.

మరుక్షణం రివ్వున దూసుకుపోయింది జీప్.

7

'బండరాళ్ళ దిబ్బ' ఓ కొండపేరు—

పెద్దపెద్ద బండరాళ్ళు ఎవరో మోసుకెళ్ళి పెట్టినట్లు క్రింద రాయి త్రోస్తే బండరాళ్ళు వరుసగా పడిపోయేట్లు కనిపించే ఆ కొండదగ్గర కారు ఆపి క్రిందకు దిగారు అనంత్, అరుణ్ ఘోష్ అతని కిరాయి గుండాలో ముగ్గురు.

మాట్లాడకుండా కొండపైకి నడవసాగాడు అనంత్.

వెనుకే నడవసాగారు మిగిలినవాళ్ళు.

కొండపైకి చేరేసరికి పావుగంట పట్టింది. ఎదురుగా ముప్పై చదరపు అడుగుల వృత్తపరిధిలో లోతైన లోయ కన్పించటంతో అనంత్ వైపు ఆశ్చర్యంగా చూశాడు అరుణ్ ఘోష్.

"నిధి ఈ లోయలో దాచాం. నాకు అలవాటైన దారే. నా వెనుకే రండి" అన్నాడు అనంత్.

ఓ సెకను అనంత్ ముఖంలోకి పరిశీలనగా చూసి అడిగాడు అరుణ్ ఘోష్—

"పేపర్లో నిధికోసం వెళ్ళి చెరసాల పాలైనట్లు ప్రచురించారు కదా!, ప్రజల, పోలీసుల కళ్ళుగప్పి మీరా నిధిని తీసుకొచ్చి ఈ లోయలో ఎలా దాచగలిగారు?"

చిన్నగా నవ్వి చెప్పాడు అనంత్—

"నిజమే. మేము ప్రాణాలకు తెగించి ఆ నిధిని తెచ్చ

కున్నాం. నిధితో ఆకాశలోయ దిగుతుండగా ఆ ఊరి ప్రజలు మేము వేసుకొచ్చిన మోటార్‌బైక్‌ల చుట్టూ గుమి కూడి వుండటం చూసి నిధి బేజారైపోతుందన్న భయంతో అక్కడే మరోచోట ఆ నిధిని దాచి క్రిందకు వచ్చాం. మేము చేసిన తప్పు మోటార్‌బైక్‌లు వేసుకెళ్ళటం.

ఉదయం ఆకాశలోయవైపు వెళ్ళినవాళ్ళం... సాయం త్రానికి తిరిగి వచ్చాం. అప్పటివరకూ ఆ బైక్‌లు అలాగే వుండటంతో ఆ ఊరి ప్రజలకు ఎన్నోరకాల అనుమానా లొచ్చాయి. దానితో ఆ ఊరి పెదకామందు మణిపాల్‌కు అప్పగించారు మమ్మల్ని.

అక్కడి ప్రజల శ్రమనీ, రక్తాన్నీ పీల్చి పిప్పిచేస్తున్న మణిపాల్‌ని వర్గశత్రువుగా భావించి సంహరించే ప్రయ త్నాల్లో వున్నారట నక్సలైట్స్. ఆ భయంతో.... "మేము నక్సలైట్స్‌మ కాము" అని చెపుతున్నా వినకుండా మమ్మల్ని పోలీసులకు పట్టించాడు. మా పెదనాన్న పలుకు బడితో ఆ కేసునుండి బయటపడ్డాం,

ఆ తర్వాత మేమంతా ఓ రాత్రి మరలా ఆకాశలోయ దగ్గరకు వెళ్ళి ఆ నిధి తీసుకొచ్చి ఇక్కడ దాచాం. ప్రాణం పోతున్నా ఈ నిధి గురించి ఎవరికీ తెలియపర్చకూడదనీ, ఈ నిధివల్ల స్నేహం దెబ్బతినకూడదనీ ప్రమాణాలు చేసు కున్నాం" చెప్పాడు అనంత్.

"ఇన్ని తిప్పలు పడి సంపాదించుకున్న నిధిని ఇంత తేలిగ్గా నాకెలా ఇచ్చేయగలుతున్నావు అనంత్?"

"నా మిత్రుల్లా చావాలని నేననుకోవడం లేదు అంతే" అన్నాడు లోయలోకి నడవటాన్కి ముందడుగు వేస్తూ.

మరేం మాట్లాడలేదు అరుణ్ ఘోష్.

"ఒరేయ్ టైగర్—నువ్వు ఇక్కడే వుండి ఏదైనా ఆపద రాబోతుంటే గట్టిగా లోయలోకి విజిల్ వేయ్ విధి మన చేతుల్లో పడేంతవరకూ ఎవర్నీ నమ్మటానిక్కి వీల్లేదు" అన్నాడు అరుణ్ ఘోష్ అనంత్‌తో లోయలోకి నడుస్తూ.

అరుణ్ ఘోష్ ముందు జాగ్రత్తకు కొద్దిగా జంకాడు అనంత్.

అప్పటివరకూ అనుకున్నట్లే అంతా జరిగింది. కానీ—బయట ఒకడ్ని కాపలాగా వుంచుతాడని మాత్రం ఊహించ లేదు. తర్వాత పరిస్థితి అంతా వర్ధన్‌మీదే ఆధారపడి వుంటుంది అనుకుంటూ మెల్లగా లోయక్రిందకు దిగ సాగాడు అనంత్.

రానురానూ లోయలోకి చీకటి రావటంతో చేతిలోని టార్చి ఆన్‌చేశాడు అరుణ్ ఘోష్.

సరిగ్గా అప్పుడే టైగర్ ఆర్తనాదం ఆ లోయ అంతా ప్రతిధ్వనించింది.

హఠాత్తుగా ఆగిపోయాడు అరుణ్ ఘోష్.

క్షణంకూడా వృధా చేయలేదు అనంత్. అరుణ్ ఘోష్ చేతిలోని టార్చి లాగి దూరంగా పడేసి.... ఒక్కొక్కళ్ళనీ చేతుల్తో త్రోసేస్తూ గబగబా లోయలోకి పరిగెత్తసాగాడు.

ఊహించని ఆ పరిణామానికి అరుణ్ ఘోష్, అతని అను చరులూ తలక్రిందులుగా దొర్లుకుంటూ చాలాదూరం వెళ్ళి పడ్డారు.

తలలు చిట్లి ...కాళ్ళూ, చేతులు కొట్టుకుపోయి.... లేవ లేక, లేవలేక పాక్కుంటూ పైకి రాసాగారు.

అనంత్ లోయపైకి రావటంతోనే కనిపించిన దృశ్యం. తల పగిలి రక్తం కారుతున్నప్పటికీ వర్ధన్‌తో పోరాడు తున్నాడు టైగర్.

చేతిలోకి రాయి తీసుకుని. పగిలిన టైగర్ తలమీద మరో దెబ్బ వేశాడు అనంత్. దానితో స్పృహతప్పి కిందపడి పోయాడు టైగర్.

"కమాన్ అనంత్! ఆ రాళ్ళ వెనుక బాంబ్స్ దాచాను. తీసి ఆ బండరాయి క్రింద పేల్చు. మొత్తం బండరాళ్ళన్నీ దొర్లుకుంటూ ఆ లోయలోకి వెళతాయి. ఆ అరుణ్ ఘోస్ట్ గాడూ, వాడి గుండాలూ సజీవ సమాధులవుతారు. ఈ సైతాన్‌గాడ్ని కూడా ఆ లోయలోకి త్రోసేస్తాను" గబగబా అరిచాడు వర్ధన్.

"నిధి దొరకలేదురా బాబో! అని మొత్తుకున్నా విన కుండా మన ప్రాణమిత్రుల ప్రాణాలు తీసిన ఈ రాక్షసులకు ఇదే తగిన శిక్ష" అంటూ బండరాళ్ళ ప్రక్కన వుంచిన బాంబ్స్‌వైపు పరుగెత్తబోయాడు అనంత్.

అప్పుడే బండరాళ్ళ దిబ్బ వెనుకవైపు నుండి తన పరి వారంతో వస్తూ వాళ్ళ మాటలన్నీ విన్న ఇన్‌స్పెక్టర్ శశాంక—"డోన్ట్ మూవ్ మిస్టర్ అనంత్, హంతకులుగా మారాలని ప్రయత్నించకండి" అంటూ రివాల్వర్ తీసి పట్టుకుని గట్టిగా అరిచాడు.

ఆ సమయంలో అక్కడికి శశాంక ఎలా వచ్చాడో అర్థంకాక అలాగే నిలబడిపోయాడు అనంత్.

బండరాయి ప్రక్కన వున్న బాంబ్స్ స్వాధీనపర్చు కున్నాడు హెడ్‌కానిస్టేబుల్.

"మీరు ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చినట్లయితే ఆ కిరాతకుల ప్రాణాలు తీసి మా మిత్రుల ఆత్మకు శాంతి కల్గించేవాళ్ళం ఇన్స్‌పెక్టర్" ఆవేదనగా అన్నారు అనంత్ వర్ధన్‌లు.

"మీరు హంతకులుగా మారితే మీ మిత్రుల ఆత్మలు

శాంతిస్తాయా?" కోపంగా అన్నాడు శశాంక.

మాట్లాడకుండా తలలొంచుకున్నారు అనంత్, వర్ధన్‌లు.

అదే సమయంలో రక్తం ఓడుతోన్న శరీరాలతో పైకి వచ్చిన అరుణ్ ఘోష్, అతని గూండాలు.... బేడీలతో నిలబడ్డ శశాంకను చూస్తూనే అదిరిపడ్డారు.

"వెల్‌కమ్ అరుణ్ ఘోష్. మీకోసం అత్తవారిల్లు ఎదురు చూస్తోంది" వ్యంగ్యంగా అని—"ఏ నిధికోసమైతే ముగ్గురి ప్రాణాల్ని దారుణంగా బలితీసుకున్నావో....ఆ నిధి హైద్రాబాద్‌లో ఓ స్మగ్లర్ గ్యాంగ్‌నుండి స్వాధీనపర్చుకున్నారు అక్కడి పోలీసులు" చెప్పాడు శశాంక.

అవమాన భారంతో తలవాల్చుకున్న అరుణ్ ఘోష్‌కు, అతని అనుచరులకూ బేడీలు వేసి జీప్‌వైపు తరలించాడు శశాంక. □

పాయసం మహత్యం?



గృహమే కదా స్వర్గసీమ

జొన్నలగడ్డ రామలక్ష్మి

గృహమే కదా స్వర్గసీమ అంటారు—అంటే ఏమిటే అమ్మా అని చిన్నప్పుడు నేను మా అమ్మ నడిగాను.

“ఆడది తెల్లారకట్లే లేచి యిల్లు శుభ్రంచేసి తను స్నానంచేసి లేవగానే మొగుడికి కాఫీ యిచ్చి అడగ్గానే టిఫిన్ పెట్టి అడిగినవీ అడగనివీ వంటకాలతో రెండు పూటలా కడుపునిండా తిండిపెట్టి తనకోసం ఏమీ అడ

క్కుండా ఇంట్లో అందరి అవసరాలనూ తీరుస్తూంటే—
అలాంటి యిల్లాలున్న యింటిని స్వర్గసీమ అంటారు—"
అని నాకు చెప్పిందమ్మ.

"మరి మగాడేం చేస్తాడమ్మా?" అన్నాను.

"మీ నాన్నగారిని చూస్తున్నావు కదమ్మా!" అందమ్మ.

నాన్నగారింట్లో ఏ పనీ చేయరు. అమ్మ తన కన్ని అవసరాలూ తీర్చినపుడు గృహమే కదా స్వర్గసీమ అని మెచ్చుకుంటూంటారు తన కేమాత్రం యిబ్బంది కలిగినా ఈ యిల్లు నరకమని విసుక్కుంటూంటారు.

"మగాళ్ళంతా యిలాగే ఉంటారామ్మా?" అన్నాను.

ఇలా అడగడానికి నా భయం నాకుంది అప్పటికి నా కింకా తొమ్మిదేళ్ళే! మరి చిన్నపిల్లనేకదా—అయినా అమ్మ అస్తమానూ నన్ను పెళ్ళై అత్తారింటి కెళ్ళాల్సిన పిల్లవి—ఇలాగేనా వుండడం అని సాధిస్తూంటుంది.

అబద్ధమెందుకూ—పైకి ఏమన్నప్పటికీ—అప్పట్నించీ పెళ్ళంటే నా కిష్టమే!

పను లెన్ని చేసినా అమ్మ దేనికో దానికి నాన్నగార్ని సాధిస్తూనే వుంటుంది. చాలా విషయాల్లో మీ కసలు బొత్తిగా ఏమీ తెలియదూరుకోండి అని గసిరేది. అపైన పేరంటాలకు వెళ్ళి కాళ్ళకు పసుపు రాయించుకుని వాయనాలు తెచ్చుకుంటుంది. చుట్టుప్రక్కలవాళ్ళతో—ఇంట్లో తను లేకపోతే ఒక్కక్షణం కూడా గడవదని చెబుతుంది.

ఇవన్నీ నాకు సరదా! వంట, ఇంటి పనులు మినహాయించి అమ్మలాగుండడం నాకెంతో యిష్టం.

అమ్మ ఓ రోజున నాన్నగారితో—"మిమ్మల్ని చూసి మగాళ్ళంతా మీకులాగే వుంటారని భయపడి అమ్మాయి పెళ్ళంటే హడిలిపోతోంది—" అని చెప్పింది. అప్పుడు

నాన్నగారు—"చిన్నీ!" అని పిలిచారు.

ఆయన పిలిచిన పిలుపునుబట్టి నాకాయన ఉద్దేశ్యం తెలిసిపోయింది. చాలా అభిమానంగా ప్రేమగా పిలిచా రాయన. వుత్సాహంగానే వెడుదును కానీ పెళ్ళి గురించి పిలిచారు కదా—అందుకని కాస్త సిగ్గుపడుతూ నెమ్మదిగానే వెళ్ళాను.

నాన్నగారు నన్ను దగ్గరగా తీసుకుని—"పెళ్ళయ్యాక మా చిన్నికి ఏ పనీ వుండదు. ఇంటి పనులూ, వంట పనులూ అన్నీ చేసే మొగుణ్ణి తెస్తాను" అన్నారు.

అప్పుడు నేను బాగా సిగ్గుపడ్డానుకానీ ఆయన మాటలు నిజమేనని నమ్మేశాను. అప్పట్నుంచీ నా మటుక్కు నేను కూడా పెళ్ళికొడుకుల్ని అన్వేషిస్తున్నాను.

నా వరుడు నాకంటే అయిదేళ్ళు పెద్దవాడై వుండాలి. మా కులంవాడే అయుండాలి. ఏ వరసలోనూ నాకు అన్నయ్య, బాబయ్య కాకూడదు.

బంధువుల్లో నాకు బావలున్నారు. మామయ్యలున్నారు. వాళ్ళలో నాకిదైన వాళ్ళందరి గురించీ తెలుసుకుంటూండే దాన్ని. అందరిలోకీ రాజారావు నాకు నచ్చాడు అతడు మరీ అంత అందగాడు కాకపోయినా కష్టపడి చదువుతాడు. కష్టపడి చదివేవాళ్ళకు చదువులోవుండే తెలివితేటలు బయట వుండవు—అని క్లాసులో మా ఆడపిల్లలం చెప్పు కునేవాళ్ళం. వాళ్ళు సరదా కబుర్లకు పనికిరారు కానీ— పెళ్ళికైతే చాలా మంచి మొగుళ్ళని నా క్లాస్‌మేట్ వీర రాఘవమ్మ అస్తమానూ అంటూండేది.

రాజారావు నాకు నచ్చడానికి కష్టపడి చదవడ మొక్కటే కారణం కాదు. చుట్టపు చూపుగా వాళ్ళు మాయింటి కొచ్చి నపుడు రాజారావు తల్లి—కొడుకు తనకు అన్ని పనుల్లోనూ

సాయం చేస్తాడని చెప్పింది. రాజారావు వంట లెంత బాగా చేస్తాడంటే—ఆఖరికి ఊరగాయలు కూడా తనే పెట్ట గలడుట.

మా యింట్లో నేనూ. అన్నయ్యా కూడా అమ్మకు సాయం చేయం. నాకు బియ్యం కడగడం. కూరలు తరగడం వంటి పనులు కూడా రావు. నా ఆశలన్నీ నాన్నగారి వాగ్దానంమీదా రాజారావుమీదా పెట్టుకుని నే నింక ఏ పనులూ నేర్చుకోలేదు.

నేను బియ్యే ఫైనలియర్లోకి రాగానే నాన్నగారు నాకు సంబంధాలు చూడ్డం మొదలుపెట్టారు. ఆయన కిప్పుడు చిన్ననాటి వాగ్దానాలు గుర్తున్నట్లులేదు. నాకోసం పెద్ద పెద్ద పొజిషన్లో వున్నవాళ్ళందర్నీ చూస్తున్నారు తప్పితే వంటల గురించి ఆలోచించడం లేదు. ఈ విషయ మాయన కెలా గుర్తుచేయాలో అర్థంకావడంలేదు నాకు.

ఈలోగా నా అదృష్టంకొద్దీ రాజారావు మా ఊరొచ్చాడు. అతడికి మా ఊరి కాలేజీలో లెక్చరర్ వుద్యోగం వచ్చింది. ఇల్లు దొరికేదాకా మాయింట్లో వుండడాని కేర్పాటయింది. అత డింట్లో వుంటున్నాకూడా ఎవ్వరూ అతణ్ణి నాకు తగ్గ పెళ్ళికొడుకుగా మా యింట్లో గుర్తించడంలేదు. ఏదో నాల్రోజులుండి వెళ్ళిపోయే మనిషిలా చూస్తున్నారు.

ఇది లాభం లేదనుకొని నేను నా చలాకీ తనాన్నతడిపై ప్రయోగించాను. అతడు కంపెనీకి చాలా బోరు. బాగా మొహమాటస్తుడు. అయినా సరే ఏదో వంక పెట్టి అతడితో మాట్లాడ్డమే కాక—ఆఖరి రోజున నే నతణ్ణి ప్రేమిస్తున్నట్లు కూడా చెప్పాను. నాన్నగారు నాకోసం చాలా పెద్ద పెద్ద సంబంధాలు చూస్తున్నారనీ అవేమీ నా కిష్టంలేదనీ అతడికి

చెప్పాను. అతణ్ణి చిన్నతనంలోనే ప్రేమించానన్న సగం నిజం కూడా చెప్పాను.

రాజారావు తెల్లబోయాడు. అతడి కాడపిల్లలంటే భయం. వాళ్ళకి ఆమడ దూరంలో వుంటాడు. తనేమీ ప్రయత్నం చేయకుండా ఎవరైనా ఆడపిల్లవచ్చి ప్రేమించానంటే తప్ప అతడు ప్రేమలోపడ్డం జరుగదని స్నేహితు లంతా అతణ్ణి వేళాకోళం చేసేవారు నిజంగానే అలా జరిగేసరికి అతడు తెల్లబో దంలో ఆశ్చర్య మేముంది?

నేను నిజంగానే అతణ్ణి ప్రేమిస్తున్నాననీ ఆటపట్టించడం లేదనీ అర్థంచేసుకుందు కతడికి కొద్దిరోజులు పట్టింది. అప్పుడతడు—"నాలో ఏంచూసి నన్ను ప్రేమిస్తున్నావ్?" అన్నాడు.

"నీ వంట గురించి—" అనేద్దామనుకున్నానుగానీ అసలు విషయం అప్పుడే తెలిపోకూడదని గ్రహించాను. నే నతడికి లేని అందాన్నీ, వ్యక్తిత్వాన్నీ, తెలివినీ పొగిడాను. ఎదుటి మనిషిని మెప్పించాలంటే అతడికి లేని గుణాల్ని పొగడాలి. వున్న లక్షణాలు చెప్పకూడదు.... చచ్చి స్వర్గానున్న బామ్మ నాకు చెప్పిన సుభాషితమది. అదే ప్రయోగించేసరికి రాజారావు అయిసైపోయి నా ప్రేమలో పడ్డాడు.

నేను నాకు తెలిసిన సినిమా, సాహిత్య పరిజ్ఞానా ఉపయోగించి రాజారావును నాచుట్టూ తిప్పుకున్నాను. ఈలోగా అతడికి వేరే యిల్లు దొరికింది.

"నువ్వెళ్ళిపోతే నాకీ లోకమంతా శూన్యమైపోతుంది" అన్నాను.

"మీ వాళ్ళకు నువ్వు చెప్పు. మా అమ్మకు నేను చెబుతాను" అన్నాడతడు.

నేను విషయం అమ్మకు చెప్పాను. కాసేపట్లో నాన్న గారు మండిపడ్డారు. ఈ పెళ్ళికి ససేమిరా ఒప్పుకో నన్నారు. రాజారావును పిలిచి నానామాటలూ అన్నారు. అతడు భయపడిపోయాడు. నే నప్పుడు—"నాకు నువ్వే కావాలి మా నాన్నగారిమాట లెక్కవా, నేనెక్కువా అన్నది తేల్చుకో" అనేశాను.

రాజారావు వాళ్ళమ్మతో మాట్లాడేశాడు. వాళ్ళమ్మ బయల్దేరి వచ్చింది. నాన్నగా రావిడతో "ఈ పెళ్ళి నా కిష్టంలేదు. ఇది జరిగితే మీకు నానుంచి కానీ కట్నంరాదు. ఏ లాంఛనాలూ వుండవు" అని కచ్చితంగా చెప్పేశారు.

"అమ్మా! నువ్వు వాటిగురించి ఆశపడకు. ఓ ఆడపిల్ల నన్నూ, నా గుణాలనూ ప్రేమించింది. ఇలాంటిఅవకాశం నాకు మళ్ళీరాదు" అని రాజారావు తల్లిని నా ఎదురుగానే వేడుకున్నాడు. అది వింటే నాకు జాలేసింది కూడా.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పెళ్ళి ఆగదనితెలిసేక నాన్నగారు కట్నం, లాంఛనాలతో పెళ్ళి ఘనంగానే జరిపించేశారు.

అలా మాపెళ్ళి జరిగింది. నా బియ్యే చదువు పూర్తయ్యే దాకా కాపురానికి వెళ్ళలేదు. రాజారావుకు నేనంటే గొప్ప ఆకర్షణగా వుండేది. నాలాంటి భార్య దొరకడం తన అదృష్టమని అతడంటూండేవాడు.

చదువయ్యాక నేను కాపురానికి వెళ్ళాను. నాకు వంటన్నా, వంటిల్లన్నా బోరన్న విషయం అతడి కప్పుడే తెలిసింది.

"వంట చాలా ఇంట్రెస్టింగుగా వుంటుంది. మగాణ్ణి—నాకే వంటొచ్చు. ఆడపిల్లవు—నీ కెంతసేపు? నేనే నేర్పేస్తాను నీకు వంట రాకపోవడం నా అదృష్టం కూడా! ఎందుకంటే నా కిష్టమైన ప్రకారం నీకు నేర్పుకోవచ్చు"

అన్నాడు రాజారావు.

"నేర్చుకోవాలని నేనూ ప్రయత్నించాను. నేర్పాలని మా అమ్మా ప్రయత్నించింది. కానీ నేనేం తయారుచేసినా భయంకరంగా తయారవుతుంది. నా కింక వంట రాదని తెలిసే నాన్నగారు నాకు పెద్ద సంబంధాలు చూడ్డం మొదలెట్టారు ఇంజనీర్లూ, డాక్టర్లూ అయితే వంటకు వేరే మనిషిని పెట్టుకుంటారుట" అన్నాను.

రాజారావు దెబ్బతిన్నట్లు కనబడ్డాడు. "ఇంత కాలం మా అమ్మకు వంటపనులు చేసి చేసీ విసిగిపోయాను. పెళ్ళయ్యాక ఇంక వంటిల్లు గురించి ఆలోచించకూడదనుకున్నాను...." అన్నాడు దిగులుగా.

"ఇంతకాలం అత్తయ్యకు చేసిపెట్టినవారు—ఇప్పుడు నాకోసం వండలేరా?" అన్నాను.

"వండుతాను. కానీ నువ్వేం చేస్తావ్?"

"నేనూ వుద్యోగం చేస్తాను ..."

అతడు ముందు ఒప్పుకోలేదు. రెండు మూడు నెలలు వంటచేశాక—నేను తనకు వంట విషయంలో బొత్తిగా సాయంచేయనని అతడి కర్థమయిపోయింది. ఆ సమయంలో నేను నవల్లు చదువుకునేదాన్ని. తినేటప్పుడు మాత్రం వంటను మెచ్చుకునేదాన్ని!

"కనీసం కూరలైనా తరిగిపెట్టు!" అని అతడు వేడుకున్నాడు.

మొదటిసారి పక్కగదిలో తరుగుతానని చెప్పి — అక్కడ ఎర్ర సిరాలో ముంచిన గుడ్డ ఒకటి వేలుకి చుట్టుకుని వచ్చాను.

రాజారావు హడిలిపోయాడు. ఇంకెప్పుడూ కూరలు తరగొద్దన్నాడు. పాపం—అతడికి నేనంటే ప్రేమ!

కాపురంపెట్టిన ఆర్నెల్లికే ఆ ఊళ్లోనే ఓ కంపెనీలో నెల కారువందల జీతంమీద నాకో వుద్యోగం వచ్చింది. ఇద్దరికీ వుద్యోగముంటే వంటమనిషిని పెట్టుకోవచ్చని రాజారావుకీ అనిపించింది.

అయితే వంటమనిషిని పెటుకోవడం దగ్గర చిన్న యిబ్బంది వచ్చింది. ఆడమనిషిని పెట్టకోవద్దని అమ్మ మరీ మరీ చెప్పింది. మగాడిని పెట్టుకోవడం రాజారావు కిష్టంలేదు. ఈ విషయంలో ఇద్దరం గట్టి పట్టే పట్టడంతో తాత్కాలికంగా అది వాయిదా పడింది.

నేను కాఫీ, టీలు తాగను. పాలు కాచుకోవడం—తాగడం! టిఫిను కింద పచ్చి బ్రెడ్డు, బిస్కట్లు, కార్న్ ఫ్లేక్సు! వంటయితే అన్నం వేపుడు ముక్కలు....

కాఫీ కలపాలన్నా ఇంకేమయినా వెరైటీ వంటలు కావాలన్నా రాజారావు తనకు తనే చేసుకోవాలి. ఇద్దరం వుద్యోగాలు చేస్తున్నాం కాబట్టి ఎవరూ ఎక్కువగా శ్రమపడిపోతున్నామనుకునేందుకు లేదు.

ఏడాదిలోనే మా దాంపత్య జీవితంలో అసంతృప్తి ప్రారంభమయింది. రాజారావుకి పాటలు రావు. నేనైతే విషాదగీతాలు పాడేదాన్ని. ఎందుకంటే రాజారావు సాయంత్రాలు ఇంటి కాలస్యంగా వస్తున్నాడు. వచ్చేక కూడా నిరుత్సాహంగా వుంటున్నాడు. ఆలస్యమెందుకూ అనడిగానొకసారి.

"ఇల్లు తలచుకుంటే చాలు—బ్రెడ్డూ, కార్న్‌ఫ్లేక్సూ గుర్తుకొచ్చి భయం వేస్తోంది." అన్నాడు రాజారావు.

"నేను గుర్తుకు రావడంలేదా?" అన్నాను.

"నిన్ను తలచుకున్నా అవే గుర్తుకొస్తున్నాయి...." అన్నాడతను.

"జీవితమంటే తిండి ఒక్కటేనా?"

"నాలుగు రోజులు తిండి లేకుండా జీవించి చూడు .."

"అది కాదండీ!" అన్నాను—"మనం తినడానికి బ్రతుకుతున్నామా, బ్రతకడానికి తింటున్నామా?"

"అలాంటప్పుడు దేవుడు మనకు నాలికెందుకిచ్చాడు?"

అప్పుడు నేనో విషా గీతం పాడాను. పెనుచీకటాయె....లోకం ...చెలరేగే నాలో శోకం....విషమాయె మా ప్రేమా....విధియే పగాయే....

"చాలా బాగా పాడతావు...." అన్నా డతడు.

"దేవుడు మన కందుకే నాలి కిచ్చాడు...." అన్నాను.

అత దంతకుమించి మాట్లాడడు. పోనీ తనే వంట చేద్దామా అంటే ఆతడికి కాలేజీ స్టూడెంట్సుతో యిబ్బంది! వాళ్ళ కాలేజీలో ఒక లెక్చరర్ రోజూ తనకూ భార్యకూ వంట చేస్తాట్ట. ఆయనకు నలమహారాజు—అని పేరు. ఎంత రహస్యంగా ఉంచుదామన్నా ఇలాంటివి కుర్రాళ్ళ దగ్గర దాగవు. రాజారావుకు తనీవిధంగా కుర్రాళ్ళనోట్లో నానడం ఇష్టంలేదు.

గృహమే కదా స్వర్గసీమ అంటారు. మాకు మాత్రం యిల్లంటే నరకంలా వుంటోంది. వంటొచ్చిన మగాణ్ణి పెళ్ళిచేసుకుంటే జీవితం సుఖంగా గడిచిపోతుందని నే ననుకున్నాను. కాని రాజారావు వంట చేయడు—తనకు రుచులు కావాలి... అని నే ననుకోలేదు. పోనీ మా అత్తగారొచ్చి మాదగ్గరుండొచ్చు. కానీ ఆవిడ కొడుకు దగ్గరకు రాదు. రాజారావు అక్కగారికెప్పుడూ ఏదో రోగమే! నా అత్తగారెప్పుడూ కూతురింట్లోనే ఉంటుంది.

మా సమస్యకు సమాధానం కోసం నేనింకా ఆశగా వెతుకుతూనే వున్నాను.

2

ఆఫీసులో నా బాస్ పేరు చిదానందం. పేరు తప్ప ముఖంలో ఎక్కడా చిరునగవుండదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవాడిలా గంభీరంగా వుంటాడు. ఆయనలో మరో విశేషం—ఇలా ఆఫీసు టైమైపోయేసరికి అలా ఇంటికి వెళ్ళిపోతాడు. ఆరు మూడైనా మూడారైనా తన ప్రోగ్రాం తప్పకూడదంటాడు. ఆఫీసులో ఎలాంటి ఫంక్షన్నాసరే ఉత్సాహంగానూ, ఆసక్తితోనూ పాల్గొనడు. ఎవరైనా కారణమడిగితే—"గృహమే కదా—స్వర్గసీమ!" అంటాడు.

ఇది నాకు చాలా ఆసక్తిని కలిగించింది. కొత్తగా పెళ్ళైనవాళ్ళం—ఒక్క ఏడాదిలోనే—తీరని అసంతృప్తితో బాధపడుతున్నాం నేను, రాజారావు. పెళ్ళయి ఎన్నేళ్ళో అయిన చిదానందానికి యిల్లంటే అంత ఆకర్షణ ఏమిటో!

ఆ స్వర్గసీమ చూడాలని నాకు కుతూహలం. ఇల్లంటే నరకంలా భావిస్తున్న నేను ఆ యింటికెళ్ళి చూసి నేర్చుకోవలసింది చాలా వుంటుందని నా అనుమానం. చిదానందం భార్య గొప్పింటిదనీ—ఆయనకంటె భాగ్యవంతురాలనీ విన్నాను. కాబట్టి ఆమెకూ వంటొచ్చి వుండదు. వంట రాకుండానే—భర్తకామె స్వర్గాన్నెలా చూపిస్తోందో తెలుసుకోవాలని నాకుంది. అయితే ఒకత్తెనూ వెళ్ళలేను గదా!

బాగా ఆలోచించి ఒక రోజున రాజారావుతో—"మా బాస్ ఇంటికి వెడదామండీ" అని చెప్పాను.

"ఎందుకూ?" అన్నాడతడు.

"బాస్‌తో ఫామిలీ రిలేషన్సుండడం మంచిది. వీలుంటే

ఓసారి డిన్నరుకి రమ్మందాం" అన్నాను.

"మనింట్లో డిన్నరా—వంట చేయడం నావల్లకాదు" అన్నా డతడు

"నేను చేస్తాళ్లెండి—" అన్నాను.

"అలాంటి పని చేశావంటే నీ వుద్యోగం ఊడుతుంది...."

"నా ఉద్యోగం ఊడితే అప్పుడు వంట నేర్చుకుంటాను. సరా ?"

రాజారావింకేమీ మాట్లాడలేదు.

ఒకరోజు సాయంత్రం సరిగ్గా ఆరుగంటల సమయానికి నేను, రాజారావు—బాస్ ఇంటికి బయల్దేరాం. అడ్రసును బట్టి యిల్లు పట్టుకోవడం కాస్త కష్టమయింది. అదో కాలనీలా వుంది. అందులో విసిరేసినట్లున్న వాటిలో—ఓ బంగళా చిదానందానిది.

గేటు మేమే తీశాం. లోపలకు నడిచాం. ఇంటి తలుపులు కూడా తీసివున్నాయి. అయినా గుమ్మం దగ్గర నిలబడడం మర్యాదకదా అనుకున్నాం. కానీ గుమ్మందగ్గర నిలబడగానే ఎదురుగా సోఫాలో మర్యాదగాలేని దృశ్యం చూశాం.

"ఆఫీసులో ఉన్నంతసేపూ నిన్నే తలచుకుంటాను—"

ఈ మాటలు చిదానందం పెదాలనుంచి వచ్చాయి. ఆ మాటలు వింటున్న యువతి ఆయన ఒడిలో వుంది.

రాజారావూ, నేనూ సమంగా ఇబ్బంది పడ్డాం. వెనక్కు తిరుగుదామా అనుకునేలోగా చిదానందం మమ్మల్ని చూశాడు. చటుక్కున లేచివచ్చి మమ్మల్నాహ్వానించాడు లోపలకు. ఆయనకు మా రాక ఆశ్చర్యాన్ని కలిగించింది. ఏ సమయంలోనూ ఆయనింటికి అతిథులు రారుట.

"అయినా మా యింటి తలుపు లెప్పుడూ అతిథుల కోసం తెరిచే వుంటాయి" అన్నాడు చిదానందం నవ్వుతూ

ఆయన నింత చలాకీగా నే నెప్పుడూ చూడలేదు. అదే పైకి అన్నాను.

"శాంతను చూస్తే చాలు నాలో ఉత్సాహం వెల్లివిరుస్తుంది. శాంత సమక్షం నాలో జీవాన్ని నింపుతుంది." అన్నాడు చిదానందం.

అంతటితో ఆగలేదాయన. మే మిద్దరం అక్కడున్నంత సేపూ ఆయన శాంతను పొగడుతూనే వున్నాడు. భార్యను మరీ అంతలా పొగిడేవాళ్ళను నే నెక్కడా చూడలేదు. ఆఖరి కామె మాకు టిఫిన్ తీసుకుని రావడానికి వెడితే చిదానందం తనూ లోపలకు వెళ్ళిపోయాడు. ఇద్దరూ కలిసి ఓ ట్రేతో తిరిగి వచ్చారు.

"నన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేరు" అంది శాంత గర్వంగా.

ట్రేలో వస్తువుల్ని చూచి రాజారావు హతాశుడై పోయాడు. ఓ ప్లేటునిండా కార్న్‌ఫ్లేక్సు—నాలుగు కప్పుల పాలు!

"తనకు రకరకాల వంటలు చేయాలని సరదా! కానీ నావన్నీ ఫారిన్ సరదాలు. ఫారిన్లో ఆడాళ్ళు తమ కాలాన్ని వంటింట్లో వృథా చేయరు. కోమలమైన తమ చేతుల్ని పప్పు రుబ్బడానికీ, అంట్లు తోమడానికీ ఉపయోగించరు.." అన్నాడు చిదానందం—"కడుపు నింపుకుందుకు లక్ష పదార్థాలు బజార్లో వుంటాయి. వాటితోనే కాలం గడిపేస్తాను. అయినా కార్న్‌ఫ్లేక్సునిండా కాలొరీలే .... పొద్దున్నా, సాయంత్రం కూడా మా యింట్లో యిదే టిఫిను...."

"అయితే ఒకరోజు మా యింటి టిఫినూ, డిన్నరుకి

కూడా రావాలి" అన్నానుత్సాహంగా.

చిదానందం ఒప్పుకోలేదు.

"శాంత బయటకు రాదుట. వివాహమైనాక కొంతకాలం పాటు—అంటే కొన్నేళ్ళవరకూ—అనగా పిల్లలు పుట్టే వరకూ—భార్యాభర్తలు తమ ఏకాంతాన్ని పార్టీల పేర్లు చెప్పి వృథా చేసుకోకూడదుట...."

శాంత అలాగనడంలోని అసలు రహస్యం అప్పటికి నాకు తెలియకపోయినా—ఆయన నా విషయం చెప్పడంలో మమ్మల్ని మళ్ళీ తనింటికి రావద్దన్న హెచ్చరిక నాకు ధ్వనించింది.

రాజారావు మాత్రం చాలా డల్‌గా అయిపోయాడు. అక్కణ్ణించి బైటపడ్డాక—"ఇక్కడికి నన్నెందుకు తీసుకొచ్చావో అర్థమయింది. కార్న్‌ఫ్లేక్సూ, బిస్కట్లూ, బ్రెడ్డూ తింటూ గృహమేకదా స్వర్గసీమ అనుకోమంటావు అందుకుదాహరణగా మీ బాస్‌ను చూపించావు. అవునా?" అన్నాడు నాతో.

"నా ఉద్దేశ్యమది కాదు. అనుకోకుండా ఇలా జరిగింది" అన్నాను.

"ఏది ఏమైనా ఈ రోజుతో నా కళ్ళు తెరుచుకున్నాయి. కడుపు నిండాకే ప్రేమ! కడుపు నిండకపోవడంవల్ల దాంపత్య జీవితపు తొలి మాధుర్యాన్ని కోల్పోతున్నాం. ఇది మళ్ళీ మనకు దొరికేది కాదు. ఈ విషయంలో ఇక నీ మాట వినను. మీ బాస్‌లాగే గృహమే కదా స్వర్గసీమ అని ఎగురుకుంటూ యిల్లు చేరడం కోసం నేనో వంటమనిషిని చూస్తాను" అనేశాడు రాజారావు.

నేనేమీ అనలేక ఊరుకున్నాను.

రాజారావు వంటమనిషి గురించి అన్వేషణ ప్రారంభిం చాడు. చిదానందం అన్యోన్య జీవితం చూశాక వంటమనిషి విషయంలో నేనూ రాజీపడాలనిపించింది. ఒక్క వంట విషయంలో తప్ప రాజారావుకు నేనంటే అసంతృప్తిలేదు. అతడి మనసుకు తృప్తిగా వంటచేసే మనిషికోసం నేనూ అన్వేషించాలనుకున్నాను.

3

ఇంకా మాకు వంటమనిషి దొరకలేదు కానీ ఒకరోజు సాయంత్రం నేనూ మా వీధిలోని ఇరుగుపొరుగులతో కలిసి మహిళామండలికి వెళ్ళాను. అక్కడికి నేను వెళ్ళడం అదే మొదటిసారి!

మహిళామండలిలో కొత్త మెంబర్సును చేర్చడానికి ప్రయత్నిస్తున్నారు. అందులో చేరితే నాకూ కాలక్షేపంగా వుంటుంది కదా అనిపించి అసలు వ్యవహార మేమిటో చూద్దాంగదా అని ఆ రోజు వెళ్ళాను.

అనుకోకుండా అక్కడ వంటమనుషుల టాపిక్ వచ్చింది.

"ఈ రోజుల్లో చాలామంది గృహిణులు ఉద్యోగాలు చేస్తు న్నారు. అటు ఆఫీసు, ఇటు వంట చూసుకోవాలంటే వారి కిలాంటి మహిళామండలిలో పాల్గొనే అవకాశముండదు. అందుకే భార్యాభర్త లిద్దరూ ఉద్యోగాలు చేసే యింట్లో విధిగా ఓ వంటమనిషి ఉండాలి...." అన్నదొకామె.

నేను వెంటనే—"మంచి వంటమనుషులు దొరకడం ఒక పెద్ద సమస్యగా వుందీ రోజుల్లో" అన్నాను.

ఆమె చటుక్కున నావైపు తిరిగి—"మీకు వంటమనిషి కావాలా? నేను కుదిర్చిపెడతాను. అయితే మీరు నాకు యాభై రూపాయలు చందా యివ్వాలి" అంది.

"చందా ఎందుకు?" అన్నాను.

"మహిళా వికాస సమాజం కోసం నేను చందాలు వసూలుచేస్తున్నాను. మొత్తం లక్షరూపాయలు వసూలు చేయాలి. నా వాటా పదివేల రూపాయలు. అంత సులభంగా చందా లెవరిస్తారు? అందుకని ఇలాంటి ఉపాయాలు."

"రేపు మా ఇంటికి రండి. తప్పకుండా చందాయిస్తాము. అయితే టైము తొమ్మిదిన్నర దాటితే నేను ఆఫీసుకు వెళ్ళి పోతాను" అన్నాను.

"ఎందుకైనా మంచిది—మీ యింటి అడ్రసూ, ఆఫీసు అడ్రసూ కూడా యివ్వండి" అందామె.

ముందు ఇంటి అడ్రసు చెప్పాను. ఆమె నోట్ చేసుకుంది. ఆఫీసు అడ్రసు చెప్పగానే ఆమె ఆశ్చర్యపడింది—"అయితే మీరు వందరూపాయలు చందా కట్టాలి" అంది ఉత్సాహంగా.

"ఇప్పుడేకదా యాభై అన్నారు" అన్నాను.

"యాభై మిగతావాళ్ళకు. మావారి ఆఫీసులో పనిచేసే వాళ్ళకు వందరూపాయలు. చందాలు వసూలు చేయడంలో మావారి పేరుపయోగించుకోవడంలో తప్పులేదుగదా—" అందామె.

"మీవారంటే?"

"చిదానందం" అందామె.

తెల్లబోయినా తమాయించుకుని—"చందాకోసం మీ రబద్ధం చెబుతున్నారు. చిదానందం భార్య నాకు తెలుసు. ఆమెపేరు శాంత!" అన్నాను.

ఆమె ముఖం గంభీరంగా అయిపోయింది—"మీరు వెళ్ళి చిదానందంగారినే అడగండి. తన భార్యపేరు మాధురి అని చెబుతాడు" అందామె.

"కానీ నేను స్వయంగా...." అని ఏదో అనబోతుండగా ఆమె కలగజేసుకుని—"మీరు చెప్పే శాంత గురించి నాకు తెలుసు. ఆమె మా యింట్లో వంటమనిషి!" అంది.

"వంటమనిషా—అలా అనిపించలేదే?" అన్నాను.

నా ఉద్దేశ్యాన్ని మాధురింకోలా అర్థం చేసుకుందేమో గర్వంగా నవ్వి—"నేను కలిగినింట్లో పుట్టాను. వంట నేర్చుకోలేదు. మా నాన్నే చిదానందానికీ కంపెనీలో ఉద్యోగమిప్పించాడు. మా నాన్న నడిగి నేనే ఓ వంటమనిషిని పెట్టించాను. ఎందుకంటే ఈయనకు వంటవచ్చు. షడ్రుచులూ కావాలి. అందుకే వంటమనిషి....మా యింట్లో వంట మనుషులు — ఇంట్లో మనుషల్లాగే నీటుగా దర్జాగా వుంటారు. నాకు క్లబ్బులూ అవీ లక్ష వ్యవహారాలు. సాయంత్రాలెప్పుడూ యింట్లో వుండను. రాత్రి ఎనిమిది దాటితేకానీ యిల్లు చేరను. అలాంటప్పుడు మా యింటికి వెళ్ళి మీరు శాంతను చూసి వుంటారు. అవునా?" అంది.

"ఊఁ" అన్నాను. శాంతనెలా అక్కడ చూశానో ఆమెకు చెప్పడం అనవసరమనిపించింది.

"మీరు తప్పక చందా యిస్తారని నాకు నమ్మకముంది. అందుకని వంటమనిషి వివరాలిప్పుడే చెప్తున్నాను. ఆమె శాంతకు చెల్లెలే! శాంతకంటే బాగుంటుంది కూడా. నేను బొత్తిగా యింట్లో వుండనుకదా—మరీ అంత అందమైన దాన్నింట్లో వదలడం యిష్టంలేక—ఆమె అక్కను కుదుర్చుకున్నాను." అంది మాధురి. ఆమె మాటల కక్కడున్నవారందరూ నవ్వారు.

నేను మాత్రం—"నాకు వంటమనిషి అవసరం లేదంటే చందా ఇవ్వక్కర్లేదుకదా!" అన్నాను.

"మావారి ఆఫీసులో పని చేస్తున్నారుగదా—ఎలాగైనా

మీకు తప్పదు" అందామె.

"అయితే చందా యిస్తాను కానీ—వంటమనిషి అక్కర్లేదు" అన్నాను.

"ఇంతకుముందే కదా—కావాలనుకున్నారు?" అంది ఆమె.

నేను నవ్వి, ఊరుకున్నాను. శాంత చెల్లెలి వర్ణనే నన్నందుకు విముఖురాల్ని చేసిందని అక్కడ కొందరను కున్నారు గానీ అసలు కారణం శాంత అని ఎవరికీ తెలియదు.

ఆ తర్వాత ఇంటికి వెళ్ళి అసలు విషయం రాజారావుకు చెప్పాను.

"ఏమిటీ ఆ శాంత వంటమనిషా?" అన్నాడు రాజారావు తెల్లబోయి.

"అవును. చిదానందమంటే ఏమిటో అనుకున్నాను. ఇంట్లో కృష్ణయ్య. వీధిలో రామయ్య అన్నమాట...." అన్నాను.

"అందులో ఆయన తప్పేముంది? ఆయనేం కావాలని వంటమనిషిని పెటుకోలేదుగదా....అంతా ఆ భార్యే చేసింది" అన్నాడు రాజారావు.

"అయితే ఏమంటారు?"

"నేనూ అంతే చేయాలి. ఆ శాంత చెల్లెల్ని మనింట్లో కుదర్చకూడదూ?" అన్నాడు రాజారావు. అతడి కళ్ళలో రవంత మెరుపను కూడా చూశాను.

"శాంత చెల్లెల్ని కుదుర్చడమెందుకూ—నన్నే వంట మనిషనుకోవచ్చుగదా!" అన్నాను కాస్త కసిగా.

"అలా ఎలా కుదురుతుంది?"

"ఎందుక్కూడదరదు? రుచులకోసం వంటమనిషి కావాలన్న పెద్దమనిషి—ఆ మనిషెక్కడ కందిపోతుందోనని—మళ్ళీ కార్న్‌ఫ్లేక్సూ, బ్రెడ్డూ తింటున్నాడు. శాంత చెల్లెల్ని కుదిర్చితే మీరైనా అంతేగదా చేసేది?" అన్నాను.

నేనీ పాయింటు వేస్తానని అతడూహించినట్లు లేదు. భారంగా నిట్టూర్చి—"నువ్వు చాలా తెలివైనదానివి. మాటల్లో నిన్ను నెగ్గడం చాలా కష్టం" అన్నాడు.

నేను తెలివైనదాన్ని కాబట్టే ముందే తెలివిగా రాజారావును భర్తగా ఎన్నుకున్నాను. ఇప్పుడు మళ్ళీ నా తెలివి చూపాల్సిన సమయం వస్తోంది.

అదే చిదానందాన్ని బ్లాక్ మెయిల్ చేయడం!

4

మర్నాడాఫీసులో చిదానందాన్ని—ఆయన పర్సనల్ రూంలో నే కలుసుకుని—"మీగురించిన గొప్ప నిజమొకటి నాకు తెలిసింది" అన్నాను

నా ధోరణి కాశ్చర్యపడుతూ — "ఏమిటది?" అన్నాడాయన.

"మీరు యింట్లో కృష్ణయ్య—వీధిలో రామయ్య!" అన్నాను.

"అంటే?" అన్నాడాయన. ఇప్పుడాశ్చర్యం కంగారుగా మారింది.

"మీ భార్యపేరు మాధురి. శాంతకాదు ..."

"నీ కెలా తెలుసు?" ఇప్పుడాయన కంగారు భయంగా మారింది.

జరిగింది చెప్పాను నేను.

చిదానందం నిట్టూర్చి—"నేను కావాలని తప్పుచేయడం

లేదు. శాంతలో ఏదో ఆకర్షణ వుంది. ఒంటరి మగాణ్ణి... నన్ను రెచ్చగొడుతుంది. నేనామెకు లొంగిపోయాను. నన్ను వశపర్చుకున్నాక ఆమె వంటచేయడం మానేసింది. వంట చేయకపోతే మాధురి ఆమెను పనిలోంచి తీసేస్తుందని భయపడి నేను సాయంత్రాలు పెందరాళే యింటికి వెళ్ళి—ఆమె తరపున నేనే వంట చేస్తున్నాను—....." అన్నాడు.

"అంటే మీరు వంటమనిషికి వంట చేస్తున్నారన్న మాట!" అన్నాను.

చిదానందం తల ఊపాడు. భార్య విషయమెలాగున్నా ఇప్పుడాయన శాంతను వదులుకోలేని స్థితికి వచ్చాడు. మొత్తానికి వంటమనిషి వచ్చినా ఆయనకు వంట తప్పలేదు.

"ఈ రహస్యం నా భార్యకు చెప్పొద్దు. నేను నీకే సాయం కావాలన్నా చేస్తాను" అన్నాడాయన వేడుకుంటున్నట్లు.

నే నా రహస్యాన్ని బాగానే ఉపయోగించుకున్నాను. మా కంపెనీలోనే వేకన్సీ కాళీ ఒకటి వచ్చింది. క్వాలిఫికేషన్సన్నీ నా భర్తకు సరిపోతాయి. జీతం లెక్చరరుద్యోగానికి రెట్టింపు. రాజారావుకీ ఉద్యోగం రావడానికి చిదానందం సాయపడ్డాడు.

"అయితే ఇక నేనూ ఓ వంటమనిషిని పెట్టుకోవచ్చు" అన్నాడు రాజారావుద్యోగంలో చేరాక.

"అదే మగబుద్ధంటే—వంటమనిషికి చేసే సాయాలేదో పెళ్ళానికే చేయొచ్చుగదా—" అన్నాను.

"ఇంతపెద్ద ఆఫీసర్నయ్యాక కూడా నేనే వంట చెయ్యాలా?" అన్నాడు రాజారావు దర్పంగా.

"అవును. ఎందుకంటే యిప్పుడు మీకు విద్యార్థులు పేర్లెడతారన్న బెంగకూడా లేదుకదా!" అన్నాను.

రాజారావుకో పాయింటు పోయింది.

రోజూ ఆఫీసునించి మేమిద్దరం కలిసే యింటికి పోతూంటాం. ఒకోసారి ఇద్దరం కలిసి హోటలుకు పోతూంటాం. ఒకోసారి విడివిడిగా వేర్వేరు సినిమాలకు పోతాం. మేమిద్దరం ఒకే ఆఫీసులోనే పనిచేస్తున్నా మా కార్యక్రమాలకు స్థిరమంటూ వుండదు. కానీ చిదానందం మాత్రం ఆఫీసు వదలగానే ఠంచనుగా ఇంటికే వెళ్ళిపోతూ వుంటాడు.

అదేమిటని నేనడిగితే నవ్వి ఊరుకుంటాడు. ఇంకెవరైనా అడిగితే — "గృహమే కదా స్వర్గసీమ!" అంటాడు. □

బంధుప్రేమ?



విషం తాగిన 'హంతకుడు'

దీపిక

నా పేరు శేఖర్. నేనొక సంవత్సరంగా 'హిమాలయా ఏజన్సీస్' లో పనిచేస్తున్నాను. నేను చేసేది డ్రైవరుద్యోగం.

మా షావుకారు పేరు రామచంద్రరావు. అతనికి హిమాలయా ఏజన్సీస్, కాక ఎరువులు డిస్ట్రిబ్యూషన్ కూడా వుంది. ఊర్లో 4 ఇళ్ళున్నాయి. చుట్టుప్రక్కల ఇరవై

గ్రామాలకు ఫ్యాన్సీ సరుకులు, ఎరువులు సప్లై చేస్తాడు.

నేను వారం అంతా ఈ గ్రామాలన్నీ తిరిగి సరుకులు వేసి వస్తుంటాను. బయట ఊర్లు వెళ్తే భోజనానికి కాక ఇరవై ఐదు రూపాయలు ఇస్తాడు మా షావుకారు.

నా జీతం భోజనానికి, ఇతర ఖర్చులకి, ఇంటద్దెకు సరి పోతుంది. రోజూ మందుకొట్టకుండా వుండలేను. ఈ జీవితంమీద విసుగుపుట్టింది.

అందుకే ఓ ప్లాను వేసాను. ఆ ప్లాను సక్సెస్ అవ్వాలి అంటే, నేను సరుకులు వేసుకొని వెళ్ళే వ్యాన్ అవసరం. అందుకే యివాళ ఆదివారం అయినా కూడా ఓ పదిరూపాయలు ఎక్కువ యిస్తానని మా షావుకారు అన్నాడు, కనుక పనిలోకొచ్చాను.

నేను మా షావుకారింటికి చేరేసరికి ఆయన ఏవో అకౌంట్స్ చూసుకుంటున్నాడు. నన్ను చూడగానే, "రావోయి శేఖర్! రా! ఎనిమిది గంటలకు వస్తానన్నావు. అప్పుడే తొమ్మిది అయింది. ఇవిగో వాన్ తాళాలు. గొడౌనువద్ద మా పెద్దబ్బాయి వున్నాడు ఎవరికి ఏ సరుకులు వేయాలో లిస్ట్‌కూడా వాడివద్దే వుంది వెళ్ళు. వెళ్ళి సరుకులు లోడ్ చేసుకొని, వెళ్ళి దింపేసి వచ్చేయ్" అంటూ తాళాలు అందించాడు.

నేను తాళాలు తీసుకొని వచ్చేయబోయాను,

"ఆ! అన్నట్లు మరచాను నువ్వు ఏ రాత్రికైనా తిరిగి వచ్చేయాలి. రేపు ఈ ప్రక్కనున్న ఊర్లకి సరుకులు వెయ్యాలి. ఆ రామానగరం కృష్ణారావు బాకీ ఇంకా ఇవ్వ లేదు. ఒకసారి జ్ఞాపకం చెయ్యి" అని జేబులోంచి ఓ ఇరవై రూపాయలు తీసిచ్చాడు. "మిగిలింది రేపిస్తాలే" అన్నాడు.

మారు మాటాడకుండా తిరిగి వచ్చేసాను.

గొడౌనుకి వెళ్ళి సరుకులు లోడ్‌చేసుకొని బయలు దేరాను. ఓ రెండుమూడు చిన్న ఊర్లలో సరుకులు దింపి, ముట్టినట్లు రసీదులు తీసుకొని పిరిపురం బయలుదేరాను.

పిరిపురం మరీ పెద్ద ఊరు కాకపోయినా అంత చిన్న ఊరుకూడా కాదు. తాలూకాఫీసు వుంది, పోలీసుస్టేషను కూడా వుంది.

ఆ ఊరిలో సరుకులు వేసుకొనేది రామయ్య అనే ఆసామి. అతనికి ఊర్లోనే దుకాణం వుంది. ఫ్యాన్సీ, మందులు, ఎరువులు కూడా అమ్ముతాడు. రామయ్యకు ఇవేకాక వడ్డీ వ్యాపారం, ఓ నలభై ఎకరాల పంటపొలం కూడా వున్నాయి. ఆయనకు ఓ కొడుకు, కూతురు ఇద్దరూ పట్టణంలో చదువుకుంటున్నారు. రామయ్య భార్య చని పోయి పదిసంవత్సరాలయింది. ఒంటరిగా వుంటున్నాడు.

డబ్బుమీద ఎంత ఆశ వున్నా ఆదివారంనాడు మాత్రం చస్తే దుకాణం తీయడు. ఆదివారం నాడైనా ప్రశాంతంగా గడపాలని కోరుకొంటాడు. అందుకే ఊరిలో ఉన్న ఇల్లు అద్దెకిచ్చేసి, ఊరికి చివరగా ప్రశాంతంగా వుంటుందని ఇల్లు కట్టుకున్నాడు. ప్రతీ ఆదివారం ఇంట్లో పనిమనుషు లని ఎవరినీ వుంచడు. వంటమనిషి ఉదయాన్నే టిఫిన్, వంటచేసి వెళ్ళిపోతుంది. మరల సాయంత్రం 4 గంటలకు గానీ రాదు.

ఈ విషయాలన్నీ సేకరించి ఆదివారం రోజునే ముహూర్తం పెట్టాను.

ఇక్కడో విషయం చెప్పాలి. రామయ్య ఊరికి దూరంగా ఇల్లు కట్టుకొన్నాడని చెప్పాను కదా, ఆ ఇల్లు నేను వెళ్ళే దారిలో లేదు. ఊరికి ఆ చివర వుంది. నేను

రామయ్య ఇంటికి వెళ్ళాలంటే ఊర్లోంచి వెళ్ళాలి. లేదా చిన్న మట్టిరోడ్డు వుంది, ఆ రోడ్డులో వెళ్తే ఓ అరగంట ఎక్కువ సమయం పడుతుంది. కానీ తప్పదుగా.

పిరిపురం ఇంకో మైలుందనగా వాన్‌ను స్లోచేసి ఆ చిన్న మట్టిరోడ్డులోకి మళ్ళించాను. ఈ త్రోవలో వెడితే రామయ్య ఇంటికి కొద్ది దూరంలోనున్న చింతతోపు వద్దకు చేరుకో వచ్చు. వాన్‌ను మెల్లగా పోనిచ్చాను.

చింతతోపు చేరగానే వాన్‌ను ఆపి చుట్టూ పరికించాను. ఓ పదిగజాల దూరంలో దట్టంగా చెట్లు కనిపించాయి. వాన్‌ను ఆ చెట్ల వెనుకకు తీసుకొని వెళ్ళి ఆపాను. క్రిందకు దిగి మరల చుట్టూ కలయచూసాను. పంటసీజను కాదు కదా. చుట్టుప్రక్క లెవరూ కన్పించలేదు.

అడుగులో అడుగు వేసుకుంటూ రామయ్య ఇంటిదెసగా సాగాను. రామయ్య ఇంటి సమీపంలో ఎత్తుగా ఎదిగిన పొదలవెనుక దాగి నిలబడి. ఇంటివైపు దృష్టి సారించాను.

అంతే. గుండాగినంత పనయింది. ఎదురుగా రామయ్య ఇంటి ముందు పోలీసుకారు.

పోలీసుస్టేషను—చుట్టుప్రక్కల పది గ్రామాలకీ ఒకటే వుంది. అదీ ఈ ఊర్లో వుందని ఇందాక చెప్పానుగదా. ఆ పోలీసు స్టేషను అధికారి ఇన్‌స్పెక్టరు భూషణానికి, ఈ రామయ్యకు దోస్తీ. ఇద్దరూ చదరంగం పిచ్చిగాళ్ళు. ప్రతీ ఆదివారం రామయ్యతో చదరంగం ఆడటానికి ఇనస్పెక్టరు రామయ్య ఇంటికి వస్తాడు. పదినుంచి, పదకొండు గంటల వరకు చదరంగం ఆడి వెళ్ళిపోతాడు. ఈ సంగతే మర్చి పోయాను నేను.

వాచీ చూసాను.

పావుగంట తక్కువ పదకొండు.

ఓ పావుగంట ఓపికగా కాచుకొన్నాను. ఊహూ! ఇన స్పెక్టరు బయటకు రాలేదు. ఇంకో పావుగంట గడిచింది. పదకొండు ఇరవై అవుతుండగా ఇన్స్పెక్టర్ వెలుపల కొచ్చాడు. అతనితోపాటు రామయ్య కూడా అరుగుమీదకు వచ్చాడు.

ఇన్ స్పెక్టరు రామయ్యకేసి తిరిగి "వెళ్ళి వస్తాను" అని చెయ్యిఊపి కారెక్కి, రివర్స్‌చేసి వెళ్ళిపోయాడు. ఇన్ స్పెక్టర్ వెళ్ళగానే రామయ్య ఇంటిలోనికి నడచి తలుపు వేసుకొన్నాడు.

మెల్లగా శబ్దం చేయకుండా చెట్లవెనుక నుంచి కదిలాను. జేబులో రివాల్వరుందో లేదో తడిమి చూసుకున్నాను. రామయ్య ఇంటివద్దకు చేరి, మెట్లెక్కి తలుపుతట్టాను.

"ఎవరూ?" రామయ్య గొంతు విన్పించింది లోనుంచి.

"నేనండి. శేఖర్‌ని. హిమాలయా ఏజన్సీస్. శేఖర్‌ని" అన్నా నేను.

"ఏం? ఇలా వచ్చావు. ఏం కావాలి?" తలుపు తీయ కుండానే, గుమ్మం ప్రక్కనున్న కిటికీ తలుపు తెరచి అడి గాడు.

"మా షావుకారుగారు ఓ ప్యాకెట్ మీ కిచ్చేయ మంటేను."

"అలాగా! ఏమిటది?" అనుమానంగా అడిగాడు.

"ఏమో తెలీదు. తలుపు తీయండి" అన్నాను విసుగ్గా ముఖంపెడుతూ.

"నేనేం ఆర్డరివ్వలేదే. అయినా ఆదివారం సరుకులు ఏవీ పంపవద్దని మీ షావుకారుకి ఓ వందసార్లు చెప్పాను" రామయ్యకూడా చిరాగ్గా అన్నాడు.

కోపంతో నా చెయ్యి జేబులోని రివాల్వర్‌కి గట్టిగా

బిగుసుకుంది.

"అయ్యా. నాకింకా చాలా పనులున్నాయి. ప్రక్క ఊర్లలో సరుకులు దించాలి. తలుపు తీయండి బాబూ ఆలస్యం అవుతోంది" అని మొత్తుకొన్నాను.

"ఇలా ఇచ్చెయి" కిటికీలోంచి చెయ్యి చాపుతూ అన్నాడు.

"ఆ ప్యాకెట్ బరువుగా వుంది. అదిగో ఆ గుమ్మంవద్ద వుంది. అయినా ఆ కిటికీ ఊచల్లోంచి దూరదు. తలుపు తీయండి" కొద్దిగా కోపం ప్రదర్శిస్తూ అన్నాను.

ఏం అనుకొన్నాడో ఏమో—కొద్దిగా అనుమానం తగ్గించి, గడియతీసి, తలుపు తెరిచాడు.

కానీ నాకామాత్రం సందు దొరికితే చాలుగా. తలుపు వేసెయ్యకుండా కాలు అడ్డుగా లోనికి పెట్టి, జేబులోనుంచి రివాల్వర్ తీసి అతనికి చూపిస్తూ, రెండోకాలు కూడా లోనికి పెట్టి, తలుపు గభాలున కాలుతోనే మూసి, రివాల్వరు అతనికి దగ్గరగా తెచ్చాను. రామయ్య వెనుకకు జరిగాడు. తలుపు గడియవేసాను.

చూడండి....ఎంత ధైర్యమో, అసలు జంకులేదు. ఏ మాత్రం కంగారు పడకుండా కోపంతో రామయ్య, "ఏమి టిది. ఈ దౌర్జన్యం ఏమిటి. నీకేమైనా మతిపోయిందా?" అన్నాడు.

"షటప్? నేను చెప్పినట్లు చెయ్యి. లేకుంటే చంపే స్తాను" రివాల్వర్‌తో బెదిరిస్తూ అన్నాను.

"శేఖర్! ఇలారా. ఇక్కడ కూర్చొని మాట్లాడు కొందాం" అని కదలబోయాడు.

"కదిలావంటే చంపేస్తాను. నేను యిక్కడికి కబుర్లు ఆడటానికి రాలేదు. మర్యాదగా చెప్పిన పని చెయ్యి"

అన్నాను.

"చూడు శేఖర్. నువ్వు చేస్తున్న పని ఏం బాగాలేదు. ఎంతో మంచివాడివనుకొన్నాను. నా కొడుకులాంటి వాడిని. నీ క్షేమంకోరి చెపుతున్నాను. ఏ గొడవా చేయకుండా వెళ్ళిపో. నేనుకూడా ఈ సంగతి ఎవరికీ చెప్పను. నువ్వు మామూలుగా ఉద్యోగం చేసుకో" రామయ్య బెదురుగా అన్నాడు.

దార్లోకొస్తున్నాడు ముసలాడు.

"నోర్మూసుకొని, చెప్పింది చెయ్యి" అని, "ఏవీ ఇనప్పెట్టె తాళాలచెవులు. ఊ. క్విక్" అని గట్టిగా అరచాను.

"ఆ సొరుగులో వున్నాయి" అని ఓ పెద్దబల్ల చూపిస్తూ అటువైపు అడుగు వేయబోయాడు.

"జాగ్రత్త. ఏమైనా ట్రిక్సు చేసేవా. చస్తావు" అన్నాను.

రామయ్య మాట్లాడకుండా సొరుగుల బల్లవైపు నడిచి సొరుగు లాగబోయాడు. "ఆగు" అనరచి సొరుగుల బల్లవైపు నడిచాను. సొరుగులో రివాల్వర్ లాంటి ఆయుధం ఏమైనా ఉందేమోనని చూసాను. తాళంచెవులు, ఏవో ఫైల్సు తప్ప—ఇంకేం లేవు. తాళంచెవులు తీసి రామయ్యకిస్తూ.

"ఊ: నడు. ఇనప్పెట్టె తాళం తియ్యి" అన్నాను.

రామయ్య ఒక్క నిట్టూర్పు విడచి మారుమాట్లాడకుండా ఇనప్పెట్టె వద్దకు నడచి తాళంతీసి తలుపు తెరచాడు.

ఎదురుగా వంద, ఏభై, ఇరవై, పదుల కట్టలు దొంతర్లు. దొంతర్లుగా పేర్చి వున్నాయి. ఇంకా ఏవో కాగితాలు. ప్రామిసరీ నోట్లు అనుకొంటాను. ఇంకో అరలో బంగారు వస్తువులు. ఒక్కొక్కదానికి చిన్న చిన్న చీటీలు

కట్టి వున్నాయి. తాకట్టుకువచ్చిన వస్తువులు అయుంటాయి. నేను కన్నార్పకుండా ఇనప్పెట్టెలోకే చూస్తూ వుండి పోయాను. ఇంతలో రామయ్య కదలినట్లనపించి,

"జాగ్రత్త. కదిలావంటే కాల్చేస్తాను, ఇదిగో ఈ బ్యాగ్‌లో నోట్ల కట్టలన్నీ సర్దు! ముందు వందలు, యాభైలు పెట్టు" అని నాకూడా తెచ్చిన బ్యాగ్ అందించాను.

రామయ్య ఏడుస్తూ బ్యాగ్ అందుకుని బ్యాగ్‌నిండా సొమ్మంతా సర్దాడు. ఇంకా నాలుగు పదిరూపాయల కట్టలు మిగిలిపోయాయి. అవి తీసి రెండు ప్యాంటు జేబుల్లోను దోపాను.

రామయ్య దీనంగా నావైపే చూస్తున్నాడు.

"ఏమిటది. ఏం చేసావు. ఆ తలుపువద్ద ఏముంది" అన్నాను తలుపువైపు చూస్తూ.

"ఏమయింది. ఏముంది అక్క...." అంతే అతని తల త్రిప్పగానే అతనిమాట పూర్తికాక ముందే రివాల్వర్ వెనుకకు త్రిప్పి కుడిచెవి వెనుక తలమీద గట్టిగా కొట్టాను.

కిక్కురమనకుండా నేలకూలాడు. ఇనప్పెట్టె తలుపు, కాలుతో తన్ని మూసి, మునికాళ్ళమీద కూర్చుని చూసాను. చలనం లేదు. ఎందుకైనా మంచిదని నాడి పట్టుకుని చూసాను. ముసలాడికి—ఒక్క దెబ్బకే గుండాగింది. రివాల్వర్‌కు మళ్ళీ పని చెప్పనవసరం లేకపోయింది.

మెల్లగా లేచి నిలబడ్డాను. బల్లవద్దకు నడిచి అక్కడున్న కుర్చీలో కాసేపు కూర్చున్నాను.

ఎదురుగా బల్లమీద విస్కీసీసా కన్పించింది. ప్రక్కనే గ్లాసు. కొండంత హుషారు వచ్చింది. గ్లాసులోకి విస్కీ నిండుగా నింపి ఒక్క గుక్కలో త్రాగాను. ప్రాణం లేచి

వచ్చింది.

ఇంతలో. ఏదో కారువచ్చి ఆగిన శబ్దం అయింది. ధైర్యం తెచ్చుకొని కిటికీవద్దకు నడచి కొద్దిగా వంగి చూసాను. పోలీసు కారు. వతిపోయింది. ఓ పదినిమిషాలు క్రితమేగా వెళ్ళాడు మళ్ళా వచ్చాడేమిటి చెప్మా!

ఇంకేం ఆలోచించకుండా బ్యాగ్ తీసుకొని ఇంటి వెనుకకు పరుగెత్తాను. ఇంటి వెనుకనున్న పెరటి తలుపు తీసి అక్కడే వున్న చెట్లలోకి పరుగెత్తాను. కొద్ది దూరంలో నున్న చెట్లు వెనుకనున్న వాన్ తలుపుతీసి డ్రైవింగ్ సీట్లో కూర్చుని. వాన్ స్టార్టుచేశాను.

కొద్దిదూరం పోయిన తరువాత వాన్ ఆపి, క్రిందకి దిగాను. వాన్ వెనుకకు చేరి, వెనుకనున్న తలుపుతీసి వాన్‌లోకి చూశాను. ఓ అరబస్తా ఎరువుల పిండి కన్పించింది.

బ్యాగ్ జిప్ ఓపెన్‌చేసి, బ్యాక్‌పాకెట్‌లోంచి రివాల్వర్ తీసి, బ్యాగ్‌లో కుక్కి జిప్ వేసాను. ఎరువుల మూటలోని ఎరువంతా వాన్ ఫ్లోర్‌లో ఒంపి. మూటలో బ్యాగ్ పెట్టి మరల ఎరువుల పిండితో నింపి ఆ మూటమీద చిన్న గుర్తు పెట్టి మిగిలిన ఎరువుల బస్తా క్రిందుగా త్రోసి. వ్యాన్ స్టార్టుచేసుకొని అడ్డత్రోవలో ఊరి మొదలకు చేరి. సిరిపురం గ్రామంలోకి వాన్ నడిపాను, అప్పుడే ఊర్లోకి వచ్చినట్లుగా.

దారిలో ఇద్దరుముగ్గురు పరిచయస్తులు చెయ్యి ఊపారు పలుకరింపుగా. నేనుకూడా వాళ్ళని విష్‌చేస్తూ ఊర్లోకి పోనిచ్చాను వాన్‌ని.

2

ఆ ఊర్లో కొంచెం మంచి హోటల్ కోమలా విలాస్ మెయిన్ రోడ్డులో వుంది. ఆదివారం అవటం వలన షాపు లన్నీ మూసి వున్నాయి—మంగలి షాపులు, మందులు షాపులు తప్ప.

హోటల్ ముందు వాన్ ఆపి లోనికి నడిచాను.

"ఏం శేఖర్. బాగున్నావా. సరుకులు వేసుకొని వచ్చి నట్లున్నావు. రా కూర్చో" అని కుర్చీ చూపిస్తూ, "ఏమిటి పట్టణం సంగతులు" అన్నారు సైకిలుషాపు యజమాని రాజారావుగారు.

"అవునండి. ఆదివారం అయినా మాకు తప్పదుగా" అంటూ ఆయన కెదురుగా నున్న కుర్చీలో కూర్చున్నాను.

సర్వరుకి టిఫిన్ ఆర్డరిచ్చి రాజారావుగారితో కబుర్లలో పడ్డాను. ఇంతలో కిరాణాకొట్టు శెట్టిగారువచ్చి నా ప్రక్కనే కూర్చుంటూ,

"నీకోసమే వచ్చానోయి. శేఖర్. బాగున్నావా?" అన్నాడు.

"ఏమిటి సార్. మళ్ళా సరుకులేవైనా తేవాలా పట్టణం నుంచి" అన్నాను.

"అవునయ్యా. ఓ రెండు బస్తాలు తేవాలి. ఇదిగో ఉత్తరం వ్రాసాను" అని ఉత్తరం, 5 రూపాయల నోటు అందించారు శెట్టిగారు.

"ఆగండాగండి. మన రామయ్యగారింట్లో సరుకులు దించి, ఆయన్ని కనుక్కోవాలిగా మరల ఎప్పుడు రమ్మ నేది. ఈ ఊరిలో మా షాపుకారువద్ద సరుకులు కొనేది రామయ్యగారొక్కరేగా. అదీకాక ఆయన నెలకు సరిపడా సరుకులు ఒక్కసారే వేయించుకొంటారు. ఆయన్ను కను

క్కాని మీకే సంగతి చెప్తాను" అన్నాను.

టిఫిన్ తిని, కాఫీ త్రాగి, సిగరెట్టు వెలిగించాను. ముగ్గురూ ఏవో పిచ్చాపాటి మాట్లాడుకుంటూనే వున్నాం, కానీ నా చూపులన్నీ గుమ్మంవైపే వున్నాయి. ఇంతలో ఇనస్పెక్టరు భూషణం వచ్చాడు భారీశరీరం మోసుకుంటూ. ముఖంలో విషాదం కన్పిస్తోంది. రాజారావుగారడిగారు.

"ఏమండీ ఇన్‌స్పెక్టర్‌గారు అలా వున్నారు?"

"మన రామయ్య...." ఇన్‌స్పెక్టర్ గొంతుక వణకింది.

"ఆ. రామయ్యకేం అయింది" శెట్టిగారు ఆతృతగా అడిగారు.

"ఆత్మహత్య చేసుకొన్నాడు. విషంత్రాగి చచ్చిపోయాడు."

చెప్పలేక, చెప్పలేక చెప్పాడినస్పెక్టర్.

ఎంతైనా స్నేహితుడు కదా.

"ఏమిటీ?" నేను కుర్చీలోంచి లేస్తూ అడిగాను, ఆశ్చర్యం నటిస్తూ.

"కూర్చో. కూర్చో. నువ్వెళ్ళి ఏం చేస్తావు. ఇంక మీ సరుకులతో ఆయనకేం పనిలేదు. అయినా ఇప్పుడిప్పుడే రామయ్య శవాన్ని చూడటానికి అవదు. డాక్టరు పరీక్ష చేస్తున్నాడు, ఫోటోగ్రాఫరు ఫోటోలవీ తీస్తున్నాడు. అక్కడుండలేక వచ్చేసాను. మంచివ్యక్తి. ఎందుకిలా చేసాడా అని." ఇన్‌స్పెక్టర్ అన్నాడు బాధగా.

ఈ వార్త హోటల్ అంతా ప్రాకిపోయింది. హోటల్‌లో వున్న జనం అంతా మా టేబుల్‌చుట్టూ మూగారు.

"పాపం! ఎందుకలా చేసాడో. ఏమిటో. అందులోను విషంత్రాగి ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం ఏమొచ్చిం

దబ్బా" శెట్టిగారన్నారు.

ఇన్‌స్పెక్టరు జేబులోంచి ఒక ఉత్తరం తీసి,

"నేను ఉదయం పదిగంటలకు ప్రతీ ఆదివారం వెళ్ళినట్లే వెళ్ళాను కాలక్షేపంకోసం. ఒక గంట చదరంగం ఆడాము. నే నక్కడున్నంతసేపు హుషారుగా, కులాసాగానే వున్నాడు. అతను ఆత్మహత్యా ప్రయత్నంలో వున్న సూచనలు ఏవీ లేవు.

పదకొండుంపావు అవుతుందనగా మరలా కలుద్దామని చెప్పి వచ్చేస్తుంటే, ఈ ఉత్తరం కవరులో పెట్టి సీలుచేసి ఇస్తూ, సాయంత్రం వరకు తెరచి చూడవద్దని చెప్పాడు. ఏమిటని అడిగాను. సాయంత్రం మీకే తెలుస్తుందిగా. తొందరెందుకన్నాడు. నేను సరేనని శెలవు తీసుకొని వచ్చేశాను.

నా కెందుకో అనుమానం కలిగి, కొంతదూరం పోయాక కారాపి, ఉత్తరం విప్పి చదివాను. ఇలా వుంది. "నేను ఎప్పుడో చేసిన పాపం నా మనసుని కలచివేస్తోంది. ఆ బాధ ఇంక ఎన్నాళ్ళో భరించలేను. అందుకని ఆత్మహత్య చేసుకుంటున్నాను. క్రిందటిరోజే పిల్లలందరి పేరునా విల్లువ్రాసి వుంచాను. నాకున్న ఒకే ఒక స్నేహితులు మీరు. అందుకే ఈ ఉత్తరం మీకు వ్రాస్తున్నాను. శెలవు" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"మీరు వెళ్ళేసరికి చనిపోయున్నాడా?" హోటల్ ప్రొప్రయిటర్ భద్రం అడిగాడు.

"అవునండి భద్రంగారు. నే వెళ్ళేసరికి చనిపోయి వున్నాడు. శరీరం అంతా నల్లగా మాడినట్లుంది అతని టేబుల్ క్రింద ఇదిగో ఈ సీసా దొరికింది. ఇది పొలాల మీద కీటకాలు నాశనం చేసేటందుకు వాడతారు" ఇన్‌స్పె

క్టర్ తిరిగన్నాడు.

"అది ప్రమాదకరమైన విషమా?" నేనడిగాను.

"ప్రమాదకరమని మెల్లిగా అడుగుతావేం. ఈ సీసాలో విషం పదిమక్కలు మనూరి జనాభాకంతకూ సరిపోతుంది. రామయ్య, ఈ విషాన్ని మొత్తం విస్కీ సీసాలో వంపినట్లుగా వుంది. విస్కీసీసాలోని విస్కీ వాసన చూశాను. చాలా ఘాటుగా వుంది వాసన." ఇన్స్పెక్టర్ చెప్పాడు.

నా గుండె 101 కొట్టింది. భయంతో నోట మాటరాలేదు. ఇంకక్కడుంటే నన్నునేను బయట పెట్టుకుంటానేమోనని కొంచెం ధైర్యం తెచ్చుకొని. గుండె స్థిమితం చేసుకొని,

"ఈ విషయం మా షావుకారుకి చెప్పాలి. పోస్టాఫీసుకు పోయి ఫోనుచేసి వస్తాను" అని లేచాను.

"నేనుకూడా వెళ్ళాలి ఇంకా అక్కడ చేయవలసిన పనులున్నాయి" అని ఇన్స్పెక్టర్ కూడా లేచి నిలబడ్డాడు.

బిల్లు చెల్లించి. వెలుపలకొచ్చి నిలబడ్డాను ఇన్స్పెక్టర్ కారు స్టార్టుచేసుకొని వెళ్ళేంతవరకు ఆగి, భారంగా అడుగులు వేసుకుంటూ వాన్ వద్దకు నడిచాను.

అడుగు తీసి అడుగు వెయ్యడమే కష్టంగా వుంది. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారేమోనని వాన్కి జారగిలబడి నిలుచున్నాను కొంతసేపు. అలా ఓ పదినిమిషాలు నిలబడి, వణుకు కొంత తగ్గాక వాన్తలుపు తీసి కూర్చున్నాను. కూర్చున్నాను అన్నమాటేగానీ మనసు మనసులో లేదు. భయాన్ని అదుపులో వుంచి ఆలోచించటం మొదలుపెట్టాను. దొంగతనం చేసినవాడ్ని. చేసి ఊరుకోక నేనా విస్కీ ఎందుకు తాగాలి. అయినా ఎవరైనా అనుకొంటారా విస్కీలో విషం కలిపిందని. ఇదంతా నా తలరాత కాక పోతే మరేమిటి?

కడుపులో దేవినట్లుగా వుంది. ఈ విషం పనిచేయటం ప్రారంభించింది. వెంటనే ఏ డాక్టరు వద్దకో వెళ్తేగాని లాభంలేదు. ఈ ఊరిలోనున్న ఒక డాక్టరూ, రామయ్య శవాన్ని పరీక్ష చేయటానికి వెళ్ళిపోయాడు. అందునా ఈ ఊరి డాక్టర్ దగ్గరికి వెళితే నా చావు నేనే తెచ్చిపెట్టుకొన్నట్లవుతంది.

అః జ్ఞాపకం వచ్చింది, ఇక్కడకు మరో పదిమైళ్ళలో వున్న రామానగరంలో ఓ డాక్టరున్నాడు. ఆ ఆలోచన రాగానే వాన్ స్టార్టుచేసి బయలుదేరాను.

ఊరి వెలుపలకు వచ్చేవరకు మెల్లగా పోనిచ్చి, అక్కడ్నుంచి స్పీడు పెంచాను. సుమారు వందమైళ్ళ స్పీడులో వచ్చినట్లుంది, ఓ పది నిమిషాలలో రామానగరు పొలిమేరలో చేరాను. అక్కడ్నుంచి మరల స్లోచేసి ఊర్లోకి వెళ్ళి, డాక్టరు ప్రసాదరావు అన్న ఇంటిముందు వేన్ ఆపాను.

అదృష్టం. డాక్టరు ఇంట్లోనే వున్నాడు. నే నొచ్చినపని చెప్పాను. ప్రక్కనే వున్న డిస్పెన్సరీ రూములోకి తీసుకెళ్ళాడు.

ఓ అరగంట తరువాత డాక్టరు డిస్పెన్సరీ రూములో ఆపరేషను బల్లమీద లేచి కూర్చున్నాను. కడుపులోకి పెట్టిన రబ్బరు ట్యూబు తీసేసి, జబ్బకు ఏదో ఇంజక్షను పొడిచాడు. ఏవో మందులు రాస్తూ అడిగాడు.

"నువ్వు తిన్న అన్నంలో విషం కల్సింది. అనుమానమదేనా?"

"అవును డాక్టర్. ఇంకేం ఫర్వాలేదుకదా" ఆపరేషను టేబుల్ దిగి షర్టు వేసుకుంటూ అడిగాను.

"నో. నో. ఇంకేం భయపడాల్సిన అవసరం లేదు.

ఒకవేళ ఏమైనా నలతగా వున్నట్లు అన్పిస్తే రండి"
మందులచీటీ అందిస్తూ చెయ్యిచాపి, "ఫీజు ఏభై రూపాయ" లన్నాడు.

ఫీజు చెల్లించి, ధన్యవాదాలు తెలిపి, వచ్చి వాన్ స్టార్టు చేసుకొని బయలుదేరాను.

నేను పట్టణంలో పోవాలంటే మళ్ళీ సిరిపురం మీదు గానే వెళ్ళాలి.

3

సిరిపురం వరకు ఏవో మధురూహలతో డ్రైవ్ చేసు కుంటూ వచ్చాను. ఎదురుగా కన్పిస్తున్న మలుపు త్రిప్పాను. అంతే! గుండె ఆగినంత పనయింది.

ఎదురుగా పోలీసు కారు, పోలీసు వ్యాన్ ఆగివున్నాయి. ఇన్‌స్పెక్టర్ భూషణం చేతిలో రివాల్వరుతో ఆగమని చెయ్యి ఊపాడు. ఇన్‌స్పెక్టర్‌కు వెనుకగా ఓ పదిమంది పోలీసులు తుపాకులు పట్టుకు నిలబడి వున్నారు.

వ్యానాపి, కిందకు దిగి, ఇన్‌స్పెక్టర్ వైపు నడిచాను. ఇన్‌స్పెక్టర్ రివాల్వర్‌తో నన్ను కవర్ చేస్తూ వెనుకకు తిరిగి పోలీసులకు సైగచేసారు.

ఇద్దరు పోలీసులు నా వెనుకకు చేరి నన్ను గట్టిగా పట్టు కొన్నారు కదలకుండా. ఇంకొక కానిస్టేబుల్ నన్ను సోదా చేసి "ఆయుధం ఏమీ లేదుసార్" అన్నాడు.

"నేను ఏం చేశానని నన్నిలా ఆపి సోదాచేస్తున్నారు?" కోపంగా అడిగాను.

"చెప్తాను. ఒక్క నిమిషం" అని వాన్ వెనక్కు వెళ్ళి తలుపు తెరిచాడు ఇన్‌స్పెక్టర్. ఇద్దరు కానిస్టేబుల్స్ ఇన్‌స్పెక్టర్‌తో వెళ్ళి వాన్‌లో వెతకటం మొదలుపెట్టారు.

కొంతసేపటికి చేతులో బ్యాగ్‌తో నా ముందుకు వచ్చి,

దానిని నేలముందుంచి ఇంకో కాన్‌స్టేబుల్‌కి సైగచేసాడు. ఆ కాన్‌స్టేబుల్ జీప్ ఓపెన్ చేయగానే రివాల్వరు, దాని క్రింద డబ్బు కట్టలు కన్పించాయి.

ఇన్‌స్పెక్టర్ కోపంతో ఈడ్చి కొట్టాడు నా దవడమీద. ఆ దెబ్బకు పళ్ళన్నీ కదలినట్లయింది.

పోలీసు కాన్‌స్టేబుల్స్ నన్నీడ్చుకుంటూ వెళ్ళి వాన్‌లో పడేశారు. ఇంకో పోలీసు కాన్‌స్టేబుల్ నా వాన్ డ్రైవ్ చేసుకుంటూ వెనకాలే బయలుదేరాడు.

పోలీసు స్టేషను, చేరుకునేంతలో ఎలా తెల్సిందో ఏమో ఊరి జనమంతా అక్కడే వున్నారు. వారిలో సైకిలుకొట్టు రాజారావు, కిరాణాకొట్టు శెట్టిగారు. ఇంకా తెల్సిన ఇద్దరు ముగ్గురున్నారు. నేను సిగ్గుతో తలవంచుకొని స్టేషనులోకి నడిచాను.

స్టేషనులో తన బల్లకివల కుర్చీలో నన్ను కూర్చోమని, ఇన్‌స్పెక్టర్ వెళ్ళి తన చెయిర్‌లో కూర్చున్నాడు. జేబులోంచి ఉత్తరం తీసి,

"ఇది మా ఆఖరమ్మాయి వ్రాసిన ఉత్తరం" అన్నాడు.

ఆశ్చర్యంతో అడిగాను, "మరిందాక ఆత్మహత్య ఉత్తరం...."

"అవునన్నాను. అంతేకాదు. ఇదిగో" అంటూ సీసా తీసాడు. సీసాలో ఏవో ఎర్రని మాత్రలున్నాయి.

"అదేమిటి. ఇందాక విషం అని చెప్పారు. మాత్రలు వున్నాయి. విషంకాదా?" నాకు నోరెండిపోయింది.

"కాదు. ఒకవేళ రామయ్య ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే విషాన్ని విస్కీసీసాలో కలపడు. గ్లాసులో వేసుకొని త్రాగుతాడు. ఇంకో విషయం. రామయ్య జీవితంలో ఎప్పుడూ మద్యం ముట్టుకోలేదు.

ఆ విస్కీ సీసా నేనే నాకోసం అక్కడ వుంచుకున్నాను. ఈ మాత్రలు, సీసాలోని మాత్రలు సుగర్ కంప్లయింట్ వున్నవాళ్ళు వాడతారు. నాకు సుమారు పదేళ్ళనుంచి ఈ సుగర్ కంప్లయింట్ వుంది. ఈ సీసా రామయ్య టేబుల్ మీద మర్చిపోయాను. ఈ సీసాకోసమే నేను వెనక్కు తిరిగి వచ్చాను. లేకుంటే సాయంత్రం వంటమనిషి రామయ్య ఇంటికి వెళ్ళేంతవరకు హత్యవిషయం తెల్సేందేది కాదు. ఈ లోపల నువ్వు ఈ రాష్ట్రం వదలి ఎక్కడికో మాయం అయివుండే వాడివి. అవునా.

నేను ఈ మాత్రల సీసాకోసం రామయ్య ఇంటికి వెళ్ళి, తలుపు తట్టాను. సమాధానం లేదు. కాలింగ్ బజర్ నొక్కి 5 నిమిషాలు వేచివున్నాను అయినా రామయ్య వచ్చి తలుపు తీయలేదు. ప్రక్కనే వున్న కిటికీలోంచి లోనికి చూసాను. రామయ్య వెల్లకిలా పడివున్నాడు తలుపులు లోన గడియవేసి వున్నాయి.

ఇంటి వెనుకకు పరుగెత్తాను. ఎవరివో అడుగుల ముద్రలు కన్పించాయి. పెరటితలుపు బార్లా తెరచి వుంది. లోనికి వెళ్ళాను. పెరటి గుమ్మంవరకు ఇంటివద్దనుంచి అడుగులు ముద్రలు కన్పించాయి. కానీ గుమ్మంనుంచి ఇంటివరకు వెళ్ళిన సూచనలు ఏవీ కన్పించలేదు. అంటే. హంతకుడు వీధి గుమ్మంలోనుంచే ప్రవేశించి వుంటాడు అనే నిర్ధారణకు వచ్చి, లోనికి పరుగెత్తాను, రామయ్య కేదైనా సహాయం కావాలేమోనని.

కానీ నేను వెళ్ళేసరికి రామయ్య చనిపోయి వున్నాడు. హంతకుడు వీధి గుమ్మంలోంచి ప్రవేశించాడు. అంటే, అతనెవరో రామయ్యకు బాగా తెలిసి వుండాలి. లేకుంటే రామయ్య లోనికి రానివ్వడు. ఈ ఆలోచన రాగానే యింటి

చుట్టుప్రక్క అంతా వెతికాను.

కొద్ది దూరంలో చింతతోపుకు దగ్గరలో నున్న చెట్ల వెనుక ఏదో వాహనం కొంతసేపు ఆగివున్నట్లు తెల్సుకొన్నాను. ఏదైనా వాహనం వచ్చివుంటే దారిలో నాకెదురై వుండాలి. ఎదురవలేదు. టైర్ల గుర్తులనుబట్టి చుట్టూ తిరిగి అడ్డుతోవన వచ్చిందని వూహించాను. ఈ ఊరిలో నలుగురైదుగురికే వాహనాలున్నాయి!" ఇన్‌స్పెక్టర్ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు.

"మరి ఆత్మహత్య, విషం, ఇదంతా...."

నా మాట పూర్తికాకముందే అందుకొన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎందుకా నాటకం ఆడాను అనికదా నీ అనుమానం, చెప్తాను విను. రామయ్య టేబుల్‌మీద నున్న విస్కీ సీసాలో చాలా తరుగు కన్పించింది. రామయ్యకు మందు కొట్టే అలవాటు లేదు. అంటే హంతకుడు ఆ విస్కీ త్రాగుంటాడు అని అనుమానించాను.

శేఖర్! ప్రపంచంలో ఏ మానవుడైనా, ఎంత ధైర్యవంతుడైనా తను త్రాగినదాంట్లో గానీ, తిన్నదాంట్లో గానీ విషం కలపిందని తెలుస్తే ఏం చేస్తాడు—డాక్టర్ దగ్గరకు పరుగెడతాడు. ఈ చుట్టుప్రక్కలున్నది ఇద్దరే డాక్టర్లు. అందుకే ఆత్మహత్య అనీ, విషం అనీ అందరికీ తెలియాలనే ఆ హోటల్‌కి వచ్చి చెప్పాను. ఇది ఆనోటా, ఆనోటా అందరికీ తెలుస్తుంది. నేరస్తుడు వెంటనే వైద్య సహాయానికి పరుగు పెడ్తాడు. అవునా. నేను డాక్టర్లు ఇద్దరికీ ఫోన్ చేసాను. నీ గురించి తెల్పింది. మాటువేసాను" అన్నాడు.

నేను లేచి నిలబడి మాట్లాడకుండా సెల్‌వైపు అడుగు లేశాను.

విశ్వమోహిని

గజదొంగ



"డ్యామిట్! ఒక్క దొంగను అందులో—ఆడదాన్ని పట్టుకోలేక పోతున్నామని చెప్పడానికి సిగ్గువేయడం లేదూ? మీ సర్వీసంతా ఎందుకు? గోదావరిలో కలపడానికా? ఇందరున్నారు - ఒక్కరూ దాన్ని బంధించలేక పోయారంటే డిపార్ట్‌మెంటుకే తలవంపులు...."

డి.ఐ.జి. దినకర్ గొంతు చించుకుని అరుస్తూంటే—బిక్కచచ్చిపోయి, గంటుపడ్డ ముఖాలతో తలలు వంచుకున్నారు ఇన్‌స్పెక్టర్స్ అంతా.

గజదొంగ జమునను పట్టి బంధించనందుకు ఆరోజు ప్రొద్దుటే క్రయింబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్స్ అందర్నీ తన ఆఫీసుకు పిలిపించి చాకిరేవు ఆరంభించాడు డి.ఐ.జి.

అందుకు కారణం లేకపోలేదు.

గజదొంగ జమునను పట్టుకోలేక పోతూన్న పోలీసు శాఖను, ప్రభుత్వాన్ని బాగా ఏకేశాయి పత్రికలన్నీ. ఆ రాతలన్నీ చూసేసరికి తన శరీరమంతా వాతలు పెట్టినట్లయింది స్టేట్ పోలీసు మినిస్టర్‌కి వారంరోజులలో ప్రారంభంకానున్న అసెంబ్లీ సెషన్ గుర్తుకు వచ్చేసరికి గుండె ఝల్లుమంది.

రాత్రికి రాత్రే ఐ.జి.కి ఫోన్ చేసి మెత్తగా, చిత్తుగా చివాట్లు వేసాడు మినిస్టర్. అసెంబ్లీ సెషన్ ఆరంభించే లోపున ఆ గజదొంగను పట్టి బంధించకున్నట్లయితే పొజిషన్‌కే ఎసరు పడుతుందని చెప్పాడు.

అందుకే తెల్లవారకుండానే డి.ఐ.జి. దినకర్‌ని ఫోన్‌లో పిలిచి మంత్రినుంచి రిసీవ్ చేసుకున్న దాంట్లోంచి సగం అతనికి ట్రాన్స్‌ఫర్ చేసేశాడు ఐ.జి. అతన్నీ, అతని పరివారాన్నీ తూర్పు తెల్లవారకుండానే తూర్పారపట్టేశాడు. ప్రజల మాట ఎలా వున్నా, మంత్రిగారికి హార్ట్ ఎటాక్స్ కలగజేస్తోన్న ఆ గజదొంగను కటకటాల వెనక పెట్టకపోయినట్లయితే డిమోషన్ తప్పదన్నట్టు మాట్లాడాడు.

నిద్రమంచం మీంచి లేచి ముఖం కడుక్కోకుండానే ముఖం వాచిపోయేలా చీవాట్లు తిన్న డి.ఐ.జి.కి ఎక్కడలేని ఆగ్రహమూ ముంచుకొచ్చింది.

తన అధీనంలోని ఇన్‌స్పెక్టర్స్‌ందర్నీ ఐడెంటిఫికేషన్ పెరేడ్‌కి హాజరుపరచబడ్డ కేడీలలా వరుసలో నిలబెట్టేశాడు డి ఐ డి. దినకర్ వారి అసమర్థతకు, అలక్ష్యతకు వరస పెట్టి ఒక్కొక్కరినే వుతకనారంభించాడు.

డి.ఐ.జి. వుగ్రరూపం చూపి పెదాలు స్ట్రయిక్ చేశాయి అందరికీను. ఏమంటే ఏ బూతులు వినాలో నన్నట్టు చెవులు అప్పగించి తలలు వాల్చేశారు మెళ్ళు విరిచిన కోడిపిల్లల్లా.

అరుస్తూ, అరుస్తూ హఠాత్తుగా ఆగిపోయాడు డి.ఐ.జి. తాను ఎంత అరిచినా అది వన్‌వే ట్రాఫిక్కే అన్న విషయం గుర్తుకొచ్చింది. అరిచి, అరిచి తన నోరే నొప్పి పెడుతుంది. తన బీ.పి. నే పెరుగుతుంది. వాళ్ళకేం మౌనంగా నిలుచుని రోజంతా తిట్లు పడమన్నా పడతారు. జ్ఞానోదయం కావడంతో ఫ్రిజ్‌వాటర్ నాలుగు గ్లాసులు గట గటా త్రాగేశాడు.

"చచ్చిన శవాల్లా తలలు వాల్చేసి నా ముందు నిల్చుంటే చాలదు. వారం రోజులలో ఆ గజదొంగను పట్టి బంధించక పోయారంటే, మిమ్మల్నందర్నీ సస్పెండ్ చేసి పారేస్తాను. ఆంధ్రా అండమాన్స్‌కి విసిరేస్తాను" అంటూ చిందులు త్రొక్కాడు.

"గెటౌట్!" అంటూ అతను అరవగానే, తుపాకు ల్లోంచి దూసుకుపోయిన తూటాల్లా అదృశ్యమయి పోయా రంతా.

పై సంఘటన జరిగిన మూడు రోజుల తరువాత ఏదో కేసులో కలకత్తా వెళ్ళిన డి ఐ జి —దినకర్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యాడు. విజయవాడ వరకు కోరమండల్‌లో ప్రయాణించి అక్కడినుంచి హైద్రా బాద్‌కి మరో ట్రెయిన్ పట్టుకోవచ్చునన్న ఆలోచన అత

నిది.

ఫస్ట్‌క్లాస్‌లో రిజర్వేషన్ దొరకని కారణంగా ఏ.సి. టూ టయర్‌లో ప్రయాణం కొనసాగిస్తున్నాడు అతను.

ఓ గంటసేపు సీటులోనే కుదురుగా కూర్చుని ఏదో జర్నల్ చదువుతూ వుండిపోయాడు దినకర్.

చుట్టూ వున్న ప్రయాణీకులు లోకాభిరామాయణం ఆరంభించారు. ఆలిండియా రేడియోలోలా అందరి కబుర్లూ కలగాపులగమై చెవుల్లో దూరుతుంటే—జర్నల్‌లో చదువుతున్నది సగం సగమే బుర్రకు ఎక్కనారంభించింది అతనికి.

చివరికి విసుగెత్తి చేతిలోని జర్నల్‌ని సీటుమీద పడేసి, కూర్చున్న చోటునుంచి లేచాడు దినకర్.

అలవాటు ప్రకారం ఓసారి అందరినీ పరిశీలనగా చూసి ముందుకు కదిలాడు.

అది వెస్టిబ్యూల్ టైప్ ట్రెయిన్ కనుక ఓసారి పాంట్రీ కార్ వరకు వెళ్ళి, స్ట్రాంగ్ కాఫీ త్రాగి, రావాలనుకున్నాడు.

కంపార్ట్‌మెంట్‌లోని ప్రయాణీకు లందరి వంకా పరిశీలనగా చూస్తూ మెల్లగా ముందుకు సాగాడు.

అలా రెండు కంపార్ట్‌మెంట్సు దాటి మూడవ కంపార్ట్‌మెంట్‌లో అడుగు పెట్టబోయిన దినకర్ హఠాత్తుగా ఆగిపోయాడు.

అదొక ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటు.

బాత్‌రూమ్ తెరుచుకుని ఓ యువతి చటుక్కున బయటకు రావడంతో, ఆమెను గ్రుద్దుకోకుండా వుండేందుకే కాళ్ళకు సడన్ బ్రేక్ వేసాడతను.

ఆమెవంక పరిశీలనగా చూశాడు. ఇంచుమించు ముప్ప

య్యేళ్ళు వుండొచ్చునామెకు. తెల్లగా, అందంగా వుంది. పంజాబీ డ్రెస్ ధరించింది. బాబ్డుహెయిర్. మెళ్ళో సన్నటి గొలుసుతో వున్న లాకెట్ వుంది.

ఆమెకూడా అతనివంక తేరిపార చూపింది. అంత లోనే చటుక్కున తల వంచుకుని గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆమె చివరగా వున్న కుపేలో ప్రవేశించడం గమనించాడు దినకర్.

నిలుచున్న చోటునుంచి కదిలి మెల్లగా ముందుకు సాగాడు.

కుపే మీదుగా వెళుతూ వోరగా లోపలికి చూసాడు. లోపల ఆమె ఒక్కతే వుంది. ఆమెకూడా తనవంకే చూస్తున్నట్లు గ్రహించి తల త్రిప్పేసుకున్నాడు. అయితే ఆమె కన్నులలో లిప్తపాటు తళుక్కుమన్న ఏదో భావం అతన్ని ఆశ్చర్యపరచింది.

ఆలోచిస్తూనే ముందుకు సాగిపోయాడు.

పాంట్రీకి వెళ్ళి స్ట్రాంగ్ కాఫీ ఒకటి వేయించుని త్రాగాడు. తరువాత మళ్ళీ తిరుగుముఖం పట్టాడు.

కాఫీ త్రాగుతూ వున్నంతసేపూ అతని ఆలోచనలు ఆ పంజాబీ డ్రెస్ యువతి చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.

ఆమె కళ్ళలో కదలాడిన భావం ఏమిటి? భయమా, బెదురా? ఎందుకు? ఆ కుపేలో వొంటరిగా ప్రయాణిస్తోంది కనుక తాను ఏమైనా చేయవచ్చునేమో నన్న భీతా?

ఆలోచిస్తూంటే హఠాత్తుగా అనిపించింది అతనికి— ఆమెను ఎక్కడో చూసినట్లు!

ఆ ఫీలింగ్ ఎందుకు కలిగిందో, ఎలా కలిగిందో అర్థం కాలేదు.

కాని, చూపినట్లు అనిపిస్తోంది.

అయితే ఎంత ఆలోచించినా ఎక్కడ చూశాడో మాత్రం గుర్తుకు రావడంలేదు.

ఉన్నట్లుండి బుర్రలో ఫ్లాష్ వెలిగింది.

ఆ ఆలోచన కలగడంతో అతని ఆశ్చర్యానికి మేరలేక పోయింది. తన అనుమానం నిజమో కాదో వెంటనే తేల్చుకోవాలన్న ఆత్రం పుట్టుకొచ్చింది.

గబగబా అడుగులేసుకుంటూ తన కంపార్ట్‌మెంట్ వైపు సాగాడు.

దారిలో ఆ యువతి వున్న కుపేదగ్గర ఆగాడు అప్రయత్నంగానే.

ఈసారి తలుపు కొద్దిగా తెరిచివుంది. ఆ సందులోంచి లోపలకు చూశాడు. లోపలినుంచి రెండు కళ్ళు తనను గమనిస్తున్నట్లు గ్రహించగానే అతని ఆత్రం మరింత పెరిగింది.

మరో సెకను అక్కడ నిలుచోకుండా వడివడిగా ముందుకు సాగాడు.

ఆ ప్రాసెస్‌లో ఎదుట వస్తున్న సిగరెట్ వెండర్‌ని గుద్దేశాడు. వాడికి 'సారీ' చెప్పి హడావుడిగా వెళ్ళిపోయాడు.

తన సీటుకు చేరుకోగానే బ్రీఫ్‌కేస్ తెరిచి అందులోంచి ఓ చిన్న ఆల్బమ్‌ను పైకి తీశాడు.

అందులో కొందరు వ్యక్తుల ఫోటోలు వున్నాయి.

ఆడా, మగా వున్నారందులో.

మొదటి పేజీలో వున్న ఓ యువతి ఫోటోమీద నిలిచింది అతని దృష్టి.

అయిదు నిమిషాల పాటు వివిధ కోణాల్లోంచి దీక్షగా,

పరిశీలనగా చూసాడు ఆ ఫోటోలోని యువతిని.

తరువాత ఆ ఫోటోను ఆల్బమ్‌లోంచి తీసి పర్స్‌లో పెట్టుకున్నాడు.

ఆల్బమ్‌ని తిరిగి బ్రీఫ్ కేస్‌లో పెట్టేసి తాళం వేసేసాడు.

ఆ తరువాత సిగరెట్ వెలిగించి సీటులో వెనుకకు జారగిలబడి కళ్ళు మూసుకున్నాడు. అతని మస్తిష్కంలో అంతకు ముందు కనిపించిన పంజాబీ డ్రెస్ యువతి రూపం ప్రత్యక్షమయింది. ఆ వెంటనే ఫోటోలోని యువతి వెలసింది.

ఆ ఇద్దరిలో పోలికలు గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు అతను.

పంజాబీ డ్రెస్ యువతీ, ఫోటోలోని యువతీ మార్చి మార్చి అతని బుర్రలో మెదులుతున్నారు.

ఆ ఇద్దరినీ ఒకటిగా అన్వయించడానికి అవస్థపడుతూంది అతని మస్తిష్కం.

అలా కొన్ని నిముషాలపాటు కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ వుండిపోయాడు. వ్రేళ్ళమధ్య నున్న సిగరెట్ పూర్తిగా కాలి, వ్రేళ్ళు చుర్రుమనేంతవరకూ అలా ఆలోచిస్తూనే వున్నాడు.

'ఆమె'. ఆమే నన్న నిర్ణయానికి వచ్చాడు. కొంత సేపటికి కూర్చున్న చోటునుంచి లేచి పంజాబీ డ్రెస్ యువతి వున్న క్యాబిన్‌వైపు నడిచాడు.

కుపేలో ఒంటరిగా కూర్చుని ఏదో పత్రిక చదువుకుంటూన్న ఆ యువతి—గుమ్మంవద్ద నీడను చూడగానే, బయటకు తొంగిచూసింది.

చటుక్కున ప్రక్కకు తప్పుకున్నాడు దినకర్.

అయినా అతన్ని చూసిందామె. అతను జేబులోంచి ఏదో ఫోటో తీసి చూస్తుండడం గమనించింది.

కుపే తలుపు పూర్తిగా మూసేసి లోపల లాక్ చేసిందామె.

తలుపు మూసుకోగానే తిరిగి తన బెర్త్ వైపు నడిచాడు అతను.

'సందేహం లేదు! రాష్ట్రమంతా గజగజలాడించుతూ, పోలీసులను గాడిదల్ని చేస్తూన్న గజదొంగ జమున ఆమే!' అనుకున్నాడు మదిలో.

కోరమండల్ ఆగే నెక్స్టట్ స్టేషన్ భువనేశ్వర్.

చేరుకునేసరికి అర్ధరాత్రి అవుతుంది. అంటే మరో రెండుగంటల ప్రయాణం వున్నదన్న మాట.

భువనేశ్వర్‌లో ఆగగానే ఆమెను న్యాబ్ చేయాలి. ఆ గజదొంగ ఆట ఇంతటితో కట్టు!.. అనుకున్నాడు అతను.

కంపార్ట్‌మెంట్‌లో అంతా నిద్రపోతున్నారు.

ఓసారి లేచి ఆమె వున్న కుపేవైపు వెళ్లాడు అతను పిట్ట ఎగిరిపోకుండా చూడడానికి. టాయ్‌లెట్ లోంచి బయటకు వస్తూ అతన్ని గ్రుద్దుకుంది ఆమె. 'సారీ' అంది ఆదోలా నవ్వుతూ.

తన కుపేకి వెళ్ళిపోతూన్న ఆమెవంక చూస్తూ నిలుచుండిపోయాడు అతను.

అతనివైపు ఓసారి వోరగా చూపి లోపలికి వెళ్ళిపోయి తలుపు మూసుకుంది ఆమె. తన బెర్త్‌కి తిరిగివచ్చాడు అతను.

2

అనవాయితీ ప్రకారం ఓ గంట ఆలస్యంగా చేరుకుంది కోరమండల్ భువనేశ్వర్‌కి.

రైలు స్టేషన్‌కి చేరుకోబోతోందనగా గుమ్మందగ్గరకు వెళ్ళి నిలుచున్నాడు దినకర్.

అతని కళ్ళు ఆర్.పి.ఎఫ్. స్టేషన్‌కోసం ప్లాట్‌ఫాం మీద వెదుకుతున్నాయి.

రైలు ఆగగానే ప్లాటుఫాం మీదకు వురికాడు దినకర్. రెండు నిముషాలకంటే ఎక్కువ ఆగదు అక్కడ.

పోలీస్‌స్టేషన్ వైపు వడివడిగా అడుగులు వేశాడు.

పది అడుగులు వేసేసరికి, భుజంమీద ఎవరిదో చేయి పడడంతో ఆగిపోయాడు అతను.

ప్రక్కకు చూశాడు.

ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇద్దరు కాన్‌స్టేబుల్స్ ప్రత్యక్ష మయ్యాడు!

వారి ప్రక్కనే పంజాబీ డ్రెస్ యువతి వుంది!!

ఆశ్చర్యపోయాడు దినకర్.

వెదుకబోయిన తీగె కాలికి తగిలినట్లు ఆనందం కూడా కలిగింది.

"ఇన్‌స్పెక్టర్!" అంటూ ఏదో అనబోయాడు.

అతనిమాట పూర్తికాకుండానే, "నువ్వు మాతోపాటు స్టేషన్‌కి రావాలి మిస్టర్!" అంటూ అతని జబ్బ పట్టుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎస్. నేనూ మీకోసమే బయలుదేరాను....ఈ యువతిని అరెస్టుచేయాలి....తీసుకు పదండి" అన్నాడు దినకర్.

"అలాగా!?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అతని పట్టు భల్లూకపు పట్టులా అనిపించి విడిపించుకోబోయాడు దినకర్. ఆ గ్రిప్ అతనికి బాగా ఎరుకే! పోలీస్ గ్రిప్ అది. నేరస్థుల్ని తమ శాఖవారు పట్టుకునే విధానం అది!

"ఇన్‌స్పెక్టర్! నా పేరు దినకర్. ఆంధ్రా పోలీస్‌కి చెందిన డి ఐ జి ని" అంటూ స్వపరిచయం చేసుకున్నాడు "ఈమె ఓ నొటోరియస్ తీఫ్. గజదొంగ జమున. వివిధ పేర్లతో ఆంధ్రరాష్ట్రంలో గొప్ప అలజడిని రేపింది. పోలీసులకు కళ్ళుగప్పి తప్పించుకు తిరుగుతోంది. వియ్ షుడ్ అరెస్టుహర్...."

ఇన్‌స్పెక్టర్ చిన్నగా తలపంకించాడు. అతని వుడుం పట్టు సడలలేదు.

ఆ యువతి పెదవులపైన మందహాస రేఖ మెరిసింది

"వుయ్‌విల్ సీ అట్ ద స్టేషన్. కమాన్" అంటూ దాదాపు దినకర్‌ని జబ్బ పట్టుకుని ఈడ్చుకుపోయాడు ఇన్‌స్పెక్టర్.

అతని ప్రవర్తనకు వొళ్ళు మండుతున్నా, నిగ్రహించుకున్నాడు దినకర్.

అంతా ప్లాట్‌ఫాంమీద వున్న పోలీస్‌స్టేషన్‌లో ప్రవేశించారు.

ఓ సెంట్రీ తప్ప వేరెవరూ లేరక్కడ.

"హి యీజ్ ఎనోటెడ్ ఇంటర్‌స్టేట్ క్రిమినల్. మారు వేషాలతో. మారు పేర్లతో తప్పించుకుంటూ ఎన్నో అఘాయిత్యాలు చేస్తున్నాడు. దోపిళ్ళు. రేప్‌లు. మర్డర్లూ ఇతని హాబీ.... నేనెవరో తెలియక నా వెంట పడ్డాడు.... ఇతని ప్రవర్తన అనుమానాస్పదంగా వుండడంతో, ఇతన్ని ఎక్కడో చూసాననిపించింది. నా దగ్గర వున్న ఫోటో తీసి చూస్తే ఇతని ఐడెంటిటీ తెలిసిపోయింది" అంటూన్న ఆ యువతి వంక నోరు తెరుచుకుని చూస్తూ వుండిపోయాడు దినకర్.

ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోంచి ఫోటో తీసి చూపించింది.

దానిని చూడగానే వులిక్కిపడ్డాడు దినకర్. అది తన ఫోటో! తన పర్సులో వుండాలి. ఆమె దగ్గరకు ఎలా వెళ్ళింది?!

చటుక్కున జేబులో చేయి పెట్టబోయాడు—చూసుకోవ డానికి.

కాని ఇన్‌స్పెక్టర్ దానిని మరోలా అర్థం చేసుకున్నాడు.

"డోంట్ మూవ్!" అంటూ అరిచాడు. అతని చేతిలో పిస్టల్ వుంది.

విస్మయంగా చూశారు దినకర్.

"మిస్టర్! ఈమె ఓ సి.ఐ.డి. ఆఫీసర్ అన్న సంగతి తెలియక ఈమె వెంట పడ్డావు. అదే నిన్ను పట్టిఇచ్చింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్. "నిన్ను అరెస్టు చేస్తున్నాను."

చిన్నగా వులిక్కిపడ్డాడు దినకర్. ఇన్‌స్పెక్టర్ మీద కోపం వచ్చింది. ఆగ్రహంతో తీక్షణంగా చూశాడు అతని వంక.

"ఇన్‌స్పెక్టర్? డోంట్‌బీ ఫూలిష్ ...అయామ్ డి ఐ జి దినకర్. ఈమె ఓ పెద్ద గజదొంగ. ఈమెను పట్టుకునేం దుకు క్లూ ఇచ్చిన వారికి బహుమతికూడా ప్రకటించింది ఆంధ్రా ప్రభుత్వం. ఈమె తప్పించుకున్నదంటే పూర్తి బాధ్యత నీదే అవుతుంది" అన్నాడు కరుకుగా.

ఇన్‌స్పెక్టర్ ఆమెవంక సాభిప్రాయంగా చూశాడు.

మందహాసంతో హ్యాండ్‌బ్యాగ్ తెరిచిందామె.

అందులోంచి ఓ చిన్న ప్లాస్టిక్ ఫోల్డర్ తెరిచి దినకర్ ముందు వుంచింది.

అది ఆమె అయిడెంటిటీ కార్డు.

'మిస్ సుషమాశర్మ....సి.ఐ.డి. ఆఫీసర్ ....మద్రాస్'

అని వుంది. ప్రక్కనే ఆమె ఫోటోగ్రాఫ్ కూడా అతికించి వుంది.

తెల్లబోయాడు దినకర్.

"హౌ కుడ్ ఇట్ బీ? ఆ గజదొంగ ఫోటోతో ఈమె రూపం టాలీ అవుతోంది.... నువ్వు పిస్టల్ ప్రక్కనపెడితే జేబులోంచి ఈమె ఫోటోగ్రాఫూ, నా అయిడెంటిటీ కార్డూ తీసి చూపిస్తాను" అన్నాడు ఇన్స్పెక్టర్‌తో.

ఇన్స్పెక్టర్ సంశయిస్తూంటే, "లెట్ హిమ్ షో ది ఫోటోగ్రాఫ్, ఇన్స్పెక్టర్!" అందామె.

"పిచ్చి పిచ్చివేషాలు వేశావంటే వార్నింగ్ లేకుండా షూట్ చేస్తాను, జాగ్రత్త!"" అంటూ హెచ్చరించాడు ఇన్స్పెక్టర్.

జేబులో చేయిపెట్టిన దినకర్ చిన్నగా వులిక్కిపడ్డాడు.

జేబు ఖాళీగా వుంది.

పర్సు మాయమయింది!

"సో, జేబు ఖాళీకదూ?" అన్నాడు ఇన్స్పెక్టర్ వ్యంగ్యంగా.

చురుగ్గా చూశాడు దినకర్ "పర్స్ మాయమయింది, మాన్" అన్నాడు.

"ఐనో, ఐనో...." అంటూన్న ఇన్స్పెక్టర్ని చూస్తే వొళ్ళు మండింది దినకర్‌కి.

తనవాళ్ళ తరహా తనకు తెలిసినంత బాగా ఇతరులకు తెలియదు.

"ఇతన్ని గుర్తించగానే గార్డ్‌తో మాట్లాడి మీకు ముందే వైర్లెస్ మెసేజ్ పంపించాను కనుక సరిపోయింది లేకుంటే ఎప్పటిలాగే ఏదో టోకరా ఇచ్చి తప్పించుకు పోయేవాడు.

పెద్దపెద్ద ఆఫీసర్ల పేర్లనుపయోగించి తప్పించుకోవడం ఇతనికి అలవాటే. అందుకే పోలీస్ ఆఫీసర్‌గా పోజ్ చేస్తున్నాడు'' అందామె.

"ఇతనికి ఎలా బుద్ధిచెప్పాలో నాకు తెలుసు'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"థాంక్యూ, ఇన్‌స్పెక్టర్! ట్రెయిన్ కదిలే వేళయింది ప్లీజ్ టేక్ హిమ్ ఇంటూ కస్టడీ....నేను తరువాత వచ్చి కలుస్తాను" అంటూ లేచి నిలుచుందామె.

"గార్డుకి ముందే చెప్పాం కనుక మీరు ఎక్కేంత వరకు రైలు కదలదు'' అన్నాడు యిన్‌స్పెక్టర్.

ఇన్‌స్పెక్టర్ సైగనందుకున్న పోలీసులు దినకర్‌ని చెరో చేయీ పట్టుకున్నారు—లాకప్‌లో పెట్టేందుకు.

"డామిట్! రైల్లో నా బ్రీఫ్‌కేస్'' అంటూన్న దినకర్ పలుకుల్ని ఎవరూ పట్టించుకోలేదు.

ఆమె యిన్‌స్పెక్టర్‌కి షేక్‌హాండ్ యిచ్చి బయటకు నడిచింది.

తెల్లవార్లూ పోలీస్ లాకప్‌లో అసహనంగా గడిపిన డి.ఐ జి దినకర్—తెల్లవారగానే ఒరిస్సా స్టేట్ ఐ.జి. ని కాంటాక్ట్ చేసి, తన అయిడెంటిటీని నిరూపించుకుని బయటవడేసరికి సాయంత్రం అయిపోయింది.

కోనార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి హైద్రాబాద్ చేరుకున్నాడు.

అతను ఇంటికి చేరుకునేసరికి ఓ కవరు అతనికోసం ఎదురు చూస్తోంది.

అందులో యిలా వుంది—

"డియర్ డి.ఐ.జి.!

నన్ను పట్టుకోవడం సబార్డినేట్స్ ముందు ప్రగల్భాలు పలకడ మంతటి సులభంకాదని ఈపాటికి గ్రహించి వుంటావు....కోరమండల్‌లో నిన్ను, నీ ప్రవర్తననూ గమనించి పోలీసు పక్షివయి వుంటావని గ్రహించాను. నీ పర్స్ కొట్టేసి నువ్వెవరో తెలుసుకోగలగడమే కాక, నీవద్ద నున్న నా ఫోటోనుకూడా సంపాదించగలిగాను.

ఏ క్షణంలో ఏ అవతారం ఎత్తాలన్నా సరంజామా అంతా నా వద్ద సిద్ధంగా వుంటుంది. సి.ఐ.డి. ఆఫీసర్‌గా ఐడెంటిటీ కార్డు రెడీగా వుంది. దానిని వుపయోగించుకుని గార్డ్‌ని కాంటాక్ట్ చేశాను. నీ ఫోటో చూపించి. నువ్వొక గజదొంగవని చెప్పాను. అతనిద్వారా భువనేశ్వర్ రైల్వే పోలీస్‌కి వైర్లెస్ మెసేజ్ పంపించాను—ఇంటర్ స్టేట్ క్రిమినల్‌ని వెంబడిస్తున్నట్టూ. భువనేశ్వర్‌లో రైలు ఆగ గానే అతన్ని అరెస్టు చేయనున్నట్టూను....

బుర్రలో సరుకు కరువయిన మీ డిపార్ట్‌మెంట్ నన్ను సులువుగా నమ్మతుందని నాకు తెలుసు. అంతా వూహించి నట్టే జరిగిపోయింది. రాత్రంతా నువ్వు లాకప్‌లో మీ స్వంత డిపార్ట్‌మెంట్‌నే తిట్టుకుంటూ గడుపుతోంటే—నేను ఖుర్దా వచ్చి అక్కడినుంచి మరో ప్రక్కకువెళ్ళే రైలెక్కాశాను.

సో, మైడియర్ డి.ఐ.జి.!

ఇప్పటికైనా తెలిసిందికదూ మన సామర్థ్యాలు ఏమిటో? ఇటుపైన నాకోసం ప్రయత్నించి మళ్ళీ భంగపడవని ఆశిస్తాను.

గుడ్ బై!

—జమున." □

ఇండియా ఏజెంట్

సరసి

దేశమంతా విషాదచ్ఛాయలు అలుముకున్నరోజు! అశేష ప్రజానీకం ఆర్ద్రహృదయాలతో శ్రీమతి ఇందిరా గాంధీకి ఆరోజు అంతిమ వీడ్కోలు ఇస్తున్నారు!

ఒకటిన్నర దశాబ్దాలుగా ప్రపంచ రాజకీయ రంగంపై ప్రముఖపాత్ర వహించి, వర్ధమాన దేశాలకు మార్గదర్శిగా

నిలచిన ఆ మహోన్నత వ్యక్తి భౌతిక కాయాన్ని చందనం చెక్కలలో ఉద్భవిస్తున్న చితిమంటలు దహించేస్తున్నాయి. ప్రపంచ నాయకులంతా ఖిన్నవదనులై శాంతివన సమీపం లోని శ్మశాన వాటికలో ప్రత్యక్షసాక్షులై వుండగా, వేద ఘోషల మధ్య చరమగీతం వినిపిస్తుండగా దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజలు బరువెక్కిన హృదయాలతో టీ.వి. ల ముందు కూర్చుని ఆ దృశ్యాన్ని చూడలేక చూస్తున్నారు!

నగరం నడిబొడ్డున గల ఒక అందమైన భవంతిలో టీ.వి. ముందు కూర్చొని గుండెనిండా విషాదం నింపుకుని ఆ అంతిమ సంస్కారాలను కన్నార్పకుండా చూస్తున్నదొక కుటుంబం.

ఇంతలో వారి ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ మ్రోగబో తున్న ఫోనును చటుక్కున ఎత్తి "హలో!" అన్నదొక కంఠం!

"హలో....డిటెక్టివ్ దీక్షితులుగారేనా?"

"ఎస్. స్పీకింగ్!"

"చూడండి....నేనొక అతిముఖ్యమైన విషయం చెబు తున్నాను. దయచేసి జాగ్రత్తగా వినండి! సమయం అస్సలు లేదు!—'నువ్వెక్కణ్నించి మాట్లాడుతున్నావ్? నీ పేరేమిటి?'—ఇలాంటి వ్యర్థప్రశ్నలు వేసి సమయాన్ని తినేసి చక్కటి అవకాశాన్ని చేజారనివ్వకండి!

మొన్నటివరకూ 'నకజిమా' అనే జపాన్ మనిషితో నాకు వ్యాపార సంబంధమైన లావాదేవీలుండేవి. వ్యాపార మేమిటో మీకు చెప్పాలికదా! భారతదేశంలోని యురేనియం నిక్షేపాల గురించీ, రేడియోయాక్టివ్ పదార్థాల గురించీ ప్రభుత్వం జరిపే పరిశోధనల ఫలితాలను ఎప్పటికప్పుడు మేము ఎంచుకొన్న దేశాలకి చేరవెయ్యడం! ఈ బిజినెస్‌కు

ఇండియా ఏజంటుని నేను!

గత నాలుగునెలలుగా మా వ్యాపారం కుంటుపడింది. కారణం—అతడికీ నాకూ మధ్య వ్యవహారం చెడింది. సుమారు పదిలక్షలదాకా నాకు ఎగనామం పెట్టి వేరే ఎవరితోనో కొత్తగా కాంట్రాక్టు కుదుర్చుకుందామని చూస్తున్నాడు నకజిమా.

ఈ వ్యవహారాలకు సంబంధించిన కీలకమైన పత్రాలు కొన్ని నా దగ్గర వుండిపోవడం. తద్వారా వాటిని పణంగా పెట్టి అతడిని నేను బ్లాక్ మెయిల్ చెయ్యడం జరిగింది కానీ వాడు కొరకబడలేదు.

ఈ తతంగం జరిగి రెండునెలలు పైగా అవుతోంది. ఈలోగా హఠాత్తుగా మాయమైపోయాడు నకజిమా. అప్పట్నించి ఎంత గాలించినా వాడి ఆచూకీ తెలియలేదు నాకు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే—ప్రస్తుతం వాడు ఢిల్లీలో వున్నట్టు యిప్పుడే టీ వీ. ద్వారా తెలుసుకున్నాను. పరిస్థితి చూస్తే నేను ఫ్లయిట్ పట్టుకుని ఢిల్లీ వెళ్ళేలోగానే అతడు వాళ్ళదేశానికి చెక్కేశాలా వున్నాడు. పైగా ప్రధాని అంతిమయాత్ర సందర్భంగా ఢిల్లీ ఫ్లయిట్ ఎకామిడేషన్ టైట్‌గా వుంది.

నాకు ద్రోహంచేసి, వాడు క్షేమంగా తనదేశానికి తిరిగి వెళ్ళడానికి వీల్లేదు. కాబట్టి అతడి ఆచూకీ మీకు చెబుతాను. పిట్ట ఎగిరిపోకముందే మీరు పట్టుకోగలిగితే—ఇదేమీ ఫీజొచ్చే కేసుకాదు. ఆలోచించుకోండి మరి!" అన్నాడు ఓ అపరిచిత వ్యక్తి.

"దేశద్రోహుల్ని పట్టుకున్నానన్న ఆత్మానందమే నాకు ఫీజు! వెంటనే వివరాలు చెప్పు!" తొణక్కుండా పలికింది దీక్షితులు గొంతు.

"మీరు టీ.వీ. చూస్తున్నారా?"

"ఆఁ చూస్తున్నా"

"అయితే సరిగ్గా వినండి! దహన వాటికకి దక్షిణాం వైపున విదేశీ ప్రముఖులకోసం ప్రత్యేకంగా ఒక 'లాంజ్' ఏర్పాటుచేశారు. ఆ లాంజ్‌లో ప్రెస్ గ్యాలరీవైపు ముందు నుంచి నాలుగో వరుసలో చివరి వ్యక్తి నేను చెప్పిన పెద్ద మనిషి నకజిమా!!

తలకి ముదురునీలం ఉన్ని టోపీ, లేతనీలం కోటూ ధరించి వున్నాడు. ఈసారి కెమేరా అవైపు తిప్పినపుడు స్పష్టంగా గమనించండి. అతడి కుడికంటి కింద చాకుతో గాయం చేసినట్టు మచ్చ వుంటుంది. ఈ వివరాలు సరిపోతా యనుకుంటాను. కాదంటే యింకా బలమైన మరో 'క్లూ' చెబుతాను. అతడి కుడికాలి తొడమీద "డ్రాగన్" పచ్చ బొట్టు వుంటుంది! ఓకే? విషూ్య ఆల్ద బెస్ట్!"

"హలో హలో హలో...." ఆ అపరిచిత వ్యక్తి ఫోన్ పెట్టేసేలోగా హడావుడిగా కేకలుపెట్టాడు దీక్షితులు.

"ఏవిటీ, యింకా?" అసహనంగా అన్నాడు అవతలి వ్యక్తి.

"ఒక్క విషయం! ఆ వీ.ఐ.పీ. లాంజ్‌లో కూర్చున్న వ్యక్తులంతా విదేశాలనుంచి వచ్చిన ప్రెసిడెంట్లూ, ప్రైమ్ మినిస్టర్లూ, ఫారెన్ మినిష్టర్లూ వాళ్ళ కుటుంబాలూను. వాళ్ళని అనుమానించి తీరా రుజువు చెయ్యలేకపోతే మన దేశానికి చాలా అవమానం. పైగా మనకీ జపాన్‌కీ సుహృ ద్భావ సంబంధాలున్నాయి. మీరు చెప్పేది 'అక్షరాలా నిజం' అని తేలితే తప్ప ఈ విషయంలో తొందరపడ కూడదు. ఏదైనా పొరపాటు జరిగితే దీనితాలూకు దుష్ప్రభావాలు యావత్ భారత దేశంమీద పడతాయి."

"పొరపాటు జరిగితే వాటి తాలూకు దుష్ప్రభావాల సంగతి నాకు తెలియదుగానీ మీరు యింత సేపు సుత్తికొడుతూ కూర్చుంటే అతగాడు అక్కడ్నించి ఉడాయించెయ్యగలడు. అప్పుడు దాని తాలూకు దుష్ప్రభావాలు మాత్రం తప్పకుండా యావద్భారతదేశంమీద పడతాయి. మైండిట్!!"

"ఆల్‌రైట్. నేను వెంటనే ఢిల్లీ పోలీస్‌ని కాంటాక్టు చేసి దూరదర్శన్ కెమేరాని మీరు చెప్పినచోట ఫోకస్ చేయించి క్లోజప్‌లో అతడ్నిచూపించే ఏర్పాటు చేయిస్తాను. మీరు మరోసారి సరిగ్గా గుర్తుపట్టి చెబితే ఏదో మిషమీద అతడి పాస్‌పోర్టూ, మీరుచెప్పిన ఐడెంటిఫికేషనూ చెకప్ చేయిస్తాను.

ఒక రిక్వెస్టు—మీరు నామాట విని మీ అడ్రసు చెప్పండి. నేను మిమ్మల్ని కలుసుకుని యిద్దరం ఢిల్లీ వెడదాం ఇమీడియట్‌గా నకిలీమాని స్వయంగా అరెస్టు చెయ్యడానికి మీ సహకారం చాలా అవసరం

చిన్నదో పెద్దదో ప్రతీ వ్యక్తీ నేరంచేస్తాడు. ఆ తప్పు తెలుసుకుని దాన్ని సరిదిద్దుకున్నవాడే నిజమైన మనిషి। అందువల్లనే చట్టమూ అది నిర్దేశించిన సూత్రాలకూ కూడా ప్రాధాన్యత నీయకుండా మానవతా వాదంమీద న్యాయమూర్తులు తీర్పుచెప్పి పెద్ద పెద్ద నేరస్థులకు కూడా స్వల్పమైన శిక్ష విధించిన సందర్భాలెన్నో వున్నాయి. కాబట్టి మీరు గతాన్ని ఒక పీడకలగా భావించి ఆ విదేశీయుణ్ని పట్టుకునే విషయంలో తోడ్పడితే ప్రభుత్వం మీ విషయంలో కొంతవరకూ...."

"చూడండి....నేను పట్టుబడడం నా అంతటగానీ మీవల్ల గానీ జరగని పని. నేను ఏ క్షణంలో ఎక్కడుంటానో నాకే తెలియదు. అనవసరంగా కాలయాపన చెయ్యకండి.

మీరు దూరదర్శన్ కెమేరాని ఆ మనిషివైపు ఫోకస్ చేయిస్తానంటున్నారు నన్ను మళ్ళీ ఫోను చెయ్యమంటున్నారు, ఇదంతా తలనొప్పి వ్యవహారం! అయినా నాకు అంతట నేను ముందుకొచ్చాను కాబట్టి పని పూర్తి చెయ్యడం కోసం అంగీకరిస్తున్నాను. సరిగ్గా అర్థగంట పోయాక మళ్ళీ రింగ్ చేస్తాను మీకు. ఆలోగా మీ ప్రయత్నాలు మీరు చేసుకోండి'' ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

టైము చూసుకున్నాడు దీక్షితులు. మూడుగంటల పది నిమిషాలు!

టేప్‌రికార్డర్ నొక్కి చూశాడు. మాటలన్నీ చక్కగా రికార్డు అయినాయి.

ఇప్పుడేం చెయ్యాలి?

ఎవడో ఒక అనామకుడు చెప్పిన సమాచారానికి ప్రాధాన్యత నిచ్చి హైలెవల్లో వ్యక్తుల్ని సంప్రదించడమా? లేక మనకెందుకని కిమ్మనకుండా కూర్చోవడమా?

ఆ క్షణంలో అతడికి దేశరక్షణే ప్రధాన లక్ష్యంగా తోచింది.

మరుక్షణం అతడి టెలిఫోన్ చక్రం విష్ణుచక్రంలా తిరిగింది.

జనరల్ మానేజర్, టెలిఫోన్స్‌ని సంప్రదించి తను యిన్వెస్టిగేట్ చేస్తున్న కేసుగురించి సూక్ష్మంగా తెలియజేసి ఆ డిపార్టుమెంటు సహకారం అభ్యర్థించాడు. వెంటనే డిటెక్టివ్‌కి ఒక 'అన్‌లిస్టెడ్ నంబరు' యివ్వబడింది. అతడికేం సహకారం కావాలన్నా ఆ నంబర్‌కి డయల్ చెయ్యమనీ ఆలస్యం కాకుండా క్షణాలమీద పనిజరిగేలా ప్రత్యేక ఆదేశాలిస్తున్నాననీ చెప్పాడు జి.ఎం.

"హోం మినిష్టర్ పెర్సనల్ సెక్రటరీ, ఢిల్లీకి లైట్

నింగ్ కాల్ బుక్ చెయ్యండి। ఒక రెండుగంటలసేపు నా టెలిఫోన్‌కి వచ్చే కాల్స్ అన్నీ రికార్డుచేస్తూ అవి ఏ నంబర్సునించి వస్తున్నాయో తెలుసుకుని నాకు తెలియ పరచండి। సరిగ్గా మూడుగంటల నలభై నిమిషాలకి ఒక వ్యక్తి నాకు ఫోన్‌చేస్తాడు। ఆసమయానికే ఢిల్లీనుంచి నాకు మరో కాల్ వస్తుంది। నాకు ఫోన్‌చేస్తున్న వ్యక్తి కనెక్షన్ కట్ చెయ్యకుండా ఢిల్లీ కాల్ కనెక్ట్ చెయ్యండి। ఢిల్లీ లైన్‌లో మేమిద్దరం ఒకేసారి మాట్లాడేందుకు వీలుగా ఏర్పాట్లు చేయించండి। ఈ విషయాలన్నీ అతి రహస్యంగా వుంచాలి। థాంక్యూ।" డిటెక్టివ్ దీక్షితులు చకచకా ఆజ్ఞలు జారీ చేశాడు జనరల్ మానేజర్ యిచ్చిన నంబర్ డయల్‌చేసి

ఇంతలో చిరంజీవి వచ్చాడు.

అతడు దీక్షితులు ఎదురుగా కూర్చుంటున్న సమ యంలో ఫోను మోగడం ఢిల్లీనుంచి హోం మినిస్టర్ పి. ఎస్. లైన్లోకి రావడం జరిగింది.

జరిగిన సంగతంతా అతడికి వివరిస్తూ ప్రధానమంత్రి దహన కార్యక్రమాలు జరుగుతున్న ఈ విషాదసమయంలో దేశక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే శ్రమ కలిగిస్తున్నానని చెప్పి అతడినుంచి తనకు కావలసిన సహకారాన్ని గురించి చెప్పి తగినంత సమయం లేనికారణంగా అధికారాన్నుపయోగించి తోడ్పడవలసిందిగా కోరాడు డిటెక్టివ్.

అప్పటికి పరిస్థితులన్నీ అవగతమయిపోయాయి చిరం జీవికి.

అప్పుడు సమయం మూడూ ఇరవై నిముషాలు। అంటే ఇక యిరవై నిమిషాలే వుంది అతడిచ్చిన టైము।।

ఈ టైములోపల దూరదర్శన్ డైరెక్టర్‌ని కాంటాక్ట్ చెయ్యాలి! అతడు తన స్టాఫ్‌కి ఆదేశాలివ్వాలి! దహన క్రియలు జరుగుతున్నచోట వున్న కెమేరామన్‌కి చెప్పి అతనిచేత కావలసిన వైపుకి కెమేరాని ఫోకస్ చేయించాలి! పైగా వీళ్ళందరికీ ఈ కథంతా చెప్పకురావాలి! ఇదంతా ఈ యిరవై నిమిషాల్లో అయేపనేనా? హోం మినిస్టర్ పి. ఎస్. ఎంత త్వరగా నిర్వహిస్తాడో యీ వ్యవహారం చూడాలి! అనుకొన్నారు డిటెక్టివ్‌లు.

ఈలోగా టేప్‌రికార్డర్‌లో రికార్డయిన మాటలన్నీ విన్న చిరంజీవి తనకితోచిన విషయాలు దీక్షితులకి చెప్పాడు.

"మనకి ఫోన్ యిన్‌ఫార్మర్‌ని మనం ఎంత త్వరగా పట్టుకుంటే అంత మంచిది అతణ్ని వెంటబెట్టుకొని మనం యీ సాయంత్రానికి ఢిల్లీ చేరుకుంటే తప్ప వ్యవహారం చక్కబడదు. ఈసారి అతడు మాట్లాడినప్పుడు ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నదీ టెలిఫోన్స్ ద్వారా తెలుసుకుని అతడ్ని 'ట్రేస్' చెయ్యాలి!

రెండోసారికూడా నిర్భయంగా ఫోను చెయ్యడానికి ఒప్పుకొన్నాడంటే తన ఫోను నంబర్ పట్టుకోలేమను కున్నాడా? లేక పట్టుకున్నా మన కందుబాటులో లేని, చేరుకో లేనీ ప్రదేశంలో వున్నాడా అతను? కాకపోతే పబ్లిక్ బూత్ నించి మాట్లాడుతున్నాడా? పబ్లిక్ బూత్‌నించి మాట్లాడే వ్యక్తికి టీ.వీ. అందుబాటులో ఎలా వుంటుంది?

టీ.వీ. ని చూస్తూ సలహాలిస్తున్నాడంటే అది తప్పకుండా రెసిడెన్సు ఫోనే అయివుండాలి! ఇంటి ఫోను అయితే అతడు దొరికినట్టే! అయినా స్మగ్లింగ్ వ్యవహారాల్లో చెయ్యి తిరిగిన మనిషి యింత తెలివితక్కువగా వ్యవహరించి యింత సులభంగా దొరుకుతాడా?

నకజిమా వి ఐ.పి. లాంజ్‌లో కూర్చున్నాడని చెప్తున్నాడు! ఏ హోదా లేకుండా అక్కడ కూర్చోగలగడం సాధ్యమా? లేక అక్కడి పోలీసులకి ఆ హడావుడిలో మస్కా కొట్టేడా? లేక అతడు మనం అనుమానిస్తున్నట్టు నేరస్థుడు కాడా?

సాయంత్రానికల్లా దహనకాండ పూర్తయిపోతే రాత్రికి రాత్రిగానీ రేపు ఉదయంగానీ విదేశీ ప్రముఖులంతా వెళ్ళిపోతారు. ఈలోగానే ఆ వ్యక్తిని అరెస్టుచెయ్యాలి! సాధ్యపడుతుందా?

కళ్ళెం వెయ్యబడని కాలం పరుగులు తీస్తోంది!

కాలంతో సమానంగా ఆలోచిస్తూ అసహనంగా అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు దీక్షితులు!

టీ వీ కి కళ్ళప్పగించి తదేకంగా చూస్తున్నాడు చిరంజీవి నకజిమా కనిపిస్తాడేమోనన్న ఆశతో.

మళ్ళీ ఫోను!

ఢిల్లీ దూరదర్శన్ డైరెక్టర్ లైన్లోకొచ్చి జరిగిన ఏర్పాట్ల గురించి వివరించాడు. ఆపరేషను వింగ్‌కి ఆదేశాలు ఇచ్చినట్టూ, తదుపరి దహనవాటిక వద్దనున్న కెమేరామెన్‌కి వైర్‌లెస్ ద్వారా ఆదేశాలిచ్చే ఏర్పాటుకూడా పూర్తయిందనీ, కమీషనర్ ఆఫ్ పోలీస్ యీ వ్యవహారాన్ని టేకప్ చేసి నిందితుణ్ని పట్టుకోడానికి సర్వసన్నద్ధంగా వున్నారనీ చెప్పి ఫోను పెట్టేశాడు.

ఇన్‌ఫార్మర్ చెప్పిన సమయం అయ్యింది డిటెక్టివ్‌లు వాచీలు చూసుకున్నారు. మూడుగంటల నలభై నిమిషాలు!

ఒక నిమిషం దాటుతోంది. రెండు....మూడో నిమిషం కూడా....!

ఇతడు నిజంగా ఫోనుచేస్తాడా? లేక లైను కలవడం లేదా? ఫోను రాకపోతే యింత ఏర్పాటూ బూడిదలోపోసిన పన్నీరేకదా! ఇతడి మాటనమ్మి పెద్దపెద్ద వ్యక్తులసహాయం కూడా తీసుకున్నామే? తాము 'ఫూల్స్' కాలేదుకదా?

ఇలా ఆలోచిస్తూండగా శ్రవణానందకరంగా మ్రోగింది ఫోను!

"హల్లో.... ఎంతవరకూ వచ్చాయి మీ ఏర్పాట్లు?"

"ఎవ్వరితింగ్ ఈజ్ రెడీ! ఒక రెండుక్షణాలు లైన్లో వుండండి మీరూ నేనూకూడా ఢిల్లీతో మాట్లాడేందుకు వీలుగా మాన్యువల్ లైనులో కనెక్షన్ యిచ్చే ఏర్పాటు చేశాం!" అంటూ అతడు వాక్యం పూర్తిచేసేలోగా ఆప రేటర్ ఢిల్లీ దూరదర్శన్‌కి కనెక్షను యిచ్చింది.

ఇన్‌ఫార్మర్ తను మొదట నకజిమాని ఏ ప్రదేశంలో చూశాడో వివరించాడు. ఆ ప్రకారంగా క్షణాల్లో కెమేరా ఆ దిక్కుకి మళ్ళింది! అతడు చెబుతున్నాడు మళ్ళీ. అను గుణంగా కదులుతోంది కెమేరా!

ముక్కూ మొహం తెలియని ఓ అనధికార వ్యక్తి — పైగా ఓ దేశద్రోహి — తాను ఎలా నడిపిస్తే అలా నడు స్తోంది ప్రభుత్వ అధీనంలోని దూరదర్శన్!

ఉండవలసిన ప్రదేశంలో కనిపించలేదు నకజిమా!!

అతడు కూర్చున్న కుర్చీ ఖాళీగా వుంది! పోనీ ఆ వరసలో మరెక్కడన్నా వున్నాడేమో? పోనీ ఆ లాంజ్‌లో ఎక్కడన్నా.... వేరే మరోచోట.... మరోచోట కెమేరా ఆ ప్రాంతమంతా ఆశగా ఆకలిగా వెదికింది. ఫలితం శూన్యం!

పిట్ట ఎగిరిపోయింది! అందరి గుండెల్లోనూ ఉత్సాహం వచ్చిపోయి నిరుత్సాహం నిండిపోయింది!

"డియర్ డిటెక్టివ్! పెద్ద తెలివైనవాడిలాగా ఒక్క

దెబ్బకి రెండు పిట్టలన్నట్టు—అటు 'నక్కా' గాణ్ని, ఇటు నన్నూకూడా పట్టుకోడానికి పథకంవేసి నాచేత రెండోసారి కూడా ఫోనుచేయించావ్! కాని ఏం జరిగింది? ఈలోగా నేను భయపడ్డట్టుగానే వాడు కాస్తా అక్కణ్నించి ఉడాయించాడు! అటు వాడూ ఇటు నేనూ ఇద్దరం మీ వలకి చిక్కలేదు!

ఇందాకా మీరన్నారు చూశారూ ఏవో దుష్ప్రభావాలనీ! మీ చేతకానితనం వల్ల యిప్పుడు యావద్భారతదేశంమీద చక్కగా పడుతున్నాయి! పడ్డాయికూడా! గుడ్ బై" ఫోను కలుక్కుమంది.

దీక్షితులు గుండె చివుక్కుమంది.

చిరంజీవి మస్తిష్కంలో ఓ ఆలోచన తళుక్కుమంది.

2

చాలా దుకాణాలు సంతాప సూచకంగా మూసివేయబడి వున్నా కొన్ని షాపులు మాత్రం అక్కడా అక్కడా తెరిచి వున్నాయి.

"దీప్తి మార్కెటింగ్ ఏజన్సీస్" బోర్డు చూస్తూనే సడన్‌గా ఆగింది కారు. అందులోంచి దిగిన డిటెక్టివ్ లిరువురూ ఒకసారి తేరిపారా చూసి లోనికి ప్రవేశించారు. ప్రవేశ ద్వారానికి వెలుపల గాజుతలుపుల ప్రక్కన అమర్చబడివున్న పబ్లిక్ టెలిఫోన్‌ని చూస్తూ అసిస్టెంటుకి సైగ చేశాడు దీక్షితులు.

షో రూం లోపల రకరకాల టీవీలు, మిక్సీలు, గీసర్లు, వాషింగ్ మెషీన్లూ యింకా రకరకాల గృహోపకరణాలు అమ్మకానికి పెట్టబడివున్నాయి.

డిటెక్టివ్స్‌ని చూస్తూనే ఓ బట్టతల మనిషి ముందుకు వచ్చి "రండి సార్! కూర్చోండి! ఏం కావాలి?" అన్నాడు మందహాసం చేస్తూ.

దీక్షితులు కళ్ళు పరిసరాల కంకితమయ్యాయి.

నలుగురు కస్టమర్స్ వారి ధ్యాసలో అటు తిరిగి వారికి కావలసిన వస్తువుల నాణ్యత పరిశీలిస్తున్నారు.

ఫోన్ చేసిన వ్యక్తి తెలివితక్కువ వాడేంకాదు యింకా అక్కడే కూర్చోడానికి. అయినా 'అపరాధ పరిశోధన' కల వాటుపడ్డ కళ్ళు వారిలో అనుమానించదగ్గ వ్యక్తులెవరైనా వున్నారేమోనని వెదుకుతున్నాయి.

రెండు నలుపు తెలుపు టీవీలు. ఒక కలర్ టీవీ ఆన్ చేసివున్నాయి. శ్రీమతి గాంధీ అంతిమయాత్ర ప్రత్యక్ష ప్రసారం జరుగుతోంది.

షోరూం ముంగిట్లో అమర్చబడిన పబ్లిక్ టెలిఫోన్‌లో మాట్లాడే వ్యక్తికి అద్దాల తలుపుల్లోంచి లోపలి టీవీ కార్యక్రమాలు స్పష్టంగా కనిపించే వీలుంది. కాని ఆ వ్యక్తి మాట్లాడే మాటలు లోపలికి వినిపించే అవకాశంలేదు. పైగా టీవీ మాటలు నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నాయి.

పబ్లిక్ టెలిఫోన్‌ని చాలామంది వుపయోగించుకుంటారు కాబట్టి షోరూం యజమానిని ప్రశ్నించి ప్రయోజనం లేదని భావించాడు దీక్షితులు.

"ఈ షాప్ ప్రొప్రయిటర్ మీరేనా? కొత్తగా ప్రారంభించినట్టున్నారు!" చిరంజీవి అడిగేడు మామూలు ధోరణిలో.

"అవునండి! నా పేరు తివారీ! ఆర్మీలో రిటైరయినాక రెండేళ్ళ క్రితమే ఈ బిజినెస్ ప్రారంభించాను. ఆదాయం కోసం ఏదో ఒక వ్యాపారమో, వృత్తో ఏదో చేసుకోవాలి గదండీ. పైగా కష్టానికి అలవాటుపడ్డ శరీరం. అన్నట్టు తమరు మా షోరూంకి రావడం యిదే మొదటిసారను కుంటా. ఎప్పుడూ చూపినట్టులేదు" అన్నాడు వినయంగా.

చిరంజీవి జేబులోంచి అయిడెంటిటీ కార్డు తీసి చూపించాడు.

ఎంత ఆర్మీలో పనిచేసిన వ్యక్తయినా 'డిటెక్టివ్స్' అనగానే కొంచెం ఖంగుతిని అది కనపడకుండా "మిమ్మల్ని కలిసినందుకు చాలా సంతోషమయిందండీ!" అన్నాడు ఓ జీవంలేని నవ్వు నవ్వి.

"ఒక అపరిచిత వ్యక్తి అరగంట వ్యవధిలో రెండు సార్లు యిక్కడనుంచి మాకు ఫోన్ చేశాడు. రెండవ కాల్ అందుకుని సుమారు యిరవై నిమిషాలుపైగా అవుతోంది. పైగా ఆ వ్యక్తి టీ.వీ. చూస్తూ ఆ కార్యక్రమం గురించి మాతో ముచ్చటిస్తూ మాట్లాడేడు. అతడి ఆచూకీకోసం వచ్చాం. మీరేమైనా చెప్పగలరా?" అన్నాడు చిరంజీవి.

"నేనొచ్చి పదినిమిషాలే అవుతోంది. నేను లోపలికొస్తున్న సమయంలో కునాల్‌సాబ్ బయట ఫోన్‌చేస్తూ కనబడ్డారు. ఇంతసేపూ ఆయన యిక్కడ కూర్చునే వున్నారు. అప్పుడు తప్పితే రెండోసారి ఆయన ఫోన్ చెయ్యడం నేను గమనించలేదు. అయినా అడిగి చెప్తాను" సేల్స్‌మెన్ని పిలిచాడు తివారీ.

"మీరు రావడానికి బాగా ముందు ఆ సాబ్ వచ్చేరయ్యా. మీరు రాలేదని చెప్పగానే ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడి మళ్ళీ వస్తానని మీ సేట్‌కి చెప్పమని చెప్పి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆయనగారు ఫోను మాట్లాడుతుండగా మీరు వచ్చేరుగా సాబ్!" అన్నాడు సేల్స్‌మాన్.

అతడ్ని వెళ్ళమని "అదండీ సంగతి" అన్నట్టు చూశాడు తివారీ.

"కునాల్‌సాబ్ అంటే ఎవరు?" ప్రశ్నించేడు చిరంజీవి.

"ఆయన పేరు కునాల్‌సింగ్! నాలుగు రోజుల క్రితమే

మొదటిసారిగా ఆయన షాప్‌కి వచ్చాడు—కలర్ టీవీ ఒకటి కావాలని. మళ్ళీ వీలుచూసుకొని వచ్చి టెస్ట్ చేసుకుని ఏదో ఒక సెట్ పట్టుకెడతానని చెప్పి వందరూపాయలు అడ్వాన్సు యివ్వబోతోంటే నేనే వద్దన్నాను. పెస్టి సైడ్ బిజినెస్ చేస్తున్నానన్నాడుగానీ అడ్రసు చెప్పలేదు."

"ఎలా వుంటాడు? ఇక్కడికి ఎలా వచ్చాడు?"

"తెల్ల మారుతీ కారులో వచ్చాడు రెండుసార్లూ కూడా. కొంచెం పొట్టిగా బలిష్టంగా వుంటాడు పిల్లికళ్ళు—ఈ ఆధారాలతో సులభంగా పట్టుకోవచ్చనుకుంటా. అయినా రేపో యెల్లుండో మళ్ళీ వస్తానన్నాడు. వస్తే తప్పకుండా మీకు ఫోన్‌చేసి చెబుతాను—మీ నెంబరుందిగా యీ కార్డులో."

"అతడు మళ్ళీ యిక్కడకు వస్తాడనుకోవడం వుట్టి భ్రమ! అడ్వాన్సు తీసికొనివుంటే అదేనా దక్కివుండేది మీకు. రంజీ! శతభిషానికి ఫోన్‌చేసి పదినిమిషాల్లో ఆఫీసు కొచ్చి కలవమని చెప్పు" అంటూ యాభై పైసల నాణెం కోసం జేబులు వెతుక్కున్నాడు దీక్షితులు.

"ఎందుకుసార్....నా ఫోన్‌లో చెప్పండి" అంటూ తివారీ లేచి కౌంటర్‌లోంచి తన స్వంత ఫోను తీసి బయట పెట్టాడు.

చిరంజీవి ఫోన్ చేశాక డిటెక్టివ్‌లు తివారీ వద్ద సెలవు తీసుకుని బైటికొచ్చారు

కునాల్ చాలా తెలివిగా తప్పించుకున్నాడు. తివారీకి ఏమాత్రం అనుమానం రాకుండా ఎదురుగా టీవీ చూస్తూ డైరెక్షన్స్ యిచ్చాడు

చిరంజీవి టెలిఫోన్ డైరెక్టరీ తీసి కునాల్‌సింగ్ పేర్లున్న యిద్దరి అడ్రస్‌లు నోట్ చేసుకున్నాడు. తర్వాత

పెస్టిసైడ్స్ బిజినెస్ చేసే వాళ్ళందరి పేర్లూ ఎంక్వయిరీ చెయ్యగా అందులో కునాల్‌సింగ్ పేరున్న వాళ్ళెవరూ దొరకలేదు. ఒక్క అర్ధగంటలో నగరంలో తెల్లమారుతీ కార్లున్న వారందరిపేర్లూ సంపాదించాడు. కానీ ఆ లిస్టులో కూడా అతడు దొరకలేదు.

"అంటే ఆ స్మగ్లర్ తివారీకి తన పేరు మార్చి 'కునాల్ సింగ్' అని కల్పించి చెప్పివుండవచ్చు" చిరంజీవి అనుమానం వ్యక్తంచేశాడు.

"ఏదీ....ఆ పేరుమీద డైరెక్టరీలో దొరికిన యిద్దరి వివరాలు యింకా తెలియాలిగా" అన్నాడు దీక్షితులు.

మరో గంటకి ఇన్‌స్పెక్టర్ శతభిషం వచ్చాడు.

ఎంతో ఆశగా చూపిన చిరంజీవి నీరుకారిపోయాడు ఇన్‌స్పెక్టర్ చెప్పింది విని.

ఆ యిద్దరిలో ఒక కునాల్‌సింగ్ మంచంమీద నించి లేవలేనంత వయోవృద్ధుడు. మరొక వ్యక్తికి ముప్ఫయి అయిదేళ్ళుంటాయి. కానీ అతడు బ్రతికిలేడు.

శతభిషం సిగ్గుపడుతూ చెప్పాడు.

దీక్షితులు నవ్వుకున్నాడు.

3

రాత్రి పదకొండవుతోంది.

ఇక ఆ రోజుకి చేసిన దేశసేవ చాలనుకుని కుర్చీల్లోంచి లేవబోతున్న డిటెక్టివ్‌లని మళ్ళీ కుర్చీల్లో కూలబడేలా చేసింది గణగణమని మోగిన ఫోను.

"హలో....చిరంజీవి డిస్‌పైడ్."

"నాయనా చిరంజీవీ నేను కునాల్‌సింగ్‌ని మాట్లాడుతున్నా"

చిరంజీవి అటెన్‌షన్ పొజిషన్‌లో కొచ్చేసి దీక్షితులికి

కన్నుగీటాడు.

"పాపం చాలా శ్రమపడుతున్నార్ట నా కోసం! అనవసరంగా ముందుకెళ్ళి ఆరోగ్యాలు పాడుచేసుకోకండి! ఇక మీ పరిశోధన యింతటితో ఆపకపోతే మీ యిద్దరూ జీవితంలో కోలుకోలేని దెబ్బతింటారు నా చేతిలో! మైండిట్!!"

"థాంక్యూ మై డియర్ డాక్టర్!" చిరంజీవి స్వరంలో హేళన ధ్వనించేసరికి కునాల్‌సింగ్ అన్నాడు-"నా గురించి కాస్తో కూస్తో సమాచారం యిచ్చి మీకు 'క్లూ' యిచ్చిన తివారీగాడికి ఆపరేషన్ చేసి తిక్క నయం చేస్తున్నాను. చేతనయితే రక్షించుకోండి!" ఫోన్ పెట్టేశాడు కునాల్ సింగ్.

"చేతనయితే"—అన్నమాట కునాల్‌సింగ్ నోటినుంచి వెలువడడం యిది రెండవసారి. చిరంజీవి రక్తం కుతకుతలాడిపోయింది.

రెండు నిమిషాల్లో గ్యారేజ్‌నించి బయటపడిన డిటెక్టివ్‌ల కారు శరవేగంతో దూసుకుపోయింది తివారీ ఇంటివైపు.

వీధి తలుపులు దగ్గరగా వేసున్నాయి.

లోపలికి ప్రవేశించిన డిటెక్టివ్‌లకి రెండు గదుల తర్వాత హాల్లో తాళ్ళతో కట్టబడి కుర్చీతోసహా నేలమీద పడివున్న ఒక స్త్రీ కనిపించింది. ఆమె ప్రక్కనే టీపాయ్ మీద టెలిఫోన్ రిసీవర్ వేలాడుతోంది.

తివారీ భార్యను బంధవిముక్తురాలినిచేసి తివారీ గురించి ప్రశ్నించాడు చిరంజీవి.

ఆమె నెత్తినోరూ కొట్టుకొని ఏడవడం ప్రారంభించింది.

—ఎవరో వచ్చి తలుపు తడితే తీయడానికి సంకోచిం

చిన తివారీ దంపతులకు ఆ వచ్చిన వ్యక్తి తాను డిటెక్టివ్ నని చెప్పగానే తలుపు తీశాడట తివారీ.

తలుపు తెరవగానే ప్రవేశించిన ఆ వ్యక్తి హఠాత్తుగా తివారీ కడుపులో బలంగా గుద్ది అతడ్ని పక్కకు ఈడ్చి అతడి భార్య నోరునొక్కి కుర్చీకి కట్టేసి టెలిఫోన్ మోగకుండా రిసీవర్ తీసి ప్రక్కకు పడేసి తివారీని కార్లో యెక్కించుకుని తీసుకుపోయాడు. ఇదంతా అయిదు పది నిమిషాల్లో అయిపోయింది—

తివారీ భార్య చెప్పిన గుర్తుల్నిబట్టి ఆ వ్యక్తి కునాల్‌గా నిర్ధారించారు డిటెక్టివ్‌లు.

"నా భర్త నెలాగైనా రక్షించండి! ఆయన కే ప్రమాదమూ జరక్కముందే విడిపించండి దయచేసి. ఎంత ఖర్చైనా సరే! ప్లీజ్!" రెండు చేతులు మొహాన కప్పుకుని బావురుమంది తివారీ భార్య.

ఇంతలో దీక్షితులు పిలుపునందుకుని శతభిషం పరివారంతోసహా వచ్చాడు.

కావలసిన చోటల్లా వేలిముద్రలకోసం పౌడరు జల్లి ఫోటోలు తీసుకున్నారు.

శతభిషం వెంటనే పోలీస్ కంట్రోల్ రూంకి ఫోన్‌చేసి ఆగంతకుడి వివరాలు చెప్పి అన్ని పోలీస్ స్టేషన్స్‌నీ అప్రమత్తం చెయ్యమని చెప్పాడు.

4

మరో రెండు రోజులు గడిచాయి.

అటు నకజిమా గురించిగానీ, ఇటు తివారీని కిడ్నాప్ చేసిన కునాల్‌సింగ్ గురించిగానీ వుపయోగపడే సమాచారం లభించలేదు.

ఆ రోజు మధ్యాహ్నం—

కమీషనర్ ఆఫ్ పోలీస్, ఢిల్లీ నుంచి దీక్షితులికి ఫోన్ కాల్!

"ఢిల్లీ పరిస్థితులు చూచాయగా మీకు తెలుస్తున్నాయను కుంటాను. శ్రీమతి గాంధీని కాల్చి చంపిన సిక్కులపై యిక్కడి ప్రజలు ఆగ్రదహో్గ్రులై పోతున్నారు. ఫలితంగా కొన్నిచోట్ల గృహదహనాలూ, కొట్లాటలూ అవుతున్నాయి. ముఖ్యంగా సిక్కులు నివసించే ప్రదేశాలలో ఈ ఘాతుకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే—నిన్నరాత్రి సులేమాన్ నగర్‌లో జరిగిన ఓ పెద్ద ప్రేలుడు ప్రమాదంలో అయిదు గురు వ్యక్తులు మరణించగా సుమారు పదిమందిదాకా గాయపడ్డారు. అందులో మొన్న మీరు చెప్పిన జపాన్ మనిషి 'నకజిమా' కూడా మరణించాడు! అతడి తొడమీద 'డ్రాగన్' పచ్చబొట్టు, కుడికంటి కింద కత్తిగాటూ వున్నాయి.

చిత్రం ఏమిటంటే అతడు బాంబు ప్రేలుడువలన మర ణించలేదు! శవపరీక్ష చేసినపుడు అతడి కడుపులోంచి ఒక బులెట్ బయటపడడం వలన పరీక్షచేసి బాంబు ప్రేలుడుకి ముందే యితడు కాల్చి చంపబడినట్లు నిర్ధారణ చేశారు డాక్టర్లు! ఇంతవరకూ ఈ నేరాలకు సంబంధించి యెవరినీ అరెస్టు చెయ్యలేదు. అవసరమైతే మళ్ళీ ఫోన్ చేస్తాను ఈ విషయం చెప్పడానికే ఫోన్‌చేశా!" అని ముగించాడు కమీషనరాఫ్ పోలీస్.

డిటెక్టివ్‌ల బుర్రల్లో చిక్కుముడులు మరింత బిగుసు కున్నాయి!

నకజిమా పోయాడనుకుంటే వాణ్ణి చంపి రంగంలోకి మరొకడొచ్చాడు. ఆ వచ్చినవాడు కునాల్‌సింగ్ మనిషా

లేక అతడికీ శత్రువా? ఈ స్మగ్లింగ్ వ్యవహారంలో ఇలా యింకా ఎంతమంది వున్నట్టు? మరి ఇండియాకి నేనే ఏజంటునని చెప్పుకున్నాడే కునాల్ సింగ్?

దీక్షితులు పైపు వెలిగించారు. నాలుగుసార్లు వేడివేడిగా పొగ వదిలేసరికి మెదడు బూజు వదిలింది. వెంటనే "మనం అట్నించి నరుక్కొస్తే?" అన్నాడు.

"ఎట్నించి?" చిరంజీవి కర్థం కాలేదు.

అతడికి చెయ్యవలసిందంతా విడమర్చి చెప్పాడు డిటెక్టివ్.

చిరంజీవి హుషారుగా ఒకసారి ఈలవేసి, బయటికి వెళ్ళిపోయాడు ఆ పనిమీద.

5

ఆ రోజు రాత్రి పన్నెండు కావస్తోంది.

బయట సన్నగా వర్షం పడుతోంది.

చిరంజీవికి ఆవులింతలు ప్రారంభమవుతున్న ఆ సమయంలో ఎవరో తలుపు దబదబ బాదడం వినిపించి చిరాకుగా వెళ్ళి తలుపు తీశాడు.

ఆ వచ్చిన వ్యక్తి ఎవరో పోల్చుకునేలోగా అతడు రివ్వున లోపలికి దూసుకొచ్చి దీక్షితులు ముందు మోకరిల్లి "ఇవి చేతులు కావుసార్! నన్ను కాపాడండి. వాళ్ళు తరుముకొస్తున్నారు" హడావుడిగా ప్రాధేయపడడం ప్రారంభించాడు ప్రాణభీతితో.

అతడు తివారీ!

దీక్షితులు, చిరంజీవి ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"కునాల్ సింగ్ మనుషులు రెండు రోజుల్నించి నన్ను నానా హింసలకూ గురిచేస్తున్నారు. కారులో నన్నెక్కడికో

తీసికెళ్ళడానికి ప్రయత్నంచేస్తోంటే రైల్వేగేటు దగ్గిర కారు ఆగినపుడు వాళ్ళ కళ్ళుగప్పి యిలా పరిగెట్టుకొచ్చాను. యింటికెడితే నన్ను బతకనివ్వరు. మీరే రక్షించాలి!"

"మీకొచ్చిన భయమేంలేదు! నిశ్చింతగా వుండండి!" అన్నాడు చిరంజీవి గయోపాఖ్యానంలో అర్జునిడిలాగా.

దీక్షితులు ఫోనందుకుని డయల్ చేసి "హలో, శత భిషం, నేనూ దీక్షితుల్ని మాట్లాడుతున్నాను. వెంటనే యిక్కడకు రాగలవా! కునాల్ సింగ్ దొరికాడు!"

"వ్వాట్ కునాల్ సింగ్ దొరికాడా? ఎక్కడ సార్ ఎక్కడ?" తివారీ ఆశ్చర్యాని కంతులేదు. వెంటనే లేచి నిలబడ్డాడు.

"ఎక్కడో అయితే ఇన్ స్పెక్టర్ యిక్కడికెందుకొస్తా డండీ? ఆ కునాల్ సింగ్ సాక్షాత్తూ మా ఎదుటే వున్నాడు తివారీ రూపంలో!" అన్నాడు చిరంజీవి.

"వాటీస్ దిస్ నాన్సెన్స్!"

తివారీ మాట పూర్తి చేసేలోగా చిరంజీవి రాకెట్ స్పీడ్ తో విడుదల చేసిన 'కుంగ్ఫూ' దెబ్బకి కుర్చీమీంచి అవతలికి ఎగిరిపడ్డాడు తివారీ!

"డిటెక్టివ్ యింటికొచ్చి డిటెక్టివ్ కే రివాల్వర్ గురి పెట్టేటంత మొనగాడివా నువ్వు?" అంటూ తివారీ జేబు లోంచి రివాల్వర్ స్వాధీనం చేసుకున్నాడు చిరంజీవి.

"కునాల్ సింగ్ అర్ధరాత్రివేళ మీ యింటికి వచ్చి నిన్ను కిడ్నాప్ చేసినట్లు, నువ్వూ నీ భార్య కలసి ఒక కథను సృష్టించి యిద్దరూ చక్కగా నటించారు. అప్పుడు మీ యింట్లోనూ ఫోన్ మీదా తీసుకున్న నీ వేలిముద్రలు రికార్డు చేశాం. మర్నాడు ఉదయం మీ షోరూంలో టెలిఫోన్ డిపార్టుమెంటువారిచేత పబ్లిక్ టెలిఫోన్ డబ్బా తెరిపించి

అందులో పడిన యభై పైసల నాణేలన్నీ జాగ్రత్తగా తీయించి వేలిముద్రలు పరీక్షచేస్తే వాటిలోవి రెండు నాణేలమీద నీ చేతి వేలిముద్రలు స్పష్టంగా కనిపించాయి:

నీ కంటూ ఒక స్వంత ఫోనుండగా, అది సక్రమంగా పని చేస్తూవుండగా నువ్వు పబ్లిక్ ఫోనులో మాట్లాడే అవసరం ఎందుకొస్తుంది? అప్పుడే నువ్వు కునాల్‌సింగుగా నాటక మాడుతున్నావనీ, కిడ్నాప్ పేరుమీద ఎక్కడో అజ్ఞాతవాసం చేస్తున్నావన్నీ ఊహించాం.

నకటిమా తప్పించుకుపోయాడని తెలియగానే యిక నీకు మా అవసరం లేకపోయింది. అతణ్ణి స్వయంగా ఎదుర్కోటానికి—మా కళ్ళల్లో కారంకొట్టి, చక్కటి ఎలిబీ సృష్టించుకుని మీ భార్యాభర్తలిరువురూ నాటకమాడి కునాల్‌సింగ్ నిన్ను ఎత్తుకుపోయాడని చెప్పి—ఢిల్లీ చెక్కేసావు.

ఢిల్లీలో నకటిమా తిరిగే ప్రదేశాలు నీకు తెలిసినవే కాబట్టి సులభంగా కనుక్కొని అక్కడికక్కడే అతణ్ణి కాల్చి చంపావు. ఆ తర్వాత జరిగిన బాంబు ప్రమాదంలో జరిగిన హడావుడి నువ్వు తప్పించుకుపారిపోవడానికి చక్కగా అనుకూలించింది.

కాని నువ్వు హైదరాబాదు తిరిగిరాగానే నిన్ను విమానాశ్రయంలో మా వ్యక్తి గుర్తుపట్టేడు. ఆ వ్యక్తి ఆ సంగతి మాకు చెప్పి వెళ్ళగానే ఢిల్లీలో జరిగిన ప్రమాదం గురించి వివరంగా మాకు తెలిసింది. ఆ ఘాతుకాలంకూ నీకూ సంబంధం వున్నదో లేదో నీచేత చెప్పిస్తారు ఢిల్లీ పోలీసులు" దీక్షితులు ముగించే సమయానికి ఇన్‌స్పెక్టర్ శతభిషం సపరివారంగా విచ్చేసి, తివారీని కస్టడీలోకి తీసుకున్నాడు. □

వసుంధర

ప్రేమించకు కష్టాలొస్తాయ్!



ఆమె ఎవరో నాకు తెలియదు. చూడ్డానికి అప్సరసలా వుంది. ట్రయిన్లో నాకెదురుగా కూర్చుని వుంది. నేనామె వంక చూశాను. ఆమె నా వంక చూసి నవ్వింది. అది పరిచయాన్ని కోరే నవ్వు.

నా మనసునిండా పరవశం.

అరుదైన నవ్వది!

అందమైన ఆడపిల్ల తనకుతానై పరిచయం కోరి నన్ను చూసి నవ్వడం....

నేనూ నవ్వాలనే అనుకున్నాను కానీ....

ఆమె నవ్వింది నేనూ నవ్వితే మా ఇద్దరికీ పరిచయం తప్పదు. ఆమె ఎంతటి అందగత్తె అంటే ఏ పరిచయమూ లేకుండానే నేనామెను ప్రేమిస్తున్నాను. పరిచయమైందంటే ప్రేమించకుండా వుండలేను.

అప్పుడు....

ఆమెకూడా నన్ను ప్రేమిస్తుందన్న గ్యారంటీలేదు. అప్పుడు ప్రారంభమవుతాయి నా కష్టాలు....

నేనాలోచిస్తున్నాను.

పాపం ఆమె యింకా నన్ను చూసి నవ్వుతూనే వుంది.

నా సందిగ్ధం పోవడంలేదు.

ఆఫ్టరాల్ కొన్ని గంటల ట్రయిన్ ప్రయాణం.... కాసేపు సరదా కబుర్ల అనుభూతిపొంది ఒకరినొకరు మర్చి పోతేనేం?

రోజూ ఎందరో అందగత్తెల్ని చూస్తూనే వుంటాం.... అందర్నీ ప్రేమించగలమా?

మామూలుగా అయితే అంతా యిలా ఆలోచిస్తారు. కానీ నేను మామూలు మనిషిని కాదు. ఒకసారి ప్రేమించి దెబ్బతిన్నవాణ్ణి ప్రేమించడంవల్ల సుఖంగా నడిచిపోతున్న జీవితంలోకి ఎన్నో యిబ్బందులు వచ్చాయి.

మళ్ళీ అలాగే జరుగుతుందన్న భయం నన్ను ప్రేమకు విముఖుణ్ణి చేస్తోంది. ఆఖరుకు కలలో కూడా నేను ప్రేమంటే భయపడుతున్నాను.

ఎవరో నన్ను కుదుపుతున్నారు.

"ఒరేయ్ .... అన్నయ్యా .... లేలే .... హరగోపాల్ వచ్చాడు...."

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

కళ్ళు నులుముకుని మత్తు వదిలించుకుని చుట్టూ చూసే సరికి ట్రయినూలేదు—ఆ అందమైన అమ్మాయీలేదు. ఆఖరికి ఎదురుగా కనిపిస్తున్న చెల్లాయి కూడా అందంగాలేదు. నిద్రనుంచి లేచిన లక్షణాలన్నీ దాని ముఖంలో వున్నాయి.

నేను నా మంచంమీద వున్నాను.

"ఏమిటన్నావూ?" అన్నాను.

"హరగోపాల్ వచ్చాడు."

హరగోపాలనగానే నాకెంతో ఉత్సాహం వచ్చింది. అతడికి నేనంటే యెంతో యిష్టం, గౌరవం, అభిమానం వున్నాయి. అస్తమానూ నన్ను పొగుడుతుంటాడు.

"నీకులాగుండడం అందరికీ సాధ్యపడదు గురూ!" అంటూంటాడు.

అందుక్కారణం లేకపోలేదు.

నేను మడతనలగని ఇస్త్రీ బట్టలుతప్ప వేసుకోను. నా నావంటిమీదుంటే వాటి మడతలు నలగవు. నేను ఇన్‌షర్టు చేస్తే రోజంతా ఎంత తిరిగినా చెక్కుచెదరదు. సినిమా హీరోలా—ఎప్పుడు చూసినా అప్పుడే వికసించిన తాజా పుష్పంలాగుంటానని అంతా నా గురించి ప్రత్యేకంగా చెప్పకుంటారు. మనిషిని కూడా ఎప్పుడూ ఘుమఘుమ లాడుతూంటాను.

మా యింట్లోనే నేనొక చర్చనీయాంశాన్ని.

"శుభ్రమంటే అలాగుండాలి" అని అమ్మ మెచ్చుకుంటుంది.

"వెధవకి షోకులెక్కువ" అని నాన్న గొణుగుతాడు.

ఆయన గొణుగుడులో కోపంకంటె ముచ్చటే ఎక్కువగా వుంటుంది.

"ఆడపిల్లని—నీ షోకు నాకు నేర్పరా?" అంటుంది చెల్లాయ్.

తమ్ముడు నేనంటే అసూయపడతాడు. అందు కింకో కారణంకూడా వుంది. కాలేజీలో నావన్నీ పెద్ద పరిచయాలు. చాలామందిని నేనేడిపిస్తూంటాను. నే నెవరెవరి నెలా ఏడిపిస్తూంటానో చూడ్డానికి ఓ బృందం నా వెనువెంట తిరుగుతూంటుంది. వాళ్ళంతా యించుమించు నా భక్తుల్లాంటివాళ్ళు.

తమ్ముడు నాకు పూర్తిగా వ్యతిరేకం.

హైస్కూల్లో ఎప్పుడెవరు తన నేడిపిస్తారోనని వాడి భయం.

నేను కాలేజీ వదిలి యూనివర్శిటీకి వెళ్ళిపోయాను. వాడీ కాలేజీలోకి వెళ్ళాడు. అక్కడ నా గురించి చెప్పుకునే కథలు విన్నాడుట. నా కవి చెప్పి—"సాటివారిని ఏడిపించడం మంచి లక్షణం కాదు...." అని చెప్పాడు.

అది అసూయని నాకు తెలుసు.

ఇతరులను ఏడిపించడంలోనే నా కానందముంది. ఇతరులెవ్వరూ నన్నేడిపించలేరన్న ధీమాకూడా నాకుంది. అందువల్ల నేను నిత్యసంతోషిగా వుండగలిగాను.

కానీ—నా ప్రేమ నన్ను నిర్వీర్యుణ్ని చేసింది.

"ఏమిటన్నయ్యా .... అలా ఆలోచిస్తూ కూర్చుండిపోయావ్?" అంది చెల్లాయ్.

నేనులిక్కిపడి—"అతన్ని కూచోమని చెప్పు. నేనిప్పుడే వస్తాను" అంటూ బాత్‌రూంకి పరుగెత్తాను.

అప్పుడే నిద్రలేచి హరిగోపాల్ కంటపడడం నాకిష్టం

లేదు. అందుకే పళ్ళు తోముకొని, స్నానంచేసి, డ్రెస్సయి మరీ అతణ్ని చూడ్డానికి వెళ్ళాను.

ఇప్పుడే అంటే గంటన్నర పట్టింది.

అంతసేపూ పాపం హరగోపాల్ నాకోసం ఓపికగా ఎదురుచూస్తున్నాడు. నన్ను చూస్తూనే ఉత్సాహంగా— "హాయ్ గురూ!" అన్నాడు.

"హాయ్" అన్నాను.

"వాల్తేరునుంచి నిన్ననే వచ్చావుటగా—నాకు రాత్రే తెలిసింది."

"ఊఁ" అంటూ కూర్చున్నాను.

తమ్ముడు మా యిద్దరికీ కాఫీ యిచ్చి వెళ్ళాడు.

హరగోపాల్ కాలేజీతోనే చదువాపేశాడు. వాళ్ళ వాళ్ళింక అతణ్ని చదివించలేరు. అయితే ఊళ్ళోనే ప్రైవేట్ బ్యాంకులో అతడికుద్యోగం దొరికింది. ఇప్పు డతడి పని బాగానే వుంది.

"నీతో ఓ పెద్ద పనుండి వచ్చాను గురూ!" అన్నా డతడు.

"ఏమిటది?"

"ఇక్కడ చెప్పేదికాదు...."

మే మిద్దరం నా గదిలోకి వెళ్ళాం — కాఫీ కప్పులు అక్కడే వదలి.

హరగోపాల్ నా వయసువాడే అయినా నన్ను పెద్దవాడి కిలా గౌరవిస్తాడు. ఎన్నో విషయాల్లో అతడు నా సలహా అడిగి వున్నాడు. అందుకే అతడితో మాట్లాడ్డం నా కిష్టం.

"ఊఁ చెప్పు" అన్నాను.

"మా వాళ్ళు నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు."

"గుడ్, ఈ సెలవుల్లోనే నాకు పెళ్ళి భోజనమన్న

మాట!" అన్నాను.

"అదేంకాదు....నాకు వాళ్ళు చూసే సంబంధా లిష్టం లేదు ..."

"మరి ...?"

"నేనో అమ్మాయిని ప్రేమించాను."

అరి హరగోపాల్ అనుకున్నాను. "ఆఖరికి నీక్కూడా ప్రేమ కావలసొచ్చిందా?" అనిపించినా పైకేమీ అనలేదు. పొద్దున్నే దొరికిన కష్టమర్నంత సులభంగా వదలాలనిలేదు నాకు.

"ఆ అమ్మాయిని పెళ్ళి చేసేసుకో."

"వాళ్ళు సామాన్యమైన మధ్య తరగతివాళ్ళు. కట్న మిచ్చుకోలేరు. అమ్మా నాన్నలనీ పెళ్ళికి ఒప్పించడం చాలా కష్టం."

"ఊఁ"

"అయినా నాకు భయంలేదు."

"అయితే నీకింక అడ్డేముంది?"

"ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తోందో లేదో నాకు తెలియదు. మనిషి చాలా స్టయిలుగా వుంటుంది. జాలీగా వుంటుంది. ఉమెన్స్ లిబ్ గురించి మాట్లాడుతూంటుంది. ఆమె నన్ను ప్రేమించదేమోనని నా భయం. ఆమెనెలా ఆకర్షించాలో నాకు తెలియడంలేదు...."

నేనతణ్ని ఆపి—"ప్రేమించకు గురూ! చిక్కుల్లో పడతావు!" అన్నాను.

"నేను ప్రేమించానని తెలిస్తే నువ్వు నన్నభినందిస్తావనుకున్నాను. అన్ని విషయాల్లోనూ ఆధునికంగా వుండే నువ్వు ప్రేమ విషయంలో యిలాగంటావనుకోలేదు...." నీరసంగా అన్నాడు హరగోపాల్.

"నా మాటలో నిజం తెలుసుకోవాలంటే నా ప్రేమకథ వినాలి నువ్వు...." అన్నాను. నా ప్రేమకథ నా మనసులో భారంగా వుండిపోయింది. ఎవరికైనా చెప్పి ఆ భారాన్ని దించుకోవాలనుంది నాకు.

"నువ్వు ప్రేమించి భంగపడ్డావా?" నమ్మలేనట్లన్నాడు హరగోపాల్.

"ప్రేమించడం వల్లనే భంగపడ్డాను. నా ప్రేమ నన్ను భంగపర్చింది తప్పితే నన్నెవ్వరూ భంగపరచలేదు...."

హరగోపాల్ నా అనుభవాన్ని వినడానికి కుతూహల పడ్డాడు.

2

నేను ఆమెను ప్రేమించాను. ఆమెపేరు లత. యూని వర్సిటీలో అందరికీ ఆమె తెలుసు. చాలామంది ఆమెను యూనివర్సిటీ బ్యూటీ అంటారు. కొందరామెను యూని వర్సల్ బ్యూటీ అంటారు. వాళ్ళలో నేనొకణ్ణి.

లత స్టైయిలుగా వుంటుంది. మాట, నడక అంతా స్టయిలే! అటువంటి అమ్మాయిని నేను ప్రేమించానంటే— నా ప్రేమ విజయం సాధించడానికి నేనామెకు వెయ్యిరెట్లు స్టైయిలుగా వుండాలి. ఇక్కడే నా ప్రేమ దెబ్బతింది.

అంటే నేను స్టయిలుగా వుండననికాదు. నన్ను చాలా మంది కింగాఫ్ స్టయిల్స్—అంటారు. కానీ ఎంతటి గొప్ప మారాజులకైనా కష్టాలు చెప్పిరావంటారు పరిస్థితుల ప్రభావంవల్ల నన్నూ కష్టాలు వెతుక్కుంటూ వచ్చాయి.

అసలేం జరిగిందంటే....

మనసు ఒకోసారి చిత్రంగా పనిచేస్తుంది. ఒక రోజున నాకో సినిమా చూడాలనిపించింది. చెప్పకుంటే సిగ్గు! ఆ సినిమా పేరు "కొరడా యోధుడు". డబ్బింగ్ సినిమా. ఈ

సినిమా చూపినట్లు క్లాసుమేట్సుకు తెలిసిందంటే నీ పరువు పోతుందని తెలుసా అని నా ఆత్మ నల్లటిబట్టలు కట్టుకుని వచ్చి ఎదురుగా నిలబడి చెప్పింది. నేను దాని మాటలకు ఆలోచనలో పడిపోయాను. అప్పుడే తెల్లటిబట్టలు కట్టుకుని యింకో ఆత్మ వచ్చింది. అదీ నాదే! అది నా వంక తీవ్రంగా "వెళ్ళు....కొరడా యోధుడు చూడు. ఎంతమంది చూడడం లేదు? ఎవరూ చూడకపోతే ఆ ప్రొడ్యూసరేమైపోతాడు?" అంది.

ఈ మాటలు నాకు బాగా నచ్చాయి. కొరడా యోధుడు చిత్రనిర్మాతపై అప్పుడు నా కంతులేని జాలి, అభిమానం పుట్టుకొచ్చాయి. అతడి నుద్ధరించడమే నా జీవితధ్యేయం అనుకుని బయల్దేరాను. సాధ్యమైనంతవరకూ ఎవరికళ్ళా పడకుండానే హాలు చేరుకున్నాను. గబగబా టికెట్ కొని— త్వరగా లోపలకు వెళ్ళి కూర్చున్నాను. నా అదృష్టం బాగుండి ఎరిగున్నవాళ్ళెవరూ ఆ సినిమాకు రాలేదు.

నిజం చెప్పొద్దూ—ఆ సినిమా నాకు నచ్చింది!

తిరుగుముఖంపడుతూ బస్ ఎక్కాను.

"ఏం గురూ! పిక్చర్ కెళ్ళినట్టున్నావ్.... దేనికేమిటి?" అంటూ బస్సులో స్నేహితుడు పలకరించాడు.

అనుకోకుండా నిజం వచ్చేసింది "కొరడా యోధుడు!" అన్నాను.

అతడు పెద్దగా నవ్వేసి "ఎలావుంది?" అన్నాడు.

కొంచెం సిగ్గుపడుతూనే "ఏదో అనుకున్నానుగానీ చాలా బాగుంది. అప్పుడప్పుడు వెరైటీ కిలాంటి సినిమాలు కూడా చూస్తూండాలి!" అన్నాను.

స్నేహితుడేమీ అనలేదు కానీ ముందు వరుసలోంచి ఫక్కుమన్న నవ్వు వినిపించింది. ఎవరా అని చూద్దును

గదా....లత! నేను ప్రేమిస్తున్న లత!

అవమానభారంతో కృంగిపోబోయాను. అప్పుడు మనసు నన్ను ఓదార్చింది—"ఆ అమ్మాయి నిన్ను చూసికాదు. మరెందుకో నవ్వింది!" అని.

చంటిపిల్లాడిలా అది నిజమని అప్పటికి సరిపెట్టుకున్న ప్పటికీ అసలు నిజం బస్సులోనే రెండు వారాల తర్వాత నాకు తెలిపింది.

ఒకోసారి నాకు జోక్స్ వేసే ఊపు వస్తుంది. అప్పుడు నాకు ప్రపంచం తెలియదు. ఆ రోజు బస్సులో నా పక్కనే కూర్చున్న రామ్మూర్తి దగ్గిర డబ్బింగు సినిమాలు చూసే వాళ్ళమీద జోక్సు వేస్తున్నాను రామ్మూర్తి పడిపడి నవ్వు తున్నాడు.

లత నా ముందుసీట్లోనే వుంది. చూసుకోకపోవడం నా దురదృష్టం. ఆమె తన స్నేహితురాలితో "వెనకాల ఆ విస్లేస్తున్నాడు చూశావా? అతడు కొరడా యోధుడు సినిమా చూశాడు. చూసినవాడు చూసినట్లూరుకోక బాగుందని కూడా మెచ్చుకున్నాడు" అంది.

నేను వెంటనే రామ్మూర్తి వంక చూశాను. అతడికి మొహమాటం ఎక్కువ. లత మాటలు విననట్లే కనపడ్డాడు. నిజంగా వినలేదేమో నాకు తెలియదు.

లత, స్నేహితురాలు—యిద్దరూ గట్టిగా నవ్వేశారు.

ఆ క్షణంలో నాలో పట్టుదల ప్రవేశించింది. అందరి లోనూ కింగాఫ్ స్టయిల్సుగా పేరుపొందిన నా గొప్ప తనాన్ని లత కూడా గుర్తించేలా చేయాలి.

అయితే దురదృష్టం నన్ను వెంటాడుతూనే వుంది.

ఆవేళ ధారాపాతంగా వుంది వర్షం!

క్లాసులకు గొడుగువేసుకుని వెళ్ళడం నా దృష్టిలో అవ

మానం. అలా గొడుగు వాడేవాళ్ళు స్టయిలు తెలియని అమాయకులని నేననుకుంటాను అలాంటి కొందరమాయకుల్ని ఏయ్ గొడుగూ అని నేను పిల్చిన సందర్భాలూ కొన్ని వున్నాయి ఓసారి నేనలా పిలుస్తూండగా చూపి లత ముసి ముసిగా నవ్వింది. అప్పుడు నేనెంతో పొంగిపోయాను.

నాకోసం అత్తయ్య తెచ్చిన ఆటోమాటిక్ ఫారిన్ గొడుగు నా దగ్గరుంది. ఈ రోజు వానలో అది వాడాలని నే ననుకున్నాను. ఆటోమేటిక్ గొడుగును నా స్నేహితుల వద్ద ప్రదర్శించాలన్న తపనలో గొడుగుల గురించిన నా అభిప్రాయాలు తాత్కాలికంగా మరిచాను.

వర్షం పడుతోంది. గొడుగు లేకపోతే తల తడుస్తుంది. జలుబు చేస్తుంది. జ్వరం వస్తుంది. పెద్దవాళ్ళు దగ్గరలేరు. అంచేత జ్వరం ఎక్కువై పోతుంది తర్వాత....

తర్వాత ఏమవుతుందో ఆలోచించకూడదనుకుంటే గొడుగు వేసుకోవాలి.

నల్లబట్టల ఆత్మ నన్ను వారించింది. తెల్లబట్టల ఆత్మ మాత్రం "వానలో ఆటోమేటిక్ గొడుగు వేసుకోవడం— పెద్దస్టయిల్ ....వెళ్ళు ....ఇప్పుడు కాకపోతే ఆ గొడు గెప్పుడు వాడతావు?" అంది.

గొడుగు గురించి ఇన్ని ఆలోచనలు రావడానిక్కారణం నేను లతను ప్రేమించడం! ఆమెను ప్రేమించివుండక పోతే నాకే బాధా లేదు.

ఇంత ఆలోచించి గొడుగు తీసుకుని బయల్దేరితే— సరిగ్గా యూనివర్సిటీ గేటుదగ్గర కొచ్చేసరికి—దిక్కుమాలిన వర్షం ఠకీమని ఆగిపోయింది. వాన వెలిశాక గొడుగు చేతిలో వుంటే—వాడిపరువు పోయినట్లేలెక్క. అదీ నా సిద్ధాంతం. నా సిద్ధాంతం ప్రస్తుతం నా పరువే

తీసింది.

"ఏయ్ గొడుగూ!" అన్నారెవరో. వెనక్కి తిరిగాను. లత!

ఆమె నన్ను చూడనట్లు తన స్నేహితురాలితో మాట్లాడుతోంది.

మళ్ళీ లత దృష్టిలో లోకువై పోయాను. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చేతిలోని గొడుగును నేలకేసి కొట్టాలనిపించినా—అపురూపమైన ఆటోమేటిక్ ఫారిన్ గొడుగు కాబట్టి అలా చేయలేకపోయాను.

ఆ తర్వాత నేనెప్పుడూ ఎవర్నీ "ఏయ్ గొడుగూ!" అని పిలవలేదు.

మళ్ళీ లత గురించి ఆలోచించసాగాను. ఆమెకు నాపై వున్న అపోహలు పోగొట్టాలి. అసలామెకు నాపై వున్న అపోహలేమిటి? డబ్బింగ్ సినిమాలు చూస్తాననీ—వానలో గొడుగేసుకుంటాననీ! ఒకసారి ఆమె సమక్షంలో ఓ యింగ్లీషు సినిమా చూసి—ఓసారి ఆమె ఎదురుగా ఓ మాదిరి వానలో తడుస్తూ వెడితే (గొడుగులేకుండా) సరిపోతుంది.

అలాంటి అవకాశం రానేవచ్చింది నాకు.

ఆ రోజు ఆదివారం. టౌన్లో వున్న స్నేహితుణ్ణి పలకరిద్దామని బస్ ఎక్కాను. సరిగ్గా లేడీస్ హాస్టలు దగ్గిర స్నేహితురాండ్రతో లత బస్సెక్కింది. "ది లాంగెస్ట్‌డే" చూడ్డానికి బయల్దేరినట్లు వాళ్ళ మాటలనుబట్టి గ్రహించాను.

"స్నేహితుణ్ణి తర్వాత చూడవచ్చు. ముందీ సినిమాకే వెళ్ళి లతదగ్గర షైనవాలి" అంది తెల్లబట్టల ఆత్మ అంతఇరుకున్లోనూ ఎదురుగా వచ్చి నిలబడి! నల్లబట్టల ఆత్మ కోసం చూశాను. అది కనబడలేదు. దాని మాట వినడం

లేదని కోపమేమో మరి!

నా ఆలోచన వెంటనే అమల్లో పెట్టేశాను. లతకంటె ముందుగా బస్సుదిగి త్వరగా టాకీసుదగ్గరకు వెళ్ళిపోయాను. ఇంకా టికెట్లివ్వడం ప్రారంభించలేదు. అప్పటికే క్యూ రెడీగా వుండి తయారైె. హైక్లాస్ క్యూలోనే నిలబడ్డాను.

ఆడవాళ్ళను గజగమనలనీ, హంసగమనలనీ పురాణాల్లో వర్ణిస్తూంటారు. అది నిజమే! అందులో లత నడక యీని వర్పిటికే ప్రత్యేకాకర్షణ! అందువల్ల నేను క్యూలో నిలబడ్డ పదిహేను నిముషాలకు లత థియేటర్‌కు చేరుకుంది. అప్రయత్నంగా ఆమెవంక చూశాను. చెలికత్తెలమధ్య రాకుమారిలా మెరిసిపోతోందామె.

టికెట్లివ్వడం ప్రారంభించారు. రావడం ఆలస్యమైనా టికెట్లు లతకే ముందుగా దొరికాయి. అసలే ఇంగ్లీషు సినిమా—అందులోనూ బాగా పాతది. దానికి ఆడవాళ్ళ క్యూ బాగా తక్కువ. మగాళ్ళుకూడా అట్టే లేరు. అందుకేనేమో ఆ రోజున నంబరింగు లేదు.

లత టికెట్లు తీసుకున్నాక బయటనే వుండిపోయింది. నేనుమాత్రం టికెట్ తీసుకోగానే హాల్లో దూరాను. అసలే నంబరింగు లేదు. ముందుగా ఫ్యానుకింద సీటుసంపాదిస్తే లత కూడా ఆ ప్రాంతాలే వచ్చి కూర్చునే అవకాశముంటుందని నా ఆశ. నాకు అటూ యిటూ రెండుసీట్లు కాళీగా వుండేలా చూసుకుని మరీ కూర్చున్నాను—అప్పుడే దేవుణ్ణో కోరిక కోరుకున్నాను. లత వచ్చేసరికి మొత్తం హాలంతా నిండిపోయి నా పక్కసీట్లు తప్ప కాళీ వుండకూడదని. ఎందుకైనా మంచిదని నా పక్కసీటుమీద జేబురుమాలు కూడా వేశాను.

తానొకటి తలిస్తే దైవమింకొకటి తలుస్తాడన్న సామెత

నాకోసమే పుట్టినట్లుంది. లేకపోతే ఆ పాత యింగ్లీషు పిక్చరుకి తలచెడిన పూర్వ సువాసినులు రావడమేమిటి?

నేనుంటున్న గది ఓనర్ రామాయమ్మగారు—తన సహ పూర్వ సువాసిని—శంకరమ్మగారితో కలిపి అదే పిక్చరుకి నేనున్న క్లాసులోకే వచ్చింది. వస్తూనే రామాయమ్మగారి కళ్ళు సూటిగా నా మీదనే పడ్డాయి—"ఇదిగో—ఇక్కడ అబ్బాయున్నాడు. ఇతడిపక్కన కూర్చుంటే మనకు బాగా అర్థం చెబుతాడు" అనేసి నా పక్కకు వచ్చేసిందావిడ. ఆవిణ్ణి వారిద్దామనుకుని ఆ ప్రయత్నాన్ని విరమించు కున్నాను.

రామాయమ్మగారిని వారించగల శక్తి ఈ పృథివిలోనే లేదు.

"పైన పంకాకూడా తిరుగుతోంది. ఇంకేం—నువ్వా పక్కన కూర్చోవమ్మా శంకరమ్మా—అబ్బాయి చాలా తెలివైనవాడులే....విడమర్చి చెబుతాడు...." అంది రామాయమ్మగారు. తెల్లపంచి, నున్నగుండు గల ఆ బామ్మలిద్దరు నాకు చెరోపక్కనా కూర్చుని ఊరుకోకుండా నాతో బాతాఖానీ కూడా మొదలెట్టారు. లత నన్నూ వాళ్ళనూ కలిపి చూస్తుందేమోనని బెంగపెట్టుకుని ఆమె నాకు దూరంగా కూర్చోవాలని దేవుణ్ణి కోరుకున్నాను. నేనిలా కోరుకోగానే అలా లత తన చెలికత్తెలతో వచ్చేసి సరిగ్గా నాకు ముందు వరుసలోనే కూర్చుంది.

స్లైయిడ్స్ వేస్తూన్నంతసేపూ రామాయమ్మగారు నన్నే మేమో అడుగుతూనే వుంది—"అబ్బాయ్....ఇంగ్లీషు సినిమాలు బాగుంటాయట కదూ!"

"అర్థమైతేకానీ బాగుండవండి" అన్నాను.

"అవునవును. ఈసారి మంచి ఇంగ్లీషు సినిమాలు వచ్చి

నప్పుడు—నాతో చెప్పు బాబూ—నీవంటివాడు పక్కనుంటే సినిమా బాగా అర్థమవుతుంది" అందావిడ.

"బాగానే వుంది ఈ వేళ్టికే అవమానపడి చస్తూంటే మళ్ళీ యింకోసారా?" అనుకున్నాను.

దిగులుగా సినిమా చూస్తూండగా ఇంటర్వెల్ వచ్చింది. హాల్లో లైట్లు వెలిగాయి. నేను లేచి బైటకు పోదామా అనుకుంటూండగా రామాయమ్మగారు—"ఏమిటోయ్—సినిమా యిలాగుంది? ఎంతసేపూ దెబ్బలాడుకోవడం, కొట్టుకోవడం, తుపాకులు పేల్చుకోవడం తప్ప దీనికింక కథేం లేదా?" అని నన్ను దెబ్బలాడింది.

"యుద్ధం ఎలా ప్రారంభమవుతుందో వివరంగా చూపించారు. ఇంగ్లీషు సినిమాలన్నీ యిలాగే వుంటాయి—" అన్నాను.

"అల్లాగనేయకు నేను ఇదివరకు రెండింగ్లీషు సినిమాలు చూశాను. అవి చాలా బాగున్నాయి. బోల్డు కథ కూడా వుంది" అంటూ అందుకుంది శంకరమ్మగారు.

నా కక్కణ్ణించి లేచే అవకాశం కలగలేదు. ఈలోగా లత వెనక్కు తిరిగి చూద్దమేకాక—నవ్వుతూ—"అతడి బామ్మగారేమో!" అంది స్నేహితురాలితో.

ఆ క్షణంలో నాకు రామాయమ్మగారిమీద ఎంత కోపం వచ్చిందంటే ఆరోజే ఇల్లు ఖాళీచేయాలనుకున్నాను. సినిమా అయేక గదికివెళ్ళి పెట్టిసద్దడం మర్చిపోయాను. అప్పుడు మళ్ళీ తెల్లబట్టల అంతరాత్మ నాముందు ప్రత్యక్షమై—"నల్ల బట్టల అంతరాత్మ నీలోనే వుండి నిన్ను రెచ్చగొడుతూ తప్పుదారిని నడిపించాలని చూస్తోంది. రామాయమ్మగారు నీపక్కన కూర్చుందంటే నిన్నవమానించాలని కాదు. అభిమానం. అదే అభిమానంతో ఆవిడ ఎన్నోసార్లు నీకు

కూరలు, ఊరగాయలు — ఇవ్వలేదూ? అప్పుడు నచ్చిన అభిమానం ఇప్పుడు నచ్చకుండా పోయిందా?" అంటూ దెబ్బలాడింది.

ఇల్లు ఖాళీచేసే ఉద్దేశ్యం మానుకున్నాను. కానీ లత వెనక్కు చూపినపుడు నేను — నా కిరువైపులా రామాయమ్మ, శంకరమ్మగార్లు — మమ్మల్ని చూపి ఆమె కనుల్లో పరిహాస పూర్వకమైన తిరస్కారభావం.... అన్నీ గుర్తుకువచ్చి నాకు తలనొప్పి వచ్చింది. అలాగే నిద్రకుపడ్డాను

* * *

అది చాలా అందమైన పార్కు. సాయం సమయం. బెంచీకొక జంటచొప్పున కూర్చున్నారు ప్రేమికులు. అందరికీ దూరంగా ఓ బెంచీమీద ఒంటరిగా కూర్చున్నాను నేను.

నాపక్కనకూడా ఎవరైనా వుంటే బాగుండుననిపించింది. ఆ భావనకే తనువు పులకరించగా — ఓసారి ప్రకృతిని పరిశీలిద్దామని చుట్టూ చూశాను.

ప్రకృతి సౌందర్యాన్నంతా తనలోనే ఇముడ్చుకుని వస్తున్న లతనప్పుడు చూశాను. వెంటనే ఆమెనే ప్రకృతిగా భావించి చూడడం ప్రారంభించాను.

లత పార్కునంతా కలయజూపింది. నేనున్న బెంచీ తప్ప అన్ని బెంచీలపైనా జంటలున్నాయి. ఏమనుకుందో- నావైపే నడిచిరాసాగింది.

"ఏడుకొండలవాడా — ధన్యుణ్ణి!" అనుకున్నాను. కష్టాల్లోనేతప్ప దేవుడు గుర్తురాడంటే అది శుద్ధ అబద్ధం!

లత తిన్నగావచ్చి బెంచీమీద నాపక్కనే కూర్చుంది. ఆనందంతో కాబోలు — నా శరీరం వణికింది. అప్పుడామె నావంక చూపింది. రెండు కళ్ళలోంచీ రెండు బాణాలు — సూటిగా నా హృదయంలో నాటుకున్నాయి.

"మీరు రోజూ యిక్కడకు వస్తారా?" అందామె పలక రింపుగా.

"ఏదో అనుకోకుండా వచ్చాను. మరి మీరు?" అన్నాను తడబడుతూ.

"నేనూ మీలాగే!" అందామె.

ఆమె అలాగన్నందుకు నాకెంతో సంతోషం కలిగింది. ఇది చాలా మంచి సమయం. లతకు నాపైన ఎటువంటి అభిప్రాయమున్నదీ ఇప్పుడే తెలుసుకోవాలనిపించింది. అందుకోసం ఓ ప్రశ్న సెలక్టు చేసుకున్నాను— "నేనెప్పుడొచ్చినా ఈ బెంచీమీదే కూర్చుంటాను. మరి మీరు?"

నిజానికిది నిజంకాదు. కానీ ఇకముందు మాత్రం ఎప్పుడొచ్చినా ఈ బెంచీమీదే కూర్చుంటాను. అది లత నాతో కలిసి కూర్చున్న బెంచి!

ఆమె చుట్టూ చూస్తూ అంది—"ఈవేళ ఎక్కడా ఖాళీ లేక కూర్చోవలసొచ్చింది. కానీ నాకీ బెంచి అంటే సుతరామూ యిష్టంలేదు. నా కిష్టమైన బెంచి అదిగో!" అంటూ ఒకవైపుగా చూపించింది.

లత దృష్టిలో నేను లోకువైపోయాననడానికి ఇంతకంటె ప్రబల నిదర్శనమేంకావాలి? ఎప్పుడొచ్చారో చూడలేదుకానీ ఆ బెంచిమీద రామాయమ్మగారు, శంకరమ్మగారు కూర్చుని వున్నారు.

మాడిపోయిన నా ముఖాన్ని చూసి కాబోలు లత నవ్వేసింది. ఆ తర్వాతనుంచి మళ్ళీ బాగానే మాట్లాడ్డం మొదలుపెట్టింది. నాకు హుషారువచ్చింది. ఆమె యిప్పుడు నా హృదయానికి దగ్గరగా వస్తుందనుకుంటున్న సమయంలో ప్రవేశించాడు విలన్.

"అబ్బాయ్‌గారూ—జంతికలు.... వేడి వేడి జంతికలు"

అన్నాడావిలన్. నేను చిరాగ్గా—"ఛా.వద్దు ఫో!" అన్నాను.

"వద్దంటారేంటండీ—రోజూ మీకు ఇస్తున్నానుగా.... నిన్నటికంటె బాగా వచ్చాయి. రోజూలాగే మీరే బోణీ చెయ్యాలి!" అన్నాడా విలన్ మళ్ళీ.

నేను దీనంగా, భయంగా లతవంక చూశాను. లత చటుక్కున బెంచీమీంచి లేచి నిలబడి "అయితే మీరు జంతికలు తింటారన్నమాట!" అంది. ఆమె చూపుల్లో తిరస్కారభావముంది.

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాక ఇంకేమంటాను. లత కోపంగా వెళ్ళిపోతూంటే అక్కడే పార్కుబెంచీకి తల బద్దలు కొట్టుకోవాలనిపించి తలెత్తాను.

* * *

"అబ్బాయ్‌గారూ!" అని ఎవరో పిలిచేసరికి కళ్ళు తెరిచాను. తీరా చూస్తే అంతవరకూ జరిగింది కల!

క్యారియర్ పెట్టి పనిమనిషి వెళ్ళిపోయింది.

ఏమిటిది? కలలో కూడా లత దగ్గర అవమానమేనా? ఎలా భరించేది?....నాకా జంతికలవాడిమీద చాలా కోపం వచ్చింది. నాకు వాడు తెలుసు. అయితే లత దగ్గర నన్నవమానించడానికిలా పనిగట్టుకుని కల్లోకూడా వస్తాడని తెలియదు.

ఇంకెప్పుడూ వాడిదగ్గర జంతికలు కొనకూడదను కొన్నాను.

ఇన్ని కష్టాలూ నాకే ఎందుకురావాలి? సాటి విద్యార్థుల్లో కింగ్ ఫ్ స్టైయిల్స్‌గా వెలిగిపోతున్న నేను లత దృష్టిలో పడే సమయానికెందుకవమానాలపాలవుతున్నానూ అని కాసేపాలోచించేసరికి బ్రహ్మాండమైన నిజం స్ఫురించింది.

నాది నిజమైన ప్రేమ. నిజమైన ప్రేమకు కష్టాలు

తప్పవు. కష్టాల్లేకపోతే అది నిజమైన ప్రేమేకాదు. ప్రేమకు కష్టాలు—భగవంతుడి పరీక్ష! నాది నిజమైన ప్రేమ కానట్లయితే నాకు కలిగిన కష్టాలకీపాటికి ప్రేమను విర మించుకుని వుండేవాణ్ణి.

ఈ ఊహ కలగ్గానే మళ్ళీ లతవద్ద నా గొప్పతనం ఋజువు చేసుకోవాలనుకున్నాను. అయితే అదింకా సాధ్య పడకముందే నాకు వారంరోజులు తిరక్కుండా మరోకష్టం వచ్చిపడింది.

హోటల్లో కూర్చుని బజ్జీలుతింటున్నాను. మా స్టూడెం ట్సులో ఒక ఆచారముంది. ఎవడైనా కాఫీహోటల్లో ఒక పదార్థం తింటూండగా చూడబడితే నావంటివాడు వాడికా పేరుపెట్టి తీర్తాడు. మొదటిసారి తిన్నవాడిదే ఆ దుర దృష్టం! ఆ విధంగా ఇప్పటికి బజ్జీ, చపాతీ, పకోడి, పేమ్యా మిక్స్చర్, బూందీ నామధేయు న్నారు. బజ్జీ నామధేయుడెలాగూ వున్నాడనే ధైర్యంతోనే నేను బజ్జీ తింటున్నాను.

ఆ సమయంలో దూరాన ఐస్‌క్రీమ్ తింటూ లత కని పించింది. ఆమె నా వంకే చూస్తోంది. నేనామెను చూడ గానే ఆమె ముఖం పక్కకు తిప్పుకుని నవ్వేసింది.

నా హృదయానికి పెద్ద గాయమయింది!

బిల్లిచే సమయానికి ఆమె నా వెనకేవచ్చింది. ఎప్పటి లాగే ఆమెతోపాటు కొందరు స్నేహితురాండ్రున్నారు. వారందరూ "బజ్జీ బజ్జీ" అని గొణుక్కుంటున్నట్లు నా కనిపించింది.

ఆ క్షణంలో నాకు లత అన్నా, ప్రేమ అన్నా. ఈ ప్రపంచమన్నా విరక్తి భావం కలిగింది.

లతను ప్రేమించినప్పట్నించీ నేనెన్నో సుఖాలకు దూర

మయ్యాను.

డబ్బింగు సినిమాలు కూడా అప్పుడప్పుడు మంచి వొస్తూంటాయి. ప్రేమకోసం నేనవి మానేశాను.

ఎండకూ వానకూ అవసరమైన గొడుగు నేను ప్రేమ కోసం వాడ్డం మానేశాను.

నన్నెంతగానో అభిమానించే రామాయమ్మగారి వంటి వారితో ముభావంగా వుంటున్నాను—కేవలం ప్రేమకోసం!

జంతికలు, బజ్జీలు వంటి రుచికరమైన వస్తువులు తినడం మానేశాను. ఇంట్లో అమ్మెప్పుడూ మధ్యాహ్నాలివే చేసేది.

తిరిగి ఈ సుఖాలన్నింటికీ నేను నోచుకోవాలంటే లతను ప్రేమించడం మానేయాలి!

3

"ఇదీ నా ప్రేమకథ. లతను ప్రేమించడం మానేశాక ఆమెను పూర్తిగా పట్టించుకోవడం మానేశాను. నా జీవితం తిరిగి సుఖమయమయింది. ప్రేమ పేరు చెప్పి మనం మన మామూలు అలవాట్లు మానుకోవాలి....కాదంటావా?" అన్నాడు.

హరగోపాల్ ముఖం గంభీరంగా అయింది "గురూ! నీ అభిప్రాయంతో నే నేకీభవించను...." అన్నాడు.

హరగోపాల్ ఇలాగనడం నాకు మొదటిసారి! అందు కని దెబ్బతిని "నా ప్రేమ లతను ఇంప్రెస్ చేయలేదు. నా ప్రేమకథ నిన్నింప్రెస్ చేయలేదు. అంటే నేను చెప్పింది పూర్తిగా వ్యర్థం!" అన్నాను.

"అదికాదుగురూ! నేను చెప్పేది కాస్త విను...." అన్నాడు హరగోపాల్ "నువ్వు నీ జీవితాన్ని ప్టైయిలుకు అంకితం చేశావు. నీ మనసులో ప్టైయిలుకున్న స్థానం

ప్రేమకులేదు. లేకుంటే ఒక్కటంటే ఒకసారి అతను— కలుసుకుని మాట్లాడి నీ ప్రేమగురించి చెప్పావా? అందుకు నీ అహం అడ్డువచ్చింది. ఆమె కాదంటుందని నీ భయం. అవునా?"

"అవుననుకో ... అప్పుడు"

"నిజమైన ప్రేమకు అహం వుండదు. నీది నిజమయిన ప్రేమకాదు."

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్ అండ్ సఫర్ ది కాన్సీక్వెన్సెస్" అన్నాను కాస్త కోపంగా.

"నీలాంటి అనుభవాలు నాకెదురుకావు ఎందుకంటే నేను నీకులా కింగ్ ఫ్ స్టెయిల్సును కానుగా" అన్నాడు హరగోపాల్.

"అంటే?" అన్నాను తెల్లబోయి.

"డబ్బింగు సినిమాలు చూడ్డం తప్పని ఎవరన్నారు? అయినవాళ్ళ అభిమానాన్ని చాదస్తంగా చీదరించుకోమని ఎవరు చెప్పారు? ఎండకూ వానకూ గొడుగు వాడద్దని ఎవరు చెప్పారు? జంతికలు, బజ్జీలు తినద్దని ఎవరన్నారు. ఇవన్నీ నువ్వే అన్నావు। కొందరు మొహమాటస్థుల్నీ, అమాయకుల్నీ లొకువగట్టి ఏడిపించడంకోసం నువ్వు కొన్ని సూత్రాలు తయారుచేశావు. అవి నిన్ను కింగాఫ్ స్టెయిల్సును చేశాయి. కొందరికి వ్యథను కలిగించాయి.

నీ జోలికి రానివాణ్ణి మానసికంగా బాధించాలనుకోవడం ఘోరమైన నేరం! ఆ నేరం నిన్ను కింగాఫ్ స్టెయిలును చేసినా ఆ నేరమే నిన్ను లతముందు చిన్నబుచ్చింది. నేనెప్పుడూ ఇతరుల నేడ్పించి కింగాఫ్ స్టెయిల్సును కావాలనుకోలేదు. ప్రేమ పాఠాలు నీ వద్ద నేర్చుకోవాలనుకోవడ

మొక్కడే నేను చేసినతప్పు. నా ప్రేమకథ విజయానికి నేను నాపాట్లు పడతాను. నువ్వుకూడా ఇప్పటికైనా నీ పద్ధతులు మార్చుకో!" అని వెళ్ళిపోయాడు హరగోపాల్.

హరగోపాల్ మాటలు మళ్ళీ నా అంతరాత్మను విభజించాయి.

నల్లబట్టల అంతరాత్మ ప్రత్యక్షమై— "కింగాఫ్ స్టైయిల్సుగా నీ జీవితం కొనసాగించు...." అంది.

ఆ వెనువెంటనే మరో పక్కగా తెల్లబట్టల అంతరాత్మ ప్రత్యక్షమై "ఒకస్త్రీ హృదయంలో స్థానాన్ని సంపాదించుకునేందుకు నీ అహాన్ని వదిలిపెట్టు" అని సలహా యిచ్చింది.

ఇంతవరకూ నేను తెల్లబట్టల అంతరాత్మ చెప్పేదే వింటున్నాను మరి! □

పాఠకులకు మనవి

మీకు గతనెల కాపీలు మార్కెట్లో దొరకలేదా- రు. 16-00 లు మాకు M.O. చేయండి. పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ మీ చిరునామాకు వెంటనే 'రిజిస్టరు పోస్టు'లో పంపగలము.

మేనేజర్

అపరాధ పరిశోధన

హైదరాబాదు-29.

ప్రమాదం పిలుస్తోంది

కొటపూరి త్రిమూర్తి సత్యనారాయణ

"హలో?" ఫోను అదేపనిగా రింగవుతూంటే—వచ్చి రిసీవర్ ఎత్తాడు పదేళ్ళ వాసు.

"ఎవరూ....?" అవతలి కంఠం ప్రశ్నించింది.

"నేను అంకుల్—వాసుని! ఎక్కణ్నుంచి మాట్లాడుతున్నావు?" ఆ కంఠాన్ని పసిగట్టి అడిగాడు వాసు.

"ఓ! నువ్వా వాసూ? నేను ఆఫీసునుంచి మాట్లాడుతున్నాను."

"ఆంటీని పిలవమంటావా?"

"అందుకే కదోయ్ ఫోన్ చేసింది!"

"నాకు తెలుసులే!....లైన్లో వుండు పిలుచుకొస్తా!...."

రిసీవర్ ప్రక్కన పెట్టి, ప్రక్కింటి వైపు పరిగెత్తాడు వాసు.

"ఆంటీ నీకు ఫోనొచ్చింది!" వచ్చి చెప్పాడు వాసు.

"ఎక్కణ్నుంచి?" బాత్రూం నుంచి వచ్చి ఆతృతగా అడిగింది స్వాతి.

"అంకుల్ దగ్గర్నుంచి" అని చెప్పి వీధిలోకి పరిగెత్తాడు వాసు, ఆటకి!

తడిచేతులు చీరకొంగుకు తుడుచుకుంటూ ప్రక్కింటి కెళ్ళి రిసీవర్ ఎత్తి—

"హలో...." అంది స్వాతి.

"హాయ్!....నేను—నీ లైఫ్ పార్ట్‌నర్‌ని!"

"ఎక్కణ్నుంచి మాట్లాడుతున్నారు?"

"మా ఆఫీసు ప్రక్కనున్న హోటల్ నుంచి. లంచవర్ గదా—హోటల్లో వున్నాను నువ్వేం చేస్తున్నావ్?"

"మీ బట్టలకి సర్ఫ్ పెడుతున్నాను."

"మా మేనేజర్ చీవాట్లు పెట్టాడు."

"ఎందుకు?"

"మనసుని పనిమీద వుంచటంలేదని."

"మరి. ఎక్కడుంచుతున్నారు?"

"ఇంటి దగ్గర! ఆఫీసుకి వస్తున్నానన్న మాటేగాని, నా మనసంతా నీ దగ్గరే వుంటుంది?"

"నన్ను కూడా మీ ఆఫీసుకొచ్చి—మీ ఎదురుగా

కూర్చోపెమంటారేమిటి?”

“ఆ పని చెయ్! మా మేనేజరు ఎలాగూ శలవు యివ్వడు! శలవు అడిగితే, జేబులో సొమ్ములు ఊరికే యిచ్చేస్తున్నట్టు తెగబాధపడిపోతాడు! మన పెళ్ళికి శలవు అడిగితే ఏమన్నాడో తెలుసా? పెళ్ళి అర్ధరాత్రి పన్నెండు గంటల మూడు నిముషాలకి కదా—ఆఫీసయిపోగానే వెళ్ళి పెళ్ళాం మెడలో మూడుముళ్ళూ వేసేసి, మర్నాడు మామూలుగా ఆఫీసుకి వచ్చెయ్యమన్నాడు....!”

కిసుక్కున నవ్వింది స్వాతి.

“అబ్బ! ఎంత బాగా నవ్వుతావు స్వాతి! నువ్వలా నవ్వుతూంటే నాకేమనిపిస్తుందో తెలుసా?”

“ఏమనిపిస్తుంది?”

“నువ్వు నవ్వుతూంటే—ఎన్ని యుగాలైనా చూస్తూ వుండిపోవాలనిపిస్తోంది!”

“చాల్లెండి!”

“ఇంకా ఏమనిపిస్తోందో తెలుసా?”

“చెప్పండి!”

“ఆఫీసు ఎగ్గొట్టేసి—నిన్ను గట్టిగా వాటేసుకొని....”

“ఛీ! పాడు!”

“నిజం స్వాతీ! మన పెళ్ళయి రెండు నెలలు కూడా యింకా పూర్తికాలేదు. మన ముద్దూ మురిపెం తీరనేలేదు. నేనిక్కడ - నువ్వక్కడ! మన ఈ ఎడబాటుకి శలవు యివ్వని మా మేనేజర్‌గాడే కారణం! ఆ రాస్కెల్‌ని ముక్కలు ముక్కలుగా నరికెయ్యాలనిపిస్తూంది.”

“అలా తిట్టకండి—మీ మేనేజర్ విన్నాడంటే.”

“వినడు — ఎందుకంటే నేను మాట్లాడుతున్నది హోటల్ నుంచి....అన్నట్టు—‘వెంకట్రామా’లోకి నీ

ఫేవరేట్ పిక్చర్ వచ్చింది. టికెట్స్ తీసుకున్నాను. సా యంత్రం రెడీ అయి త్వరగా రా! నీకోసం థియేటర్ దగ్గర వెయిట్ చేస్తూంటాను."

"అలాగే!"

"ఏదీ—ఓ కిస్...."

"ఆఁ, ఆఁ, కొత్తబిచ్చగాడు పొద్దెరగడని...."

"ప్లీజ్ ఒక్కటంటే ఒక్కటే...."

"రాత్రికి బోలెడన్ని యిస్తాను" ముసిముసిగా నవ్వుకుంటూ ఠక్కున ఫోను పెట్టేసింది స్వాతి.

"ఏమంటున్నాడమ్మా మీ ఆయన?" అడిగాడు ఆ ఇంటి యజమాని రాజారావుగారు.

ఏమీ సమాధానం చెప్పకుండా సిగ్గుతో మొగ్గలా ముడుచుకొని వెళ్ళిపోయింది స్వాతి.

ఆమెను చూచి ముసిముసిగా నవ్వుకున్నారు రాజారావు గారు.

2

"నా భార్య కనిపించడంలేదు" ఒన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్‌కి ఫిర్యాదు చేశాడు మధుసూదన్.

"ఎప్పట్నుంచి?"

"నాలుగు రోజుల్నుంచి."

"మీరు ఏమైనా గొడవపడ్డారా?"

"లేదు!"

"పుట్టింటికెళ్ళిందేమో?"

"లేదు—మా బంధువులందరికీ తెలియజేశాను. ఆచూకీ తెలియలేదు."

"జరిగిందంతా చెప్పండి!"

"నాలుగురోజుల క్రితం—అంటే ఇరవై నాలుగవ

తారీఖున నేను ఆఫీసు నుంచి ఫోన్‌చేసి ఫస్ట్‌షో సినిమాకి రమ్మన్నానట....నిజానికి నే నా రోజు ఫోన్ చేయలేదు— సినిమాకి రమ్మనలేదు."

"వీళ్ళకి ఫోన్‌లేదు—మా ఇంట్లో వుంది. మా ఇంటికి ఫోన్ చేశాడు." అని రాజారావుగారు చెప్పి వాసువంక చూపి "ఫోను వీడే ఎత్తాడు" అన్నారు.

"అవునండి! మధుసూధన్ అంకుల్ ఫోన్ చేశాడు. ఎవరు కావాలని అడిగితే స్వాతి ఆంటీని పిలవమన్నాడు. వాళ్ళింటికెళ్ళి ఆంటీతో చెప్పాను. అంతే!"

"ఇన్‌స్పెక్టర్! ఆ రోజు నే నసలు ఫోన్ చేయ లేదు....వాసు పొరబడి వుంటాడు." అన్నాడు మధు సూదన్.

"ఏం బాబూ! ఆయన గొంతు నువ్వు స్పష్టంగా విన్నావా?" వాసుని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఏమోనండి? అంకుల్ గొంతులా వినిపిస్తే—ఆంటీ కోసమే ఫోన్ చేసివుంటాడని వెళ్ళి చెప్పాను. అంతే!.... అంతకుమించి నాకేం తెలియదు" ఇన్‌స్పెక్టర్ సౌమ్యం గానే అడిగినా డైరెక్టుగా అడగటంతో—పోలీస్ ఇన స్పెక్టర్‌ని అంత దగ్గరగా చూడటం అదే ప్రథమం కావ టంతో - భయపడిపోయాడు వాసు.

"సరే—మీ భార్యఫోటో యిచ్చివెళ్ళండి!"

మధుసూదన్ జేబులోంచి ఫోటో తీసి యిచ్చాడు ఇన్ స్పెక్టర్‌కి.

3

"సార్! 'జట్లపాలెం' వెళ్ళేదారిలో పిల్లకాలువ ప్రక్కన తూడు తుప్పల్లో స్త్రీ శవం వుందట" గబగబా

వచ్చి చెప్పాడు టూ నాట్ సిక్స్.

"ఎవరు చెప్పారు?"

"నేనే సార్!" ఇనస్పెక్టర్ గదిలోకి అడుగుపెట్టాడు ఓ వ్యక్తి.

"ప్రతిరోజూ నిత్యావసర వస్తువులు కొనుక్కోవటానికి మా ఊరు—'జట్లపాలెం' నుంచి ఈ 'తాడేపల్లిగూడెం' వరకూ రావటం మా గ్రామస్థులకు బాగా అలవాటు. ఇంట్లోకి సరకులు తీసుకురావటానికి వస్తూంటే తూడు తుప్పల్లోంచి ఓ స్త్రీ శవం కనిపించింది. ఏ అభాగ్యురాలిదో పాపం! ఈ విషయం మీకు తెలియజేయటం బాధ్యతగల పౌరుడిగా నా ధర్మం అనిపించింది" చెప్పాడా వ్యక్తి.

"టూ నాట్ సిక్స్! జీప్ రెడీగా వుందా?"

"ఉంది సార్!"

జీప్ ఎక్కారు—ఆ వ్యక్తితో ఇనస్పెక్టర్, నలుగురు కానిస్టేబుల్స్.

జీప్ ఎర్రని మట్టిరోడ్డుపై పరుగుతీస్తూంది దుమ్మురేపుకుంటూ.

ఓ వైపు పచ్చని వరిపొలాలు.

మరొక వైపు పిల్లకాలువ. కాలువకి ఇవతలివైపు—తూడు తుప్పలు దట్టంగా పెరిగివున్నాయి.

జీప్ కొద్దిదూరం వెళ్ళాక ఆపమన్నాడా వ్యక్తి. అక్కడ ఆ దారిన వచ్చేపోయే వాళ్ళు కొంతమంది చేరివున్నారు.

అందరూ జీప్ దిగారు.

జీప్ దిగినవాళ్ళు ఒక్కసారిగా నాసికా రంధ్రాలు మూసుకున్నారు-కుళ్ళిన శవం దుర్గంధాన్ని భరించలేక.

శవం కాలువలోంచి కొట్టుకొని వచ్చి, అక్కడ బాగా

వత్తుగా పెరిగివున్న తూడుతుప్పలకి చిక్కుపడి వుంది.... శవం బాగా వుబ్బి, కనుగ్రుడ్లు బయటకు వచ్చి వికృతంగా భయంకరంగా వుంది. ఎన్ని రోజుల నుంచి అలా వుందో ఆ ప్రదేశమంతా దుర్గంధం వ్యాపిస్తోంది.

పోస్టుమార్టంలో ఆమె మానభంగానికి గురైందని.... అది భరించలేక కాలువలో పడి ఆత్మహత్య చేసుకుందని తేలింది!

ఆమె మధుసూదన్ భార్య!

స్వాతి!!

4

అదొక హాస్పిటల్.

అప్పుడే ఆటోలోంచి కోమలి హడావిడిగా దిగింది.

హాస్పటల్ లోపలకి కంగారుగా వెళ్ళబోతూంటే—కాంపౌండులో ప్రభు కనిపించాడు.

అతను రాజేంద్ర ఫ్రెండ్!

గబగబా అతని దగ్గరికి వెళ్ళింది—

"హలో, ప్రభూ! రాజేంద్ర కెలావుంది?" వస్తూన్న ఉద్వేగాన్ని ఆపుకుంటూ అడిగింది కోమలి.

"వచ్చావా? రా-నీ కోసమే ఎదురు చూస్తున్నాను.... నీకు ముందుగా రాజేంద్రని ఈ హాస్పటల్‌లో ఎడ్మిట్ చేసినట్టు రాజేంద్ర నాన్నగారు ఫోన్ చేశారు. కానీ, సమయానికి యిక్కడ డాక్టర్‌గారు లేదు. అన్నపూర్ణా హాస్పటల్లో ఎడ్మిట్ చేశాం. ఆ విషయం చెబుదామని ఆయన మళ్ళీ ఫోన్ చేస్తే నువ్వు లైన్‌లో లేవు. అప్పటికే బయలేర్ది పోయివుంటావని నన్ను నువ్వు యిక్కడికి వస్తే నిన్ను వెంటబెట్టుకొని తీసుకురమ్మని చెప్పారు. వాళ్ళందరూ

హాస్పిటల్‌లో వున్నారు. రా. అక్కడికి వెళ్దాం! రాజేంద్ర నీ కోసమే కలవరిస్తున్నాడు" యిద్దరూ హాస్పిటల్ దాటి రోడ్డుమీదకి వచ్చారు.

రోడ్డుమీద ఖాళీగా వున్న ఆటోను పిలిచి యెక్కారు యిద్దరూ.

ఆటో దూసుకుపోతోంది.

కోమలికి దుఃఖం ఆగటంలేదు. వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఛా! ఏమిటి చిన్నపిల్లలా?...." అనునయిస్తున్నాడు ప్రభు.

"మా ప్రేమ చూచి దేవుడికి కన్నుకుట్టింది" అంది కోమలి.

"............"

"పెళ్ళి చేసుకొని నూరేళ్ళ జీవితాన్ని హాయిగా, ఆనందంగా గడపాలని ఎన్నో కలలుగన్నాం....మా కలలు యిలా బూడిదవుతాయనుకోలేదు...." భోరుమని ఏడుస్తోంది కోమలి.

"ఊరుకో, కోమలీ!....రాజేంద్రకి తప్పకుండా నయం అవుతుంది. మీ రిద్దరూ పెళ్ళి చేసుకొని హాయిగా వుంటారు. రాజేంద్ర ఆఫీసు నుంచి వస్తూంటే లారీ డేష్ యిచ్చింది. తలకు దెబ్బ తగిలింది. తప్పకుండా నయమైపోతుంది" అన్నాడు ప్రభు.

కోమలి యింకా వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆటో చాలాదూరం ప్రయాణం చేశాక ఆగింది.

తలెత్తి చూసింది కోమలి.

అదో పెద్ద సరుగుడు తోట.

సాయంత్రం వేళ చీకటి రాత్రిగా రూపాంతరం చెందు తోంది.

కీచురాళ్ళు సన్నగా అరుస్తున్నాయ్!....

"రా—దిగు!...." అప్పటికే ఆటో దిగి, అన్నాడు ప్రభు.

"ఇక్కడికి తీసుకొచ్చావేమిటి?...." చుట్టూ అయోమయంగా చూస్తూ అంది ఆటోలోంచి దిగకుండానే కోమలి.

"ఏం? ఇంతకంటే ఏకాంతప్రదేశం కావాలా నీకు!" అదోలా నవ్వాడు ప్రభు.

"నన్ను రాజేంద్ర దగ్గరికి తీసుకెళ్ళు...."

"రాజేంద్ర యిప్పుడు ఇంటిదగ్గరే వుంటాడు....కాసేపు స్వర్గంచూపి యిద్దరం వెళ్ళిపోదాం....రా—దిగు!...." అని కోమలి చెయ్యిపట్టుకొని విసురుగా లాగాడు ప్రభు.

డ్రైవర్‌కి వందనోటిచ్చాడు—ఆటో వెళ్ళిపోయింది.

"రాజేంద్రకి ఏక్సిడెంటయిందని వాళ్ళ నాన్నగారు ఫోన్ చేశారు...."

"అదా—వాళ్ళ నాన్నగారి మాటను ఇమిటేట్ చేసి—నేనే నీకు ఫోనుచేశాను...నీ అందాన్ని నా స్వంతం చేసుకుందామని!... రాజేంద్రకి ఏక్సిడెంటూ లేదు, హాస్పిటలూ లేదు....

మధుసూదన్, గోపాలరావు, సోంబాబు, తాతారావుల గొంతుకలను ఇమిటేట్ చేసి-వాళ్ళ భార్యలను కూడా తనివి తీరా అనుభవించాను! .... ఇప్పుడు నిన్ను!....కాలేజీలో చదువుకున్నప్పుడు నేర్చుకున్న మిమిక్రీ భలే ఉపయోగపడు తోంది యిప్పుడు!...." అంటూ ఆమెను బలవంతంగా దగ్గరకు లాక్కోబోయాడు ప్రభు.

మెరుపులా ఓ చెయ్యివచ్చి అతని ముఖంమీద బలంగా తాకింది.

ఆ దెబ్బతో ప్రభు క్రిందపడ్డాడు.

కళ్ళు బైర్లుకమ్మాయి.

తెలివి తెచ్చుకొని కళ్ళుతెరిచి చూశాడు....ఎదురుగా పోలీస్ ఇన్స్పెక్టర్. కానిస్టేబుల్స్ చుట్టుముట్టారు. ఇద్దరు పోలీసులు ఆటోడ్రైవరును యీడ్చుకొచ్చారు.

అయోమయంగా చూస్తున్నాడు ప్రభు.

"కానిస్టేబుల్! అరెస్టుచెయ్!...." ఆర్డరు జారీచేశాడు ఇన్స్పెక్టర్.

ప్రభు చేతులకి సంకెళ్ళు వేశాడు కానిస్టేబుల్.

"ఇదంతా మాకెలా తెలిపిందాని ఆశ్చర్యపోతున్నావా? వయసులో వున్న అందమైన ఆడవాళ్ళకి—వాళ్ళ భర్తో, అన్నయ్యో. తండ్రో, మాట్లాడుతున్నట్లుగా—గొంతుకలను ఇమిటేట్ చేపి—మాట్లాడి నీ కామదాహం తీర్చుకొంటు న్నావ్?....నీ మూలంగా నలుగురు స్త్రీల జీవితాలు నాశన మయ్యాయి!

'ప్రియుడికి ఏక్సిడెంటయిందని—హాస్పిటల్లో ఎడ్మిట్ చేశా'మని ఫోను వస్తే—ఆమెకి అనుమానం వచ్చి మా సహాయం కోరింది! ఆఫీసుకి శెలవుపెట్టి, నువ్వు ఫోను చేసిన సమయానికి రాజేంద్ర ఆమెప్రక్కనే వున్నాడు.... అదిగో రాజేంద్ర....నిన్ను పట్టించాలని ఆమెచేత ఈ నాటకం ఆడించాను....ఎన్నాళ్ళనుంచో నీ కోసం గాలి స్తున్న మా శ్రమ యిన్నాళ్ళకి ఫలించింది...." అన్నాడు ఇన్స్పెక్టర్.

ప్రభుతో సహా అందరూ జీప్ఎక్కారు.

పోలీస్ జీప్ పరుగు లంఘించుకుంది.

ఎమ్.డి.చైతన్య

కిడ్నాపర్ ప్రతీకారం



సాయంత్రం అయిదున్నర.

వాసు ఫైళ్ళమీద గబగబా సంతకాలు పెట్టేస్తున్నాడు.

మరో పది ఫైళ్ళమీద సంతకాలు పెడితే—పని అయిపోతుంది.

అదొక సబ్ ట్రెజరీ ఆఫీసు.

వాసు అందులో ట్రెజరీ ఆఫీసర్.

ఆరోజు రాజు అనే ఒక మిత్రుడ్ని తన యింట్లో డిన్నర్‌కు ఆహ్వానించాడు. రాజు బ్యాంకులో ఆఫీసరు. క్రొత్తగా ఆ వూరొచ్చాడు.

తను ఆంధ్రాబ్యాంకుకు వెళ్ళి అక్కడ్నించి రాజును పికప్ చేసుకొని యింటికెళ్ళాలి. ఇంట్లో ఆరుగంటలకు టిఫిన్, రాత్రికి డిన్నర్ అదీ ప్రోగ్రాం.

ఫైళ్ళమీద సంతకాలు చెయ్యడం పూర్తి అయింది. కన్‌సర్న్డ్ క్లర్కు ఫైళ్ళు తీసుకొని వెళ్ళిపోయాడు.

పెన్‌స్టాండులో పెన్నును పెట్టేసి—సిగరెట్ వెలిగించి డ్రాయర్‌కు తాళంవేసి బయటికొచ్చాడు.

గ్యారేజీలో స్కూటరు వుంది.

వెళ్ళి స్టార్టుచేశాడు.

ఆంధ్రాబ్యాంకు వైపు పోనిచ్చాడు.

రాజు బయట నిల్చొని వాసుకొరకే చూస్తున్నాడు.

"హాయ్!" అంటూ విష్‌చేశాడు రాజు.

"హాయ్" అంటూ స్కూటర్ అతని సమీపంలో ఆపాడు వాసు.

"లేటయిపోయిందేమిటీ!" అడిగాడు రాజు.

"లీవ్ ట్రావెల్ కన్‌సెషన్ బిల్లులమీద సంతకాలు చేసే సరికి యింత లేటయిపోయింది!" అన్నాడు.

"అవి అంత ఇంపార్టెంటా?"

"ఏమీ కాదు, ఆ బిల్లులు పాస్‌చేస్తే—బిల్లులో టెన్ పర్సెంట్ మాకు యిస్తారు. అందుకే అయిదున్నర తర్వాత కూడా కూర్చొని సంతకాలుచేసి వస్తున్నాను!"

రాజు ఆశ్చర్యపోతూ—

"టెన్‌పర్సెంట్ మీకెందు కివ్వడం!" అన్నాడు.

వాసు నవ్వాడు.

"ప్రభుత్వం యిచ్చిన యల్.టి.సి. సౌకర్యంతో ఆంధ్ర దేశంలో తనకు నచ్చిన ప్రదేశాన్ని భార్యా పిల్లలతో చూసి వస్తే—అందుకు అయ్యే చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుంది. తాము ప్రయాణంచేసిన బస్సుటికెట్లు, రైలు ప్రయాణమైతే రైలుటిక్కెట్లు తమ యల్.టి.సి బిల్లుకు జతపర్చాలి. అయితే—చాలామంది సెలవుపెట్టి యింట్లోనే కూర్చొని- రైలుటిక్కెట్లు, బస్‌టిక్కెట్లు సంపాదించి దొంగ క్లెయిములు చేస్తుంటారు. దానికి మేము ఏదో ఒక అబ్జెక్షన్‌తో బిల్లును త్రిప్పిపంపకుండా—వాళ్ళు టెన్‌పర్సెంట్ ఇస్తారు. అదీ సంగతి!"

"మొత్తానికి వాస్తవాన్ని నిజాయితీగా చెప్పేశావు!"

"ఇది ఉద్యోగులు అందరికి తెలిసిన విషయమే! ఓపెన్ సీక్రెట్?"

"ఎవరైనా కంప్లయింట్ చేస్తే—మీకేమీ కాదా!"

"అబ్బే మాకేమి కాదు. దొంగ క్లెయిములు చేసిన ఉద్యోగిని ఏమైనా చెయ్యొచ్చు. సస్పెండ్, డిస్మిస్, ఇంక్రిమెంటు కవరం లాంటివి!"

"పాపం. ఆ ఉద్యోగి యింత రిస్కు తీసుకొని మీకు టెన్‌పర్సెంట్ యివ్వడమెందుకూ?"

"నిజమే! అది ఉద్యోగి ఆలోచించాల్సిన విషయం, నేనుకాదు? నువ్వు వెనక కూర్చోవేమిటి? యక్షప్రశ్నలు వేస్తూ అలాగే నిలబడ్డావు!"

రాజు నవ్వుతూ కూర్చున్నాడు.

స్కూటర్ ముందుకు ఉరికింది.

"డిన్నర్ తర్వాత రెండో ఆట సినిమా కెళ్దామా?" అడిగాడు వాసు.

"అబ్బే! అంత ఓపిక లేదు. నిద్ర ఆపుకోలేను."

"పోనీ, మందుకొడదామా!"

"కొట్టచ్చు, కానీ—డబ్బులు వేస్టు. ఏమీ వొద్దు!"

"డబ్బుల గురించి ఆలోచించకు, రోజూ బోల్డు సంపాదిస్తాను. చెప్పాగా అంతా పర్సంటేజీ వ్యవహారమే!" అన్నాడు నవ్వుతూ.

"సరే, నీ యిష్టం!"

స్కూటర్ ఓ వైను షాపుముందు ఆగింది.

వాసు వెళ్ళి ఓ ఫుల్‌బాటిల్ విస్కీ ప్యాక్ చేయించుకొచ్చాడు.

"ఇద్దరికి ఫుల్‌బాటిల్ ఎందుకు కొన్నావోయ్!" విసుక్కున్నాడు రాజు.

"మిగిలితే అదే వుంటుంది. సరిపోకపోతే కష్టం. షాపులు కట్టేస్తారు!"

"బాగానే ఉందోయ్, నీ దూరదృష్టి" అంటూ వెనక కూర్చున్నాడు.

స్కూటర్ కదిలింది.

"అన్నట్టు జీడిపప్పు ఉందా ఇంట్లో!" అడిగాడు రాజు.

"ఉందో. లేదో! బాగా గుర్తు చేసావు. కొనుక్కొని వెళ్దాం" అంటూ వేయించిన జీడిపప్పు అమ్మే ఓ షాపు ముందు ఆపి ఓ పావుకిలో కొన్నాడు.

వాళ్ళు ఇంటికొచ్చే సరికి—

సాయంత్రం ఆరున్నర అయింది.

రేడియోలో గ్రామసీమాలు కార్యక్రమం అప్పుడే మొదలయ్యింది.

ఇంట్లో రేడియో మ్రోగుతోంది.

"నళినీ....నళినీ...." అంటూ గట్టిగా పిలిచాడు వాసు.

లోపల్నుంచి ఎటువంటి రెస్పాన్సులేదు.

మళ్ళీ పిలిచాడు.

ఊహూఁ లాభంలేదు.

తలుపులు తోసి చూసాడు.

లోపల్నుంచి బోల్టువేసి లేదేమో—ధడాలున తెరచు కున్నాయి.

"రా, రాజు!" అంటూ స్నేహితుడిని ఇంట్లోకి ఆహ్వానించి—డ్రాయింగ్ రూంలో వున్న సోఫాలో కూర్చోబెట్టి హడావుడిగా లోనికి వెళ్ళాడు.

అందంగా అలంకరించిన డ్రాయింగ్ రూమును చూస్తూ కూర్చున్నాడు రాజు.

డయానోరా టీవి. ఫ్లవర్‌వాజులు ప్రకృతి దృశ్యాలున్న పోస్టర్లు. ఏనుగుదంతంతో చేసిన రాధాకృష్ణుల విగ్రహం మొదలైనవి డ్రాయింగ్‌రూముకు అందాన్ని సమకూర్చి పెట్టాయి

ఇంట్లోకెళ్ళి "నళినీ ...నళినీ ..." అంటూ ఇంకా పిలుస్తున్నాడు వాసు.

ఆవిడ ఇంట్లో లేదేమో?

తను వస్తున్నట్లు చెప్పలేదేమో?

రాజు ఆలోచిస్తూ కూర్చున్నాడు.

రెండు మూడు నిముషాల తర్వాత వాసు కంగారుగా డ్రాయింగ్ రూములోకి వచ్చాడు.

వాసు దృష్టి టీవి ప్రక్కనవున్న కాగితంమీద పడింది. గాలికి ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టివుంది దానిమీద. వెళ్ళి అందుకొని—గబగబా చదవడం మొదలెట్టాడు.

"మిస్టర్ వాసు!"

నీ భార్య ఇంట్లోలేదని కంగారుపడుతున్నావుకదూ! ఔను లేదు! నీ భార్యను నేనే ఎత్తుకుపోయాను. నా కొక పాతికవేలు అవసరమొచ్చింది. అవి రేపు మధ్యాహ్నం రెండుగంటలకు వూరవతల 9 వ మైలురాయి వెనక మూడు పిట్లగోతి త్రవ్వివుంది. ఓ చిన్న క్యాష్‌బ్యాగులో డబ్బు పెట్టి ఆ గుంటలో పడవేయి. ఆనక ప్రక్కనేవున్న మట్టిని అందులో తోసేసి—నీ దారిన నువ్వు వెళ్ళిపో!

నువ్వు ఇంటికొచ్చే సరికి—నీ భార్య నీ ఇంట్లో ఉంటుంది. పోలీసులకు తెలియజేస్తే నీ భార్య నీకు ప్రాణాలతో దక్కదు, ఖబడ్దార్!"

క్రింద సంతకంలేదు.

వాసు నిలువెల్లా వణికిపోయాడు.

అతని వాలకాన్ని చూసిన రాజు—"ఏమిట్రా ఏమైంది. ఏం వ్రాసివుంది. అందులో...." అంటూ గాబరాగా అడిగాడు.

వాసు ఉత్తరం అతనికి అందిచాడు.

రాజు గబగబా చదివి—"ఓ గాడ్! ఇప్పుడెలా!" అన్నాడు.

"అదే నాకు అర్థం కావడంలేదు!" అన్నాడతను.

"రహస్యంగా పోలీసులకు రిపోర్టిద్దాం!"

"అంతేనంటావా?"

"అంతకంటే మరో మార్గంలేదు!"

వాసు ఇంకా ఏమీ మాట్లాడకుండా తలుపులు వేసేసి—బయటికి నడిచాడు.

స్కూటర్ స్టార్టయ్యింది.

పోలీసు స్టేషన్

సబ్ ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య వారిని కూర్చోబెట్టాడు.

వాసు విషయమంతా చెప్పి కిడ్నాపర్ రాసిన ఉత్తరాన్ని యస్.ఐ. గారికి చూపెట్టాడు.

యస్.ఐ.గారు ఉత్తరాన్నంతా ఒకసారి చదువుకున్నారు. బాగా ఆలోచించి స్పాట్ దర్శించకూడదనే నిర్ణయాని కొచ్చాడు. అక్కడికెళ్తే కిడ్నాపర్‌కు అనుమానం వస్తుంది కదా!

"ఆల్ రైట్. ఈ విషయం నేను చూసుకుంటాను లెండి! మీరు మాత్రం రేపు మధ్యాహ్నం క్యాష్‌బ్యాగులో చెత్తకాగితాలు పెట్టి అతను చెప్పినట్టు చెయ్యండి. డబ్బు కోసం కిడ్నాపర్ అక్కడికొస్తాడు. మేము వలపన్ని అతన్ని పట్టుకుంటాం!"

"రేపు పాతిక వేలు ముట్టకపోతే—చంపేస్తాను అని బెదిరిస్తున్నాడు సార్!" వాసు భయంతో రిపీట్ చేసాడు.

"నేను ఉత్తరం చదివానుకదా! ఇన్‌స్పెక్టర్‌గారువచ్చిన తర్వాత అన్ని విషయాలు ఆయనతో మాట్లాడి—మేము తగు వ్యూహం పన్నుతాము. కిడ్నాపర్ తేలికగా దొరుకుతాడు."

2

మధ్యాహ్నం రెండుగంటలు.

వాసు స్కూటర్‌మీద 9 వ మైలురాయి దగ్గరికొచ్చాడు. అక్కడ నిజంగానే మూడు ఫీట్లగుంత తీసివుంది.

చేతిలో క్యాష్‌బ్యాగు వుంది. అందులో నిండుగాచెత్త కాగితాలు వున్నాయి.

నలుదిక్కులా చూసి—చెత్త కాగితాలున్న క్యాష్ బ్యాగు అందులోవేసి మళ్ళీ స్కూటర్ స్టార్టుచేసాడు.

మరో అరగంటలో ఇంటికివచ్చి భార్య నళిని ఎక్కడు నుంచైనా వస్తుందేమోనని చాలాసేపు వేచి చూసాడు.

సాయంత్రం అయింది.

అయినా నళిని జాడలేదు.

వాసు మళ్ళీ పోలీసు స్టేషన్‌కొచ్చి—తన భార్య తిరిగి రాలేదని చెప్పాడు.

"కిడ్నాపర్ ఆ డబ్బులకోసం రాలేదు. నలుగురు కానిస్టేబుళ్ళు, ఒక హెడ్ కానిస్టేబుల్ అక్కడే సంచరిస్తున్నారు మాకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని వి హెచ్. యఫ్ సెట్ లో తెలియజేస్తున్నారు.

కిడ్నాపర్‌ని పట్టుకోగలితే మీ భార్య ఆచూకి తెలిసినట్లే. మీరలా బెంబేలు పడిపోతే ఎలాగా? కొంచెం ఓపిక పట్టాలి." అన్నాడు యస్ ఐ పుల్లయ్య.

వాసు నిట్టూర్చి "మళ్ళీ కలుస్తానండీ!" అంటూ అక్కడినుండి కదిలాడు.

పోస్టాఫీసుకు వెళ్ళి అత్తమామలకు టెలిగ్రాంకొట్టాడు.

మరునాడు వాళ్ళు రెక్కలు కట్టుకొని వ్రాలారు.

రావడం రావడమే వాళ్ళు ఏడుపు మొదలుపెట్టారు.

"పాతికవేలు పోతే పోయాయి. ఎక్కడైనా అప్పు అయినా తెచ్చి ఇవ్వకపోయావా బాబు. ఆ ముదనష్టపువాడికి నా బిడ్డమీదనే పడ్డాయి కళ్ళు!" అంటూ అత్తగారు కిడ్నాపర్‌ను శపించడం మొదలుపెట్టారు.

"పోలీసులు ఇవ్వొద్దన్నారండీ! అందుకే ఇవ్వలేము. లేకపోతే ఎక్కడ్నుంచి అయినా సర్దేవాడిని!" అన్నాడు వాసు.

నెలరోజులు భారంగా గడిచాయి.

పోలీసులు కిడ్నాపర్ జాడ తీయలేకపోయారు. యీ లోగా కిడ్నాపర్ వాసు మోసానికి ఆగ్రహించి, అతడి భార్యను చంపి ప్రతీకారం తీర్చుకున్నట్లుగా తెలియజేశాడు.

వాసుకు మరో వూరికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది.

ఆ రోజు—

పోలీసులు అకస్మాత్తుగా వచ్చి ఇంటాయనతో ఇల్లు సోదా చెయ్యాలని చెప్పారు.

"భార్య చనిపోయిందని భర్తకీ చీమ కుట్టినట్లులేదు. మనకెందుకు సార్ ఈ బాదరంతా?" అన్నాడు యస్.ఐ. పుల్లయ్య, ఇన్స్‌పెక్టర్‌తో.

"అతడికి ఇంట్రెస్టువున్నా లేకపోయినా—మన విధి మనం నెరవేర్చాలికదా!" అంటూ లోనికి దారితీసాడు.

ఇల్లంతా వెదికారు. అన్నీ ఖాళీగదులు.

ఇన్స్‌పెక్టర్ ఇంటివెనక వున్న ఖాళీ ప్రదేశంలో తిరగడం మొదలుపెట్టాడు.

ప్రహారిగోడ మూలకువున్న ఒక ప్రదేశం అతన్ని ఆకర్షించింది.

ఇన్స్‌పెక్టర్ హుషారుగా అటువైపు పరుగెత్తాడు.

ఆ ప్రదేశాన్ని త్రవ్వి పూడ్చివేసి—అనుమానం రాకుండా—ఏవో పూలమొక్కలు నాటారు.

కానీ—నీళ్ళు లేక అవి ఎండిపోతున్నాయి.

ఇన్స్‌పెక్టర్ దగ్గరలోవున్న పార తీసుకొని త్రవ్వడం మొదలుపెట్టాడు.

సందేహంలేదు.

అక్కడ ఇంతకుముందు గొయ్యి తీసారు.

లోపల్నుంచి మురుగువాసన వేసింది.

అతని వూహ నిజమే అయింది.

అందులో శవముంది.

వెంటనే కూలీలను పిలిపించి అక్కడ త్రవ్వించాడు.

కూలీలు ఒక స్త్రీ శవాన్ని బయటికి తీసారు.

అది నళిని శవంగా గుర్తించారు పోలీసులు.

నళిని కిడ్నాప్ చేయబడలేదు అన్న విషయం తేట తెల్లమైంది.

అప్పుడు సమయం పన్నెండుగంటలు.

"వాసుగారు....వాసుగారు".... అంటూ పోస్ట్‌మెన్ వచ్చాడు ఇంట్లోకి.

"అతను ఇప్పుడే వెళ్ళిపోయాడు. ఏమిటి విశేషం. ఉత్తరాలేమైనా వచ్చాయా?" అడిగాడు యస్.ఐ.

"ఔనండి! ఓ ఎన్‌వలప్ వచ్చింది" అన్నాడతను.

అప్పుడే ఇన్‌స్పెక్టర్ అటువైపు వస్తూ—ఆ మాట విని "అదిఇలాఇవ్వు. మేము అతనికి రీడైరక్ట్ చేస్తాం!" అన్నాడు.

పోస్ట్‌మెన్ ఎన్‌వలప్ ఇచ్చేసి వెళ్ళిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ యధాలాపంగా కవరు చించేసి చూసాడు.

ఓ ఉత్తరం వుంది అందులో—

"డియర్ వాసు!

నేను చెప్పింది ఏం చేసావు? నువ్వు కోరినట్లుగా లక్షన్నర కట్నం ఇవ్వడానికి నిర్ణయించుకున్నాం సబ్జెక్టు టు ది కండీషన్... నీకు తెలుసుగా—దెన్ ఎక్స్‌పిడెట్ యువర్ వర్క్ విదిన్ ఎ వీక్. అదర్‌వైజ్ వుయ్‌విల్ గోఫర్ ఎనెదర్ మ్యాచ్!"

యువర్స్,

—రాంబాబు."

భ్రమ అర్థంకాలేదు.

ఉత్తరం పూర్తిగా చదివిన ఇన్‌స్పెక్టర్‌కు కిడ్నాపింగ్ అనేది వాసు అల్లిన ఓ అందమైన హరికథ అని అసలు హత్యచేసింది—వాసు అని దానికి మోటివ్ ఎక్కువకట్నం యివ్వజూపిన రాంబాబు అని అర్థమైంది.

రాంబాబు ఎడ్రసు తెలుసుకోవడం గొప్ప విషయం ఏమీ కాదు. వాసును లాకప్‌లో వేపి నాలుగు వాయిస్తే— అతనే చెప్పేస్తాడు. కోర్టులో శిక్షపడటానికి ఉత్తరంతో పాటు యింకా ఏమైనా ఆధారాలు దొరుకుతాయేమోనని పెరడంతా వెదికారు.

వాళ్ళ శ్రమ వృథాకాలేదు.

హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తం చిందిన వాసు షర్టు మరొక గోతిలో పాతిపెట్టి వున్నాయి. కత్తిపైన వేలి ముద్రలు వున్నాయి.

ఈ గోతులన్నీ అతని గొయ్యినే త్రవ్వుతాయని—కట్నం కోసం పరుగులెత్తి అగ్నిసాక్షిగా తాళికట్టిన భార్యను హత్య చేసిన వాసు అప్పుడు వూహించి వుండడు.

అదేరోజు వాసుతోపాటు అతన్ని ప్రేరేపించిన రాంబాబు కూడా అరెస్టు అయ్యాడు.

వాళ్ళు పోలీసుల ఇంటరాగేషన్‌లో తమ నేరాన్ని ఒప్పుకున్నారు. □

భార్యా విధేయులు !



టెర్రరిస్ట్

చంద్రశేఖర అజాద్



"నీ పేరు?"

"కర్తార్ సింగ్."

"ఏం చేస్తుండేవాడివి?"

"మాకు చిన్న వర్క్‌షాపు వుంది."

"ఇందులోకి ఎందుకొచ్చావ్?"

"గురువుల ఆదేశం."

"నువ్వు నీ దేశాన్ని ప్రేమిస్తున్నావా?"

"అవును. నా దేశం ఖలిస్థాన్."

"దేశభక్తుడ్నంటావ్."

"అవును. కానీ నన్ను టెర్రరిస్టు అంటారు."

"ఎన్ని హత్యలు చేశావ్?"

"పాతికపైగా."

"చంపటంలో నీ పద్ధతి."

"తుపాకితో కాల్చటం."

"ఇంకేమైనా."

"నాటుబాంబులు విసరటం."

"ఇందుకు నీకేమైనా ఓ ప్లాను ఉందా?"

"కొన్ని సందర్భాల్లో పైవారు నిర్ణయించిన ప్రకారం చేస్తుంటాం. ఎక్కువగా నేను చేసిన వాటిల్లో గుంపుగా వున్నవారిని కాల్చటమే చేశాను."

"ఎప్పుడయినా పట్టుబడ్డావా?"

"ఎప్పుడూ పట్టుబడలేదు."

"నువ్వెందుకిలా మారావు."

"మా దేశంకోసం. మాకు అన్యాయం జరిగింది."

"మీ దేశంకోసం ఏం చెయ్యటానికైనా సిద్ధమేనా?"

"సిద్ధమే! అవసరమయితే నా ప్రాణాలిస్తా."

"మీ దేశం గొప్పదా? మతం గొప్పదా?"

"మతమే గొప్పది. అందుకే మా మతమే దేశం కావాలి."

"నీ కెవరిమీద పగ."

"భారతదేశం మీద, రాజకీయ నాయకుల మీద, అధి

కారంలో వున్నవారిమీదా."

"వార్నేం చెయ్యాలని."

"వారందరినీ వరుసగా చంపుతాం. అందులో నేనూ భాగం పంచుకుంటాను."

న్యూయార్క్‌లోని ఓ స్థలంలో ఈ కార్యక్రమం జరుగుతూంది. టెర్రరిస్టులకు శిక్షణ యిచ్చే సంస్థ అది.

"స్టెన్‌గన్ వుపయోగించటం తెల్సా?"

"కొద్దిగా."

"ఫైరింగ్ యెక్కడ నుండి మొదలుపెడతావు."

"గురిచూసి."

"ఎక్కడికి."

"గుండెకి."

"గురి తప్పితే—?"

"............"

"విమానాల్ని హైజాక్ చెయ్యటంలో ఏమయినా అనుభవముందా?"

"లేదు."

"బాంబుల్ని తయారు చెయ్యటంలో."

"నాటుబాంబులు చేస్తాను."

అన్ని విషయాలు రికార్డవుతున్నాయి ఆటోమేటిక్‌గా!

"నీకేం భాషవచ్చు."

"మాతృభాష."

"ఇంకా."

"కొద్దిగా ఇంగ్లీషు."

"నువ్వేదేశాన్ని అభిమానిస్తున్నావు?"

"అమెరికాని."

"ఏ కారణంతో."

"భూతలస్వర్గం కాబట్టి."

"మీ ఉద్యమం ఎలా వుంది?"

"బ్రహ్మాండంగా వుంది!"

"ఎలా చెబుతున్నావు?"

"మేం ఎందరినో చంపాం. కల్లోలం సృష్టించాం."

"మీకు ఆయుధాలు ఎలా వస్తున్నాయి?"

"మా మిత్రులు అందజేస్తున్నారు."

"మీ స్వర్ణదేవాలయంలోకి సైన్యం ప్రవేశించింది కదా!"

"అవును."

"దానిపట్ల నీ ఫీలింగ్."

"ప్రతీకారం తీర్చుకుంటాం" కర్తార్‌సింగ్ దవడ ఏముక బిగిపించి.

"బింద్రన్ చచ్చిపోయేడా?"

"చచ్చిపోలేదు."

"ఏమయ్యాడు."

"ప్రతి సిక్కులోనూ ఉన్నాడు?"

"సిక్కులంతా టెర్రరిస్టులేనా?"

"కొందరు ద్రోహులున్నారు. వారిని ఖతం చెయ్యాలి!"

ఇంకా వివిధ విషయాల మీద కర్తార్‌సింగ్‌ను పరీక్షించారు. ప్రశ్నలడిగారు. అతని ఆరోగ్యాన్ని పరిశీలించారు. అంతకుముందు ఏమయినా రోగాలున్నాయా అనడిగారు. అతని మూత్రం వగైరాలు పరీక్షించాక భవిష్యత్‌లో ఏమయినా రోగాలు రావచ్చేమో చూశారు.

ఏఏ విషయాలపట్ల అతనెలా ప్రవర్తిస్తాడో. అతని బలహీనతలేమిటో.... భావావేశాలెలా వుంటాయో....ఏ ఏ విషయాల్లో అతనికి శిక్షణ అవసరమో కంప్యూటర్ రిపోర్టు

నిచ్చింది.

శిక్షణ మొదలయింది—

స్టెన్‌గన్ ఆపరేషన్.

కర్తార్‌సింగ్ పట్టుదలగా కృషి మొదలుపెట్టాడు.

ఆ రోజు పరీక్ష—

లోడ్ చేయబడ్డ స్టెన్‌గన్ అందుకున్నాడు.

దూరంగా మనుషులు.

వారి చేతుల్లో తుపాకులు.

మెరుపులా పట్టికొట్టాడు.

క్షణాల్లో పొజిషన్‌లో కొచ్చాడు.

ఫైరింగ్ మొదలయింది.

"గజ్ ... జ్ ... జ్"

కాళ్ళనుండి మొదలై ....

వరుసగా గుండెల్ని కాలుస్తూ, కన్నుమూసి తెరచేటంతలో కుప్పలా కూలిపోయింది బొమ్మ!

"గుడ్"

కాళ్ళనుండి షూటింగ్ ప్రారంభించటానికో కారణం వుంది.

కాళ్ళకు బులెట్ తగలగానే మొదలంటా కూలిపోతారు. అక్కడనుండి కదిలే అవకాశం ఉండదు మరోచోటయితే ప్రక్కకు జరిగి ఎదురుకాల్పులు జరిపి ప్రతిఘటించే అవకాశం వుంది. అలాగే తనకు అడ్డంగా ఏదైనా రక్షణ ఏర్పాటు చేసుకోగలిగితే కష్టమే!

బాంబులు తయారుచేయటం మొదలయింది.

కర్తార్‌సింగ్ ఉత్సాహంగా పనిచేస్తున్నాడు!

అత్యంత ఆధునిక పరికరాల్తో తయారుచేస్తున్నారు.

ప్రత్యేక సమావేశం జరిగింది—

"మిస్టర్ కర్తార్‌సింగ్"

"యస్ సర్"

"ట్రయల్ చూద్దాం"

కర్తార్‌సింగ్ తల ఊపాడు!

'టెలిఫోన్ బూత్'లా వుంది.

ఓ మరమనిషి రిసీవర్ తీసుకుని రింగ్ చెయ్యబోయాడు

'ఢడేల్'మంటూ ప్రేలిపోయింది.

డైరెక్టర్ పెదవులమీద చిరునవ్వు!

2

మరుసటిరోజు అకాలీ నాయకుల్తో ప్రభుత్వం సమావేశం కానుంది. ఈ సమావేశాన్ని పంజాబ్‌కు చెందిన అత్యంత ప్రధాన సమావేశంగా భావిస్తున్నారు. ఆ సమస్య పరిష్కారానికి ఏదో మేరకు అంగీకారం కుదరగలదని అందరూ ఆశపడుతున్నారు.

ఆ సమస్య యిలా రగలటం ఎవరికీ యిష్టంలేదు. అందుకే పరిష్కరించబడాలని అందరూ కోరుకోవటం. ఆ మారణహోమంలో వందలాది అమాయకులు బలవుతుండటమే అందుకు ఓ కారణం.

ఉగ్రవాదులు వాడుతున్న ఆయుధాలు అత్యంత ఆధునికమైనవి. వాటిని కేవలం ప్రభుత్వాలు మాత్రమే కొనుగోలు చేయగలవు. అలాంటివి వారి చేతికొస్తున్నాయి. వాటిని నైపుణ్యంతో వినియోగించుకొంటున్నారు.

ఈ రహస్యాల్ని కనుగొనటంలో గూఢచారి శాఖలు విఫలం అవుతున్నాయి.

అంతేకాదు—

ఢిల్లీలో మొత్తం ఇరవై టెలిఫోన్‌బూతులు ఆ మధ్యాహ్నం ప్రేలిపోయాయి.

మొత్తం మూపై మంది మరణించారు.

ఎందరో గాయపడ్డారు.

ఢిల్లీ అట్టుడికిపోయింది.

టెలిఫోన్ల దగ్గరకు వెళ్ళటానికి భయపడుతున్నారు జనం.

స్వంత ఫోన్లు ఉపయోగించటానికి సైతం వెనకాడుతున్నారు.

శాంతి భద్రతలు లేవు!

ప్రభుత్వం నిర్వీర్యపోయింది.

ఉగ్రవాదుల చర్యను పిరికితనమంటూ ప్రకటించారు.

ఈ విషయం చర్చించటానికి అకాలీలు సమావేశమయ్యారు.

మరునటిరోజు సమావేశానికిముందు వారు ఈ చర్యను ఖండిస్తూ ప్రకటించారు.

ప్రభుత్వం ఆగ్రహం చెందింది

ఈ వాతావరణంలో చర్చలు అర్ధంతరంగా ముగిశాయి.

టెర్రరిస్టుల లక్ష్యం నెరవేరింది!

కర్తార్‌సింగ్‌కు పైనుండి ప్రశంసలందాయి.

అతని శిరస్సు భక్తిభావంతో వంగింది.

ఆ ప్రభావంలో ఆ క్షణం డెబ్బైకోట్ల భారతీయుల్ని చంపటానికయినా సిద్ధపడేట్లున్నాడు.

ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండించాయి

ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐ బి) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సి.బి.ఐ). రీసెర్చి అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా), రెవిన్యూ ఇంటెలిజెన్స్ (ఆర్. ఐ) అనేవి భారతదేశ భద్రతా వ్యవస్థకు చెందిన నాలుగు ముఖాలు. ఇందులో ఐ.బి. 1920 లో ప్రారంభమైంది. బ్రిటీష్ వారి

నుండి మనకు సంక్రమించింది. సి.బి.ఐ 1963 లో, 'రా' 1968 లో ప్రారంభమయ్యాయి. ఆర్ ఐ. 1970 తర్వాత ఏర్పడింది ఇవిగాక పారా మిలటరీ కమేండొాల్తో ఐ.టి. బి.పి, ఎన్.ఎస్ బి.లు భద్రతా యంత్రాంగంలో భాగంగా వున్నాయి. చివరగా స్పెషల్ ఫ్రాంటియర్‌ఫోర్స్. ఇది క్యాబినెట్ సచివాలయం డైరక్ట్ సూపర్‌విజన్‌లో నడుస్తుంది.

పై నాలుగు సంస్థల నివేదికల్ని పరిశీలించేక తుది నిర్ణయం తీసుకోవడానికి జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ వుంది

'ఐ బి'లో పదమూడు వేలమంది, 'రా'లో ఏడువేల మంది 'సి బి ఐ'లో నాలుగువేలమంది దాదాపుగా పని చేస్తున్నారు.

మొట్టమొదట రెండు బ్రాంచీల్తో ప్రారంభమైన 'రా' ప్రస్తుతం 70 శాఖల్తో విస్తరించింది.

'రా' సాంవత్సరిక బడ్జెట్ 400 కోట్లు!

మొత్తం ఇంటెలిజెన్స్ నిర్వహణ ఎన్నివేల కోట్ల రూపాయల్లో జరిగిందో ఊహించుకోవచ్చు ఇప్పటివరకూ!

ఈ రిపోర్టును పత్రికలు ప్రకటించాయి.

మరెందుకని ఈ సంస్థలు విఫలం అవుతున్నాయి?

ఈ సంస్థల్ని దేశ భద్రతకుగాక తమ రాజకీయ ప్రత్యర్థుల్ని వేధించటానికి ప్రభుత్వం వినియోగించుకుంటోందని ప్రతిపక్షాల వాదన.

పంజాబ్‌లో ఓ అర్ధరాత్రి 37 రైల్వేస్టేషన్లు

అస్సాంలో....

ఢిల్లీలో....

దేశంలో అన్ని మూలలా....

టెర్రరిస్టులు విజృంభిస్తున్నారు.

కానీ ఈ సంస్థలేవీ ఆ కార్యక్రమాల్ని ముందుగానే తెలుసుకోలేకపోతున్నాయి.

3

అమెరికాలో ఉగ్రవాద శిబిరాలపట్ల ఎంతో సంచలనం కలిగింది.

తమకు ఇష్టంలేని, తమకు లొంగని దేశాల నాయకుల్ని హత్యలు చేయించటం మొదలు ప్రభుత్వాలు కూల్చేదాకా, ఏర్పాటు ఉద్యమాల్ని ప్రోత్సహించి అంతర్గత కల్లోలాలు రగిలించటానికి భారీఎత్తున ఆయుధాలు, శిక్షణ వారికిస్తున్నాయి.

అంతకుముందు కొన్ని ప్రతిపక్షాలు మొరపెట్టుకుంటున్నా అందరూ పట్టించుకోలేదు. ఇందిరా గాంధి హత్యానంతరంగాని ప్రభువులూ వదులుకోవటం మొదలవలేదు. అమెరికాకు ఈ సంస్థలపట్ల తమ నిరసన తెలియచేసింది భారతదేశం

అమెరికా లెక్కచెయ్యలేదు.

అది వారి విధానం

ఆ విషయమే 'జాన్ఎమ్‌బిల్లీ' చెబుతున్నాడు.

'బిల్లీ' అనేక విషయాలమీద పత్రికాగోష్ఠిలో మాట్లాడుతున్నాడు. విమానాశ్రయంలో జరుగుతుందది!

'బిల్లీ' గత ప్రభుత్వంలో విదేశ వ్యవహారాలు నిర్వహించాడు.

అప్పట్లోవారికి నాలుగయిదు సందర్భాల్లో ఆయా దేశాల మీద 'బాంబు'లు విసరాలనిపించిందట. జనం చచ్చిపోతారని మానేశాడట. చివరి క్షణంలో వివిధ దేశాలమీద, ప్రభుత్వాలమీద తమ అభిప్రాయాలు వెలిబుచ్చేక ఆయన

శెలవు తీసుకున్నాడు.

ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తూంది—

హుందాగా బయలుదేరాడు మిస్టర్ 'బిల్లీ.'

చివరిక్షణంలో హడావుడిగా ప్రవేశించాడో వ్యక్తి—

అతను ఉగ్రవాదసంస్థ డైరెక్టర్.

విమానం ఆకాశంలో కెగిరింది.

అందులో కర్తార్‌సింగ్ వున్నాడు.

కర్తార్‌సింగ్ కళ్ళు పాలిపోయి వున్నాయి.

కర్తార్‌సింగ్ ప్రయాణం చేస్తున్న ఆ విమానంలో మిస్టర్ 'బిల్లీ'. తమ డైరెక్టర్‌తోపాటు భారతదేశ ప్రముఖులున్నారు. అయినా అతను నిలువెల్లా ఏదో ఆవేశం మూర్తీభవించినట్లున్నాడు.

ఆ విమానంలో ఇంకా.... రెండు వందల ఎనభై మంది వున్నారు

ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

విశాలమైన సముద్రంమీద ఎగురుతూంది విమానం.

కర్తార్‌సింగ్ కళ్ళు తెరిచాడు.

ఎర్రబడి జ్యోతుల్లా వున్నాయి.

లేచి అందరివంకా చూశాడు—

అకస్మాత్తుగా టెలివిజన్‌మీద విమానం అదృశ్యమైంది!

"హలో....హలో" అరుస్తున్నారు.

అప్పుడు వినపడిందో శబ్దం!

కర్తార్‌సింగ్ చివరికేకలో కలిసిపోతూ.

గాలిలో విసిరివేయబడ్డ దేహాలు.... విమాన శిథిలాలు వేగంగా సముద్రగర్భంలోకి ప్రయాణం చేస్తున్నాయి! □

గూండా నాయకుడు

పి.వి.యస్. ప్రకాశరావు



ఉదయం పదిగంటలవుతుండగా పోలీసు కమీషనరు కార్యాలయానికి చేరుకున్నాను.

అప్పటికే ఇంటర్వ్యూకి వచ్చిన కొంతమంది అభ్యర్థులు ఓచోట చేరి ఏదో చర్చించుకుంటున్నారు.

ఆ రోజు పోలీసు సబ్ యిన్స్పెక్టర్ల సెలక్షన్ జరగ

బోతోంది. రిటెన్ టెస్ట్‌లో మంచి మార్కులతో పాసయిన ఇంటర్వ్యూకార్డు అందుకొన్నవారిలో నేనొకడ్ని.

సరాసరి వారి దగ్గరకుపోయి నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

ఆ తర్వాత అందరం రాజకీయాల గురించి, పోలీసు వ్యవస్థగురించి, ఇంకా అనేక విషయాలను గురించి చర్చించుకుంటున్నాం.

అలా మేము చర్చించుకుంటుండగా పిడుగులాంటి వార్త ఒకటి నోటీసు బోర్డులో పెట్టబడింది.

కొన్ని కారణాలవల్ల ఈ రోజు ఇంటర్వ్యూ కాన్సిల్ ఆయిందని, అభ్యర్థులందరూ రేపు ఉదయం ఇదేటయానికి ఇంటర్వ్యూకి హాజరు కావ్వాలని.

ఆ వార్త చదివి అక్కడవున్న వారందరికంటే ఎక్కువ నిరుత్సాహపడింది నేనే.

ఎందుకంటే ఇపుడు నా దగ్గర కరెక్టుగా ఇంటికి తిరిగి పోవటానికి సరిపడా చార్జీలన్నాయి. ఇంతపెద్ద మహా నగరంలో ఒకరోజు వుండాలంటే కనీసం పదిహేను, ఇరవై రూపాయలకన్నా తక్కువ ఖర్చుగాదు. మరల రేపు నేను యింటికి పోయేదెట్లా?

అందరిదగ్గర శెలవు తీసుకుని ఉస్సూరుమంటూ బయటకు నడిచాను.

అలా కొంచెందూరం నడిచాక ఓ పార్కు కనిపించింది. అందులోకిపోయి ఓ చెట్టు నీడన చతికిలబడ్డాను.

ఓసారి చుట్టూ కలియచూశాను.

అది మధ్యాహ్నంవేళ అవటంవలన పార్కులో ఎవరూ లేరు. దూరంగా తోటమాలి ఏవో మొక్కలకు పాదులు చేస్తూ కనిపించాడు.

అండర్ వేర్లో భద్రంగా దాచిన డబ్బులను ఒకసారి బయటకుతీసి, లెక్కచూసుకుని, మరల భద్రంగా లోపలకుతోసి, భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను.

అలా ఎంత సేపు నిద్రపోయానో నాకే తెలియదు.

ఎవరో పరిగెత్తుకొస్తున్న అడుగుల సవ్వడి వినిపించి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

సుమారు ఇరవై ఏడు, యిరవై ఎనిమిది ఏళ్ళ వయసున్న ఓ యువకుడు రొప్పుతూ, రొజుతో నా ఎదురుగుండా నిలబడివున్నాడు. చాలా దూరంనుంచి పరుగెత్తుకువస్తున్నాట్టుంది. ఆయాసంతో అతని వక్షస్థలం ఎగిరెగిరి పడుతోంది. మనిషి ఏ క్షణంలోనయినా తూలి కిందపడిపోయేట్టున్నాడు. అతని కుడిచేతిలో చిన్న బ్రీఫ్‌కేస్‌వుంది.

"కొందరు దుర్మార్గులు నన్ను తరుముకుంటూ వస్తున్నారు. ప్లీజ్! నన్ను వారి బారినుంచి కాపాడండి" అంటూ బ్రీఫ్‌కేసును రెండు చేతులతో గుండెలకు హత్తుకుని కుప్పలా కూలిపోయాడావ్యక్తి.

తీవ్రంగా ఆలోచించటం మొదలెట్టాను.

'ఎవరీవ్యక్తి? ఇతన్ని ఆ దుండగులు ఎందుకు వెంబడిస్తున్నట్లు? ఇతనిదగ్గరున్న బ్రీఫ్‌కేసులో డబ్బు ఏమయినా వుందా? అందుకోసమే వాళ్ళు ఇతన్ని వెంబడిస్తున్నారా?'

గట్టిగా తల విదిలించాను.

అయినా ఈ విషయాలు నాకెందుకు? లేనిపోని విషయాల్లో తలదూర్చి పీకలమీదకు తెచ్చుకోవటం దేనికి అనుకుంటూ కిందవున్న నా పైజును అందుకుని వెనుతిరిగాను.

కాని తోటి మానవుడు ఆపదల్లో వుంటే సహాయం చెయ్యగలిగిన స్థితిలో వుండికూడా చెయ్యకుండా వెనుదిరిగిపోవటమా?

అందుకు నా అంతరాత్మ అంగీకరించలేదు. గిరుక్కున వెనుతిరిగి అతనిదగ్గర కూర్చొని శ్వాసను పరిశీలించాను.

శ్వాస చాలా నెమ్మదిగా, బరువుగా సాగుతోంది.

'ఇతన్ని వెంబడిస్తున్నవాళ్ళు ఏ క్షణాన్నయినా ఇక్కడికి రావచ్చు. వెంటనే ఇతన్ని ఎక్కడయినా దాచాలి'—అనుకుంటూ చుట్టూ కలియచూశాను

ఓ చోట గుబురుగా పొదలు కనిపించాయి.

అతన్ని భుజంమీదకు ఎత్తుకుని ఆ గుబురుపొదల్లో దాచేసి పైన ఆకులుకప్పి వెనక్కువచ్చి కిందపడ్డ అతని బ్రీఫ్‌కేసును అందుకున్నాను.

'ఇపుడు ఈ బ్రీఫ్‌కేసు నా దగ్గర వుండటం చాలా ప్రమాదం. ఇతన్ని వెంబడిస్తున్న వ్యక్తులు దీన్ని చూసే వుంటారు. అర్జంటుగా దీన్ని ఎక్కడయినా దాచేయాలి—' అనుకుంటూ చుట్టూ చూశాను.

ఓ చోట మీడియంసైజు పిమెంటుతొట్టి ఒకటి బోర్లించి కనబడింది.

గబగబా దాని దగ్గరకు పరిగెత్తి బ్రీఫ్‌కేసును దానికింద పెట్టి, మరలా తొట్టి యథాతథంగా బోర్లించాను.

అదే సమయంలో రొప్పుతూ, రోజుతూ అక్కడకు పరిగెత్తుకుంటూ వచ్చారు ఇద్దరు వ్యక్తులు. ఒకడు నల్లగా తుమ్మమొద్దులాగా వున్నాడు. ఇంకొకడు సన్నగా, పొడుగ్గా గాలొస్తే ఎగిరిపోయేటట్లున్నాడు.

"ఏయ్ మిష్టర్! నల్లరంగు బ్రీఫ్‌కేసుతో ఎవరయినా ఇటు పరిగెత్తుకుంటూ వచ్చారా?" గరగరలాడుతున్న కంఠంతో ప్రశ్నించాడు తుమ్మమొద్దులాంటి వ్యక్తి.

అతని మాటలు వినబడనట్లే నటిస్తూ, పిమెంటు తొట్టి మీద కూర్చొని, శూన్యంలోకి చూస్తూ ఏవో లెక్కలు

వేయటం మొదలెట్టాను.

"ఏయ్ నిన్నే, వినబడటంలేదా లేక చెముడు ఏమయినా వచ్చిందా, నల్లరంగు బ్రీఫ్‌కేసుతో ఎవరయినా యిటు పరిగెత్తుకుంటూవచ్చారా?" రెట్టించి బిగ్గరగా అడిగాడు తుమ్మ మొద్దు.

నేను ఉలకలేదు పలకలేదు. ఏదేదో గొణుక్కుంటూ చేతివేళ్ళు లెక్కపెట్టుకోసాగాను.

"యూ బాస్టర్డ్! చెబుతుంటే నీక్కాదూ" అంటూ కోపంతో ముందుకు అడుగువేశాడు.

సన్నపాటి వ్యక్తి అతన్ని వారించాడు.

"గురూ! వీడెవడో చెవిటి నాయాల్లాగా వున్నాడు. వీడితో మనకెందుకుగాని పద. వాడు ఈపాటికి చాలా దూరం పోయివుంటాడు" అంటూ ముందుకు పరిగెత్తాడు. ఏదో గొణుక్కుంటూ అతన్ని అనుసరించాడు తుమ్మ మొద్దు.

వాళ్ళు వెళ్ళిపోయారని నిర్ధారణ చేసుకుని, లేచి నిలబడ్డాను.

గబగబా పొదలదగ్గరకు వెళ్ళి అతన్ని బయటకులాగి, దగ్గరలో వున్న పంపుదగ్గరనుంచి నీళ్ళుతెచ్చి అతని మొహం మీద చల్లాను.

నెమ్మదిగా కళ్ళు తెరిచాడా వ్యక్తి. మరుక్షణం కరంటు షాక్ కొట్టినట్లు లేచి నిలబడ్డాడు.

"మైగాడ్! నా బ్రీఫ్‌కేసేది?" కంగారుగా చుట్టూ కలియ చూస్తూ అడిగాడా వ్యక్తి.

"మిష్టర్!! మీ బ్రీఫ్‌కేసు భద్రంగానే వుందిగాని, ఇంతకు మీరెవరు? ఆ వ్యక్తులు మిమ్మల్నెందుకు వెంబడిస్తున్నారు?" అతనిమీద ప్రశ్నలవర్షం కురిపించాను.

ఆ వ్యక్తి చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

"నా పేరు నారాయణ. ఇక్కడ క్రైంబ్రాంచి యిన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నాను. నేను రెండు నెలలు ఎంతో కష్టపడి ఈ వూళ్ళో స్మగ్లింగ్ రాకెట్ నడుపుతున్న ఓ ముఠా యొక్క ఆచూకీని సాక్ష్యాధారాలతో సహా సేకరించాను. ఈ రోజు వాటిని ప్రభుత్వానికి అందజేద్దామని వెళుతుండగా, ఆ ముఠాలోని వ్యక్తులు నా వెంటపడ్డారు. వారిని తప్పించుకుంటూ ఈ వైపువచ్చాను. సమయానికి మీరు సహాయం చెయ్యబట్టి సరిపోయింది కాని, లేకపోతే ఈపాటికి నే నేమయ్యిపోయేవాడినో"—

అతను పోలీసు యిన్‌స్పెక్టరు అని తెలిసేటప్పటికి నాకు కొంచెం ఆనందం కలిగింది. నేను ఈ వూరెందుకొచ్చానో, ఏ పనిమీద వచ్చానో అతనికి వివరించాను.

నారాయణ నా భుజం తట్టాడు.

"నా ప్రాణంకంటే విలువయిన ఆ ఫైల్సును వాళ్ళ చేతిలో పడకుండా కాపాడారు. పై అధికారులతో చెప్పి ఉద్యోగం మీకు వచ్చేటట్లు చేస్తాను" అన్నాడు.

ఆనందంతో నా ఛాతి రెండంగుళాలు పెరిగింది. అప్పుడే నేను కూడా ఓ పోలీసాఫీసరు అయినట్లు ఫీలయ్యాను.

"ఉండండిసార్! మీ బ్రీఫ్‌కేసు తెచ్చిస్తాను" అంటూ లేచి నిలబడ్డాను.

అదే సమయంలో వికటంగా నవ్వుతూ అక్కడ ప్రత్యక్షమయ్యాడు తుమ్మమొద్దు. అతని వెనకాలే సన్నపాటి వ్యక్తి నిలబడి వున్నాడు.

ఇద్దరి చేతిల్లోని రివాల్వర్లు మా యిద్దరివైపు ఆకలిగా చూస్తున్నాయి.

కంగారుగా యిన్‌స్పెక్టర్ నారాయణవైపు చూశాను.

భయపడవద్దన్నట్లు సైగ చేశాడు.

రివాల్వర్‌ను విలాసంగా వూపుతూ నా దగ్గరకు వచ్చాడు తుమ్మమొద్దు.

"మిష్టర్! మాకు మస్కాకొట్టే వాళ్ళు యింతవరకు పుట్టనేలేదు. మర్యాదగా ఆ బ్రీఫ్ కేసు ఎక్కడుందో చెప్పి ప్రాణాలు దక్కించుకో. లేదా—పిట్టను కాల్చినట్లు కాల్చి పారేస్తాను" అంటూ రివాల్వర్‌ను నా కణతకు ఆనించాడు.

భయంతో ముచ్చెమటలు పోసాయి నాకు. ఇంటి దగ్గరున్న అమ్మా, నాన్నా, తమ్ముడు, చెల్లెలు కళ్ళముందు మెదిలారు. హాయిగా నా త్రోవన నేను పోయుంటే ఈ బాధ లుండేవి కాదుగా! అయినా రోటిలో తలపెట్టి రోకటి పోటుకు దడవడం దేనికి.

"మీరెవరో చాలా పొరపాటుపడుతున్నారు. ఆ బ్రీఫ్ కేసు ఏమిటో, ఆ గొడవేమిటో నాకేం తెలియదు" అన్నాను బింకంగా.

"మిష్టర్ బుకాయించి ప్రయోజనంలేదు. నువ్వు ఇన్‌స్పెక్టరుతో చివరిసారిగా అన్న మాటలు నేను విన్నాను. ఎక్కడ ఆ బ్రీఫ్ కేసు?" కణతకు మరింత గట్టిగా రివాల్వర్ ఆనిస్తూ అన్నాడు తుమ్మమొద్దు.

"ఆగు. అతను అమాయకుడు. అతనికేమి తెలియదు. అడిగేదేదో నన్ను అడుగు" కోపంతో అన్నాడు నారాయణ.

"చూడు ఇన్‌స్పెక్టర్! మీకు, మాకు మధ్య ఎటువంటి శత్రుత్వం లేదు. ఆ పైలువున్న బ్రీఫ్ కేసు మా మొహాన పారేస్తే మా దోవన మేము పోతాం" రాజీకి వస్తున్నట్లు అన్నాడు తుమ్మమొద్దు.

"గో టు హెల్. నాకేం తెలియదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నారాయణ.

కోపంతో తుమ్మమొద్దు కళ్ళు ఎర్రబడ్డాయి.

"మీచేత నిజం యెలా చెప్పించాలో మాకు బాగా తెలుసు. చేతులెత్తి ముందుకు నడవండి. పిచ్చిపిచ్చి వేషాలు వేశారో బుర్ర రామకీర్తన పాడిస్తాను" అంటూ నా మెడ పట్టుకుని రఫ్‌గా ముందుకునెట్టాడు తుమ్మమొద్దు.

తూలి కిందపడబోయి నన్ను నేను నిలదొక్కుకుని చేతులెత్తి ముందుకు నడిచాను.

2

పార్కు బయట ఆగివుంది చిన్న మెటాడోర్ వ్యాన్. నన్ను. ఇన్‌స్పెక్టర్ నారాయణన్ని అందులోకి నెట్టి తలుపులువేసి, మా ప్రక్కనే రివాల్వరును పట్టుకుని కూర్చున్నాడు తుమ్మమొద్దు.

డ్రైవింగ్ సీట్లో కూర్చుని వాన్‌ను ముందుకు దూకించాడు సన్నపాటి వ్యక్తి.

ఓ గంటపాటు సందులు, గొందులు తిరిగి చివరకు విశాలమైన ఓ భవంతిముందు ఆగిండి వ్యాన్.

"ఊ. దిగండి" వ్యాన్ తలుపులు తెరుస్తూ అన్నాడు తుమ్మమొద్దు. ఇద్దరం క్రిందకు దిగాం.

"పీటర్ నువ్వు ఇన్‌స్పెక్టర్ని తీసుకెళ్ళి నాల్గవ నెంబరు సెల్‌లో బంధించు. ఇతన్ని నేను బాస్ దగ్గరకు తీసుకు వెళతాను" అన్నాడు తుమ్మమొద్దు.

"ఓ.కె.గురూ!" అంటూ సన్నపాటి వ్యక్తి ఇన్‌స్పెక్టర్ నారాయణన్ని నెట్టుకుంటూ తీసుకు వెళ్ళిపోయాడు.

ఆ భవంతిలో వున్న విశాలమయిన ఓ ఎయిర్‌కండిషన్డ్ హాల్లోకి తీసుకుపోయాడు నన్ను తుమ్మమొద్దు.

ఆ హాలు మధ్యలో రివాల్వింగ్ చైర్లో కూర్చుని వున్నాడు సుమారు ఏభైఏళ్ళ వ్యక్తి.

అతనే వీళ్ళకి నాయకుడు అయివుండవచ్చు అను

కున్నాను. అతని ప్రక్కనే మరో యిద్దరు గూండాలు విన యంగా నిల్చున్నారు.

బాస్ దగ్గరకుపోయి అతని చెవిలో ఏదో చెప్పాడు తుమ్మమొద్దు.

అతను చెప్పింది విని తల పంకించాడు బాస్.

"అబ్బాయ్! యిలా వచ్చి కూర్చో" అంటూ తన కెదురుగా వున్న చైర్‌ను చూపించాడు బాస్.

నన్ను చిత్రహింసలు పెట్టి నాచేత నిజం చెప్పిస్తారేమో అని అనుకుంటున్న నేను యిక్కడ అనుకోకుండా యిలాంటి మర్యాద ఎదురవడంతో ఆశ్చర్యపోతూ బాస్ చూపించిన సీట్లో కూర్చున్నాను.

"చూడబ్బాయ్! నువ్వు కుర్రాడివి. వృద్ధిలోకి రావలసినవాడివి. ముందు ముందు నీకెంతో భవిష్యత్తు వుంది. మొండికెత్తి అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోకు. నువ్వు ఇన్‌స్పెక్టరుతో చివరిసారిగా అన్న మాటలు మా వ్యక్తి విన్నాడు. దానినిబట్టి ఫైల్‌వున్న ఆ బ్రీఫ్‌కేసు నువ్వే యెక్కడో దాచావ్. ఆ బ్రీఫ్‌కేసును మా కప్పగించావంటే ప్రతిఫలంగా నీకు లక్షరూపాయ లిస్తాను. బాగా ఆలోచించుకుని నీ నిర్ణయాన్ని చెప్పు" అన్నాడు బాస్.

"మై గాడ్! లక్షరూపాయలా!" ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాను.

"అవును. అక్షరాలా లక్షరూపాయలు. నువ్వు జీవితాంతం కష్టపడినా అంత డబ్బు సంపాదించలేవు. ఒకవేళ నువ్వు మా మాట కాదని ఆ ఫైలును ప్రభుత్వానికి ఒప్పజెప్పావనుకో నీకు మెప్పులు తప్ప మరింకేవి లభించవు. ఆ మెప్పులు నీకు, నీ కుటుంబానికి కూడు పెట్టవు" అన్నాడు బాస్.

తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాను.

బాస్ చెప్పినదాంట్లో నిజం లేకపోలేదు. రేపొద్దున ఆ ఫైలును ప్రభుత్వానికి వప్పగిస్తే చివరకు నాకు మిగిలేది మెప్పులే. అటువంటప్పుడు ప్రభుత్వానికి యివ్వటం దేనికి? వీళ్ళకే యిస్తే పోలా! లక్షరూపాయలు అప్పనంగా వస్తుంటే కాదనేవాడెవడు? ఈ దెబ్బతో నా కష్టాలన్నీ గట్టెక్కుతాయి.

కాని మరోపక్క అంతరాత్మ 'నువ్వు చేస్తున్నది చాలా తప్పు' అంటూ ఘోష పెడుతోంది.

చివరకు బాగా ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చాను. 'ఎవడి స్వార్థం వాడు చూసుకునే ఈ రోజుల్లో నీతీ నిజాయితీ అంటూ కూర్చుంటే చివరకు మిగిలేది చిప్ప, కర్ర మాత్రమే' అనుకుంటూ అంతరాత్మ యొక్క పీకను నొక్కి అవతల పారేశాను.

"ఆల్ రైట్ ఆ ఫైలున్న బ్రీఫ్ కేసును మీకప్పగించటానికి నాకేం అభ్యంతరంలేదు. కాని ఒకషరతు" అంటూ ఆగాను.

"ఏమిటది?" ఆత్రంగా అడిగాడు బాస్.

"అంతా అయిపోయిన తర్వాత మీరు నా ప్రాణానికి ఎటువంటి హాని కలిగించరని మాటివ్వాలి" అన్నాను.

సంతోషంతో తలూపాడు బాస్.

"అబ్బాయ్! నీ కా భయం అక్కర్లేదు. పని అయిన తర్వాత నీ దారిన నీవు స్వేచ్ఛగా పోవచ్చు" అంటూ డ్రాయరు సొరుగులోంచి చెక్ బుక్ తీసి సంతకం పెట్టి నాచేతి కిచ్చాడు బాస్.

ఆ చెక్కును జాగ్రత్తగా అందుకుని జేబులో వేసుకున్నాను. కాలింగ్ బెల్ నొక్కాడు బాస్.

డోరు తెరుచుకొని లోపలకు వచ్చాడు తుమ్మమొద్దు.

"నువ్వు ఇతనితోపాటు వెళ్ళి ఆ బ్రీఫ్‌కేసును తీసుకు రా" అన్నాడు బాస్.

అలాగే అన్నట్లు తలూపాడు తుమ్మమొద్దు

అతన్ని వెంటబెట్టుకుని బయటకు నడిచాను.

* * *

మర్నాడు ఉదయం పదిగంట లవుతుండగా పోలీసు కమీషనరు ఆఫీసుకు చేరుకున్నాను.

గతంలో వున్న బాధలు, వ్యధలు యిప్పుడు నాకులేవు. ఈ బోడి సబ్ యిన్‌స్పెక్టర్ ఉద్యోగం రాకపోయినా, నాకు వచ్చే నష్టమేమీలేదు జేబులో లక్షరూపాయలున్నాయి. ఆ చెక్కు విడిపించుకొని ఏదన్నామంచి వ్యాపారం చేసుకోవచ్చు.

ఇద్దరు, ముగ్గుర అభ్యర్థుల తర్వాత నన్ను పిలిచారు.

కాలరు సవరించుకుంటూ లేచి నిలబడ్డాను. ఠీవిగా అడుగులువేస్తూ తలుపులు త్రోసుకుని లోపలకు అడుగుపెట్టాను.

అంతే!!

మరుక్షణం పక్కలో బాంబు పేలినట్లు అదిరిపడ్డాను. ఎదురుగా పోలీసు కమిషనర్ హోదాలో తుమ్మమొద్దు, అతని పక్కనే వేరు వేరు హోదాలలో సన్నపాటి వ్యక్తి ఆ ప్రక్కనే స్వయంగా నాచేతికి లక్షరూపాయల చెక్కు నందించిన వారి బాస్.

"మిష్టర్ సూర్యం! ఈపాటికి అంతా అర్థమయ్యే వుంటుందనుకుంటాను. మీ ఇంటర్వ్యూ నిన్ననే అయిపోయింది. మీలాంటివారు యిలాంటి ఉద్యోగాలకు ..." అంటూ ఏదో చెప్పబోతున్నాడు పోలీసు కమిషనరు ఉరఫ్ తుమ్మమొద్దు.

ఆ తర్వాత మాటలు వింటానికి నేను స్పృహలో వుంటేనా కదా! □

క్రొత్త సీరియల్ ప్రారంభం!

కళింకావతారం

వసుంధర

జగపతిరావు మీసం దువ్వి తమాషాగా నవ్వి "మనం తల్చుకుంటే దేనికీ ఎదురులేదు" అన్నాడు.

"అవునండి మొన్న మీరు తల్చుకోకపట్టిగానీ సీనయ్యగాడు ఉరికంబ మెక్కాల్సింది కాదండి" అన్నాడు కల్య

రాజు.

"రాజూ నువ్వు నిజంగా శల్యుడివయ్యా!" అన్నాడు జగపతిరావు.

ఆయన లాగనడానికి కారణముంది.

సీనయ్య హత్యచేసిన మాట నిజం. వాడు హత్య చేసినట్లు తిరుగులేని సాక్ష్యాలుండడం నిజం వాడిని కేసులో నుంచి తప్పించడానికి జగపతిరావెన్నో ప్రయత్నాలు చేశాడు. ఒక్కటీ ఫలించలేదు.

"హత్య చేయడానికి వాడిని నేనే నియమించివుండవచ్చు. తనకు చేతకాకపోతే వాడు చేతకాదని చెప్పాల్సింది. ఒప్పుకున్నాక తెలివిగా చేయాల్సింది. రెండూ చేయలేదు వాడు. అన్నీ తెలిసినవాడిలా తలూపి అన్ని విధాలా దొరికిపోయేలా నేరం చేశాడు. అలాంటివాణ్ణి కాపాడ్డం ఆ బ్రహ్మదేవుడికి కూడా సాధ్యం కాదు" అన్నాడు జగపతి రావు తన అనుచరులతో.

శల్యరాజు అనుచరుడు కాదు. స్నేహితుడు వంటివాడు.

సీనయ్యను రక్షించుకోలేకపోయినందుకు జగపతిరావు ఎంతగానో బాధపడుతున్నాడని శల్యరాజుకు తెలుసు. ఎందుకంటే సీనయ్య మామూలు నేరస్థుడు. అతడు చంపినది - ఆ ఊరి ప్రముఖ రాజకీయవాదిని. సీనయ్య జగపతిరావు పేరు చెప్పివుంటే ఆ వ్యవహారంలో ఎందరి పేర్లో బయటకు వచ్చేవి. సీనయ్య ఎక్కడా ఎవరిపేరూ బయటపెట్టలేదు. మొత్తం నేరాన్ని తనమీద వేసుకున్నాడు. డబ్బుకోసం నేరం చేశానన్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో హత్య చేశానన్నాడు. చిరునవ్వుతో ఉరికంబ మెక్కాడు.

అటువంటి విశ్వాసపాత్రు లీ రోజుల్లో అరుదు. అందుకే జగపతిరావు సీనయ్య గురించి బాధపడకుండా వుండలేదు.

ఇది జరిగి కొంత కాలమయింది.

ఈ రోజు జగపతిరావు చాలా గొప్ప కార్యం సాధించాడు డిపార్టుమెంట్లో స్ట్రిక్టు అని పేరుబడ్డ పోలీసాఫీసరు చంద్రశేఖరాన్ని లొంగదీసుకుని తన మనిషిని చేసుకున్నాడు. చంద్రశేఖరం కాలేజీ రోజులకు సంబంధించిన ఓ వ్యక్తిగత రహస్యాన్నాయన సాధించాడు. దాంతో చంద్రశేఖరాన్ని సాధించాడు ఇంతకాలం ఆయన కార్యకలాపాల కో పెద్ద ప్రతిబంధకంగా వున్న చంద్రశేఖరం అడ్డు తీరిపోయింది. తన రహస్యాన్ని కాపాడుకొనడం కోసం చంద్రశేఖరం నీతిమార్గాన్ని వదిలిపెట్టాడు.

ఇప్పుడు జగపతిరావా విజయం ప్రసక్తి తీసుకుని వస్తే - శల్యరాజు సీనయ్య విషయం గుర్తుచేస్తున్నాడు.

"నేను శల్యుడినే మరి మీరు?" అన్నాడు శల్యరాజు.

"నేనెవరినైనా కర్ణుణ్ణి మాత్రం కాదు...."

"ఒక్కసారి చేయిలా పారేయండి ఇకమీదట మీ భవిష్యత్తుందో చెబుతాను" అన్నాడు శల్యరాజు.

శల్యరాజుకి హస్తసాముద్రికంలో ప్రావీణ్యముంది. అతడు చేయి చూపి ఎందరికో ఎన్నో విశేషాలు తేదీలతో సహా సరిగ్గా చెప్పాడు. జగపతిరావుకి అతడి సాముద్రిక విద్యపై మంచి గురివుంది. తక్షణం చేయి జాపాడాయన. శల్యరా జది అందుకుని పరీక్షగా చూపి "అరే!" అన్నాడు.

"ఏమయింది?" అన్నాడు జగపతిరావు కుతూహలంగా.

"చంద్రశేఖరం లొంగిపోగానే మీ భవిష్యత్తుకు పట్టిన పీడ విరగడై పోయిందనుకున్నాను. కానీ మీ కిప్పుడే గడ్డు సమస్య లెదురయేలా వున్నాయి. ముందు ముందు రోజాలు క్షణక్షణ గండంగా వుండవచ్చు" అన్నాడు శల్యరాజు.

"చంద్రశేఖరాన్ని లొంగదీశాను. ఇంకా నా కడ్డు నిలిచే వారెవ్వరు?"

"మీ అరచేతిలో కొత్తగా ఓ రేఖ పుట్టింది. అది తరంగాలుగా మీ భవిష్యత్తును కొండచిలువ చుట్టినట్లు చుట్టింది...."

"అంటే?"

"మీకు కష్టకాలం ప్రారంభమయింది" అన్నాడు శల్య రాజు.

"నువ్వు చెప్పేది నిజం కాదు...."

"నేను మీ చేతిలో చూపింది చెప్పాను. అది నిజం కాకపోతే మీకంటే నేనే ఎక్కువ సంతోషిస్తాను."

జగపతిరావు అనుమానంగా "ప్రమాద మెట్నుంచి వస్తుందో చెప్పగలవా?" అన్నాడు.

"చాలా కష్టం...."

"ప్రయత్నిస్తే చెప్పగలవు నువ్వు...."

"మనుషుల విషయంలో ప్రయత్నించగలను. కానీ మీకు రానున్న కష్టాలు మానవాతీత శక్తి వల్ల" అన్నాడు శల్యరాజు.

జగపతిరావు మీసం దువ్వి నవ్వి "నువ్వు నాతోనే వేళాకోళమాడుతున్నావు" అన్నాడు

"నేను మీతో వేళాకోళ మాడను. ఆ సంగతి మీకు తెలుసు" గంభీరంగా అన్నాడు శల్యరాజు.

జగపతిరావు ఏదో అనబోయాడు. సరిగ్గా అప్పుడే బల్ల

ప్రక్కనున్న ఫోను మ్రోగింది. ఆయన రిసీవర్ తీసి—
"హలో!" అన్నాడు.

అవతలనుంచి జగపతిరావు కొడుకు రంజన్ మాట్లాడాడు. క్యాషియర్ నందనరావు యాభై వేల రూపాయలు కాజేసే ప్రయత్నంలో వున్నాడుట.

"ఒకసారి మీరిద్దరూ యిక్కడికి రండి" అన్నాడు జగపతిరావు.

2

పదినిముషాల్లో రంజన్, నందనరావు అక్కడున్నారు. వస్తూనే నందనరావు జగపతిరావు కాళ్ళమీద పడిపోయి—
"అయ్యా! ఇందులో నాకేమీ తెలియదు. అబ్బాయిగారు నన్ననుమానిస్తున్నారు" అన్నాడు.

"నేను నిన్ను నమ్ముతున్నానులే—లే" అన్నాడు జగపతిరావు.

నందనరావు లేచి నిలబడ్డాడు. అతడింకా వణుకుతూనే వున్నాడు.

"అసలేం జరిగింది?" అన్నాడు జగపతిరావు మళ్ళీ.

నందనరావు అయిదేళ్ళుగా క్యాషియర్‌గా వారింట్లో పని చేస్తున్నాడు. ఒక్క పైసాకూడా తేడా రాకుండా ఎకౌంట్ వేస్తాడతడు.

జగపతిరావుకు చాలా వ్యవహారాలున్నాయి. బయటకు కనిపించేవి ఒక పంచదార మిల్లు, హార్డ్‌వేర్ షాపు కానీ ఆయన పెద్దరింగ్ లీడరని చాలామందికి తెలుసు. ఎవరూ పైకి అనరు.

ఎందరెందరో ఆయనింటికి వచ్చి డబ్బు తీసుకుని వెడుతూంటారు. అయితే ఎవరెవరికి ఎంత డబ్బివ్వాల్సిందీ

ముందుగానే నందనరావుకి తెలుస్తుంది. తన కస్టమర్సుకి జగపతిరావు టోకెన్సిస్తాడు. ఏ టోకెన్ కెంతివ్వాలో నందనరావుదగ్గర సమాచార మంటుంది. మనుషులతో నిమిత్తం లేకుండా టోకెన్ల ఆధారంగా పేమెంట్సు చేస్తూంటాడు నందనరావు. ఈరోజు ఇవ్వవలసిన మొత్తంకంటె యాభై వేలెక్కువిచ్చానని నందనరావంటాడు. అత డా డబ్బు కాజేశాడని రంజన్ అంటాడు.

"పొరపాటెలా జరిగింది?" అన్నాడు జగపతిరావు.

"ఒకరికి టోకెన్ లేకుండా డబ్బిచ్చాను...."

"ఎవరికి?"

"ఆయనపేరు నాకు తెలియదు కానీ యాభై వేలు పుచ్చుకునేందుకుండే కోడ్ వర్డ్ చెప్పాడు...." అన్నాడు నందనరావు.

"అబద్ధం డాడీ!" అన్నాడు రంజన్.

రంజన్ అలా అనడానికి అతడి కారణం అతడికుంది. అది అర్థం కావాలంటే ఆ యింట్లోని ఈ కోడ్ వర్డ్స్ పద్ధతి తెలుసుకోవాలి.

నలుగురికీ తెలిసి జగపతిరావుకున్నవి పంచదార మిల్లు, హార్డ్ వేర్ షాపు.

ఆయనకు నగరంలో జరిగే గోల్డు స్మగ్లింగు, మత్తుపదార్థాల రవాణా, వ్యభిచారం వగైరా అనేక కార్యకలాపాల్లో జోక్యం వుంది ఎన్నో హోటళ్ళలో వున్న నైట్ క్లబ్బులో జరిగే జూదం వెనుక ఆయన హస్తం వుంది అయితే ఎక్కడా డబ్బు డైరెక్టుగా చేతులు మారదు.

జగపతిరావు, రంజన్ కాక నగర ప్రముఖులు మరో పదిమంది వున్నారు. ఈ పన్నెండుగురి కార్యకలాపాలకూ డబ్బు జగపతిరావు క్యాషియర్ నందనరావు ద్వారా యివ్వ

బడుతుంది. ఇందుకు జగపతిరావు తిరుగులేని ఏర్పాటు చేశాడు.

ఆయన తన షాపులోనూ మిల్లులోనూకూడా అవసరానికి మించి పనివాళ్ళను పెట్టుకున్నాడు. వాళ్ళందరూ యించు మించు ఆయన ఇతగ కార్యకలాపాల్లో వున్నవాళ్ళే. ఆయన పొలంపనులు చూసేవాళ్ళుకూడా పల్లెటూళ్ళో యిరవై మంది దాకా వుంటారు. వాళ్ళూ ఈ కార్యకలాపాలన్నింట్లోనూ వుంటారు. వీళ్ళందరూ తరచుగా ఒకదాంట్లోంచి ఒక దాంట్లోకి మారుతూంటారు. ఎవరెవరెందులో పనిచేస్తున్నారన్నది చెప్పడం కష్టం. వీళ్ళందరికీ జీతాలివ్వడం జగపతి రావింట్లో నందనరావుద్వారా. వారికి టోకెన్నివ్వడం—ఫలానా టోకెన్‌కింతివ్వాలని నందనరావుకు కబురందించడం!

అంతవరకూ బాగానే వుంది. కానీ ఒకోసారి అనుకోకుండా వున్నపళంగా ఖర్చులొస్తుంటాయి. దొంగబంగారం కొనవచ్చు. జూదంలో ఇవ్వాల్సి రావచ్చు. ఏ ఆఫీసరుకో లంచమివ్వాల్సిరావచ్చు. అప్పుడు టోకెన్ యిచ్చి కబురు ముందుగా అందించడానికి కుదరదు. అందుకు కోడ్‌వర్డ్స్ పద్ధతి ప్రవేశపెట్టారు.

జగపతిరావు, రంజన్, నగర ప్రముఖులు—మొత్తం పన్నెండుగురికీ తలో కోడ్‌వర్డూ వుంటుంది. అదికూడా ప్రతిరోజూ మారిపోతూంటుంది. ప్రతిరోజూ ఉదయం ఆరింటికి పన్నెండుగురు పెద్దలనుంచీ వారి వారి కోడ్‌వర్డ్స్ ఏమిటో నందనరావుకు సమాచారం అందుతుంది. ఆరోజు నుంచి మర్నాడుదయం ఆరుగంటలవరకూ ఆయా వ్యక్తుల నుంచి వచ్చినవారు ఆయా వ్యక్తుల పేర్లుచెప్పి వారి కోడ్ వర్డ్స్ చెప్పగలిగితే వారడిగిన డబ్బివ్వబడుతుంది—టోకెన్

లేకుండానే!

ఆరోజు ఒక వ్యక్తి వచ్చి రంజన్‌నుంచి వచ్చాననీ, యాభై వేలు కావాలనీ అన్నాడు. అతడు కోడ్‌వర్డ్ చెప్పాడు. సరిపోయింది. నందనరావు యాభై వేలూ యిచ్చేశాడు. తర్వాత మరికాస్త క్యాష్‌కావాలని రంజన్‌కు కబురు పంపించాడు. రంజన్ స్వయంగా క్యాషు తీసుకుని వెళ్ళి నందనరావుకిచ్చి—"ఏమిటి విశేషం? ఈరోజు డబ్బు జోరుగా పంచినట్లున్నావు?" అన్నాడు.

"మీ మనిషికే యిచ్చాను యాభై వేలు" అన్నాడు నందనరావు.

అతడు చెప్పింది అర్థంచేసుకుందుకు రంజన్‌కి కాసేపు పట్టింది. అప్పుడతడికి కోపం వచ్చింది. అతడారోజెవరికీ డబ్బివ్వమని చెప్పలేదు.

ఇలా జరగడం ఇదే మొదటిసారి!

"నందనరావు ఈ పద్ధతిని దుర్వినియోగం చేశాడు—" అన్నాడు రంజన్.

"నాకేమీ తెలియదు" అని గోలపెడుతున్నాడు నందన రావు.

"నేను నందనరావును నమ్ముతాను" అన్నాడు జగపతి రావు.

"అయితే నమ్మనిదెవర్ని—నన్నా?" అన్నాడు రంజన్.

జగపతిరావు నవ్వి—"మోసంచేస్తే నా బిడ్డలే నన్ను మోసంచేయాలి. నా అనుచరులెవరూ నన్ను మోసం చేయ లేరు...." అని—"నేను నిన్నూ నమ్ముతున్నాను—" అన్నాడు.

రంజన్ ముఖం తెల్లబడింది—"ఇలా నమ్మకం పెట్టు కుంటే యికమీదట—డబ్బు ఈవిధంగానే మాయమవడం

ప్రారంభిస్తుంది...."

"మనకోసం సీనయ్య సంతోషంగా ప్రాణాలర్పించాడు. అదీ మన సంప్రదాయం" అన్నాడు జగపతిరావు.

"అందరూ సీనయ్యలా వుండరు."

"రంజన్! నువ్వనుమానించాల్సింది మనవాళ్ళను కాదు. ఇలాంటిదేదైనా జరిగినప్పుడు—అసలేం జరిగిందీ అవి ఆలోచించాలి. నిదానంగా విషయం తెలుసుకోవాలి. లేక పోతే కథ ఒక్కడుగు కూడా ముందుకు వెళ్ళదు" అని— "నందనరావ్! నీదగ్గర డబ్బు తీసుకున్న మనిషిని నువ్వు మళ్ళీ గుర్తుపట్టగలవా?" అన్నాడు జగపతిరావు.

నందనరావు ఉత్సాహంగా—"ఆఁ" అన్నాడు.

"అతణ్ణి నువ్విదివరకెప్పుడైనా చూశావా?" అన్నాడాయన.

"చూసినట్లే వుందండి" అన్నాడు నందనరావు సాలోచనగా.

"బాగా ఆలోచించి చెప్పు ..."

నందనరావు ఆలోచించి—"ఆఁ గుర్తుకు వచ్చిందండి. మీరొకసారి మీ పాత స్నేహితుల ఫోటోలు చూపించారు. అందులో వున్నారాయన" అన్నాడు.

"నా స్నేహితుడా — నన్ను మోసం చేయడమా?" అన్నాడు జగపతిరావు ఆశ్చర్యంగా —"బాగా ఆలోచించుకుని చెప్పు."

"ఆయన ముఖం నా కళ్ళముందే మెదుల్తోందండి. చూడ్డానికి ముప్ఫై ఏళ్ళవాడిలాగున్నాడు. చూడగానే దణ్ణం పెట్టాలనిపిస్తుందండి. ముఖం నవ్వుతూ వుంటుంది. మనిషి అందంగా నాజూగ్గా సినిమా హీరోలా వుంటాడు. వయసెక్కువే వుంటుందనీ చిన్నవాడిలా కనబడుతున్నాడనీ

అనిపిస్తుంది. మీరొక్కసారి ఫోటోలు చూపిస్తే గుర్తు పడతాను" అన్నాడు నందనరావు.

"డాడీ—వీడిని నమ్మొద్దు. నీకూ నీ స్నేహితులకూ మధ్య శత్రుత్వం తీసుకొస్తాడు. తను కొట్టేసిన యాభై వేలూ నీ స్నేహితుడెవరో తీసుకున్నాడంటాడు. తనకు తోచిన ఫోటోను చూపిస్తాడు" అన్నాడు రంజన్.

జగపతిరావు కొడుకువంక కోపంగా చూపి—"రంజన్ నందనరావు మన క్యాషియర్. వయసులో పెద్దయినా నేనే అతణ్ణి వాడనను. నువ్వేమో ముందు మన మనుషుల్ని గౌరవించడం నేర్చుకోవాలి" అన్నాడు తీవ్రంగా.

నందనరావు వెంటనే—"మీ కుటుంబంలో అంతా నాకు పూజ్యులు. పెద్దలు. యెవరేమన్నా నాకు తప్పులేదు. నన్ను మానించకుండా వుంటే చాలు" అన్నాడు.

"నక్కవినయాలు" అని తనలోతనే గొణుక్కున్నాడు రంజన్.

"ఉండు—ఫొటోలు తెప్పిస్తాను" అన్నాడు జగపతిరావు. ఓ పావుగంటలో ఫొటోలొచ్చాయి. ఆయన కొన్ని ఫొటోలు చూపగానే—

"అయ్యో! వీరందరూ తమ యిప్పటి స్నేహితులు. ఆయన మీ పాత స్నేహితుడు" అన్నాడు నందనరావు.

జగపతిరావు పాత ఫొటోలు కొన్ని చూపించాడు. నందనరావు చటుక్కున ఓ ఫొటోనుతీసి "ఈయనే .... ఈయనే" అన్నాడు.

రంజన్ ఆశ్చర్యంగా ఆ ఫొటోవంక చూశాడు. ఆ ఫొటో పాతదైనా జీవకళ నింపుకుని వుంది. అచ్చం నందనరావు వర్ణించినట్లే వుంది.

"వీడా?" అన్నాడు జగపతిరావు చటుక్కున.

"అవును – ఈయనే!" అన్నాడు నందనరావు.

"బాగా ఆలోచించుకుని చెప్పు."

"ఆలోచన అవసరంలేదు. ఈ మనిషిని నిద్రలోలేపి అడిగినా గుర్తుపట్టగలను. ఈయనకే నేను యాభై వేలూ యిచ్చాను" అన్నాడు నందనరావు.

"అసంభవం!" అన్నాడు జగపతిరావు కోపంగా— "ఇంతసేపూ నిన్ను నమ్మాను. ఇంక నేనూ నిన్ననుమానించాల్సి వస్తుంది."

నందనరావు భయంగా—"మీ మనసు నొప్పించే నిజం చెబితే అది నా దురదృష్టం. కానీ నన్ననుమానించవద్దు" అన్నాడు.

"ఈ ఫొటోలోని మనిషెవరో నీకు తెలుసా?"

"పేరు నాకు తెలియదు. కానీ మనిషిని చూశాను...."

"రంజన్—వీణ్ణి రెడ్ సెల్‌కి తీసుకొని వెళ్ళు...." అన్నాడు జగపతిరావు. ఆవేశంతో ఆయన గొంతు వణికింది.

అప్పుడు రంజన్ ముఖం వికసించింది—"డాడీ! నేను చెప్పినప్పుడే వీడి విషయం నమ్మాల్సింది. మీకు మీ స్నేహితుల మీదున్న నమ్మకం నామీద లేకపోయింది."

"వీడి ననుమానించడానికి కారణం నాకు నా స్నేహితుడి మీదున్న నమ్మకం కాదు. అతి తెలివితో వీడు పప్పులో కాలేశాడు. వీడు చూపించిన ఫొటోలోని మనిషి జీవించి లేడు. అతడు ఆత్మహత్య చేసుకుని చనిపోయి సుమారు పదిసంవత్సరాలవుతుంది."

నందనరావు తెల్లబోయి—"కానీ నిజంగా నే నాయన్ను చూశాను నేనబద్ధం చెప్పడంలేదు" అన్నాడు.

"అవన్నీ రెడ్ సెల్‌లో తేలతాయి."

అంతవరకూ మౌనంగా వున్న శల్యరాజు అప్పుడు కలగజేసుకుని—"అయ్యో! మనిషిని పోలిన మనుషులుండ వచ్చు. నందనరావు నిజమే చెబుతున్నాడని నా అనుమానం" అన్నాడు.

"నరసింహం తలిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. అతడి భార్య, ఏకైక పుత్రుడు ఏదో ప్రమాదంలో మరణిం చారని—జీవితమంటే విరక్తిచెంది ఆత్మహత్య చేసు కున్నాడు. అతడు నాకు బాగా కావలసినవాడు. అతడి గురించి నాకు తెలిసినట్లుగా యింకెవరికీ తెలియదు. ఈ నందనరావు కేదో మూడింది."

శల్యరాజు ఆలోచిస్తూ—"ఆ వచ్చిన మనిషి మీ స్నేహి తుడి బంధువుకావాలనేముంది? ఏ బంధుత్వమూ లేకుండా ఒకరినిపోలి ఒకరున్నవారెందరో వుంటారు' అన్నాడు.

"ఒకవేళ అదే జరిగిందనుకున్నా అతడికి కోడ్ వర్డ్ ఎలా తెలిసింది? ఇది తప్పకుండా నందనరావు పన్నాగమే!" అన్నాడు జగపతిరావు.

నందనరావు గుడ్లు తేలేసి జగపతిరావు వంక భయం భయంగా చూస్తున్నాడు.

శల్యరాజుకూడా — "మీరు చెప్పిందాంట్లో పాయింటు వుంది" అని—"నందనరావ్! వ్యవహారాన్ని రెడ్ సెల్ దాకా లాగకు. నిజంచెప్పు" అన్నాడు.

నందనరావు మాట్లాడలేదు. అతడికి మాట రావడం లేదు

రెడ్ సెల్ గురించి అతడికి తెలుసు.

జగపతిరావు అనుచరుల నమ్మకాన్ని పరీక్షించడానికి రెడ్ సెల్‌కు తీసుకుని వెళ్ళడం జరుగుతుంది. అందులోనికి వెళ్ళినవారందరూ తిరిగి రారు.

"అయిదు నిముషాలు టైమిస్తున్నాను" అన్నాడు జగపతిరావు.

నందనరావు నెమ్మదిగా తేరుకున్నాడు. వంగి జగపతిరావు పాదాలకు నమస్కరించి లేచాడు.

"నేను మిమ్మల్నే నమ్ముకున్నాను. మీరు నన్ను మావించారు. నేను నిజం చెబుతున్నాను. మీరు నమ్మడం లేదు. మిమ్మల్ని నమ్మించడంకోసం నేనేమైనా చేస్తాను. రెడ్ సెల్‌లోకి వెళ్ళడానికికూడా నేను సిద్ధమే! కానీ వెళ్ళే ముందు నాదో చిన్న కోరిక."

"ఏమిటది?"

"ఒక్కసారి నా భార్యాబిడ్డలను కలుసుకుని మాట్లాడాలి. మాకు లేక లేక పట్టాడో అబ్బాయి. వాడి పుట్టినరోజు సరిగా నాలుగురోజుల్లో వుంది. మీ ఆశీర్వాదంతో వీలైనంత ఘనంగా చేయాలనుకున్నాను. దానిగురించి నేనూ, నా భార్యా—యిద్దరం ఎన్నో చర్చలు చేశాం. ఇప్పుడు నే నా పుట్టినరోజు వరకూ వుంటానో వుండనో తెలియదు.... ఒక్కసారి వాళ్ళను చూస్తాను" దీనంగా అన్నాడు నందనరావు.

"యాభై వేలతో వాళ్ళ జీవితం వెళ్ళిపోతుందనుకుంటున్నావా?" అన్నాడు రంజన్ వెటకారంగా.

"వాళ్ళతోపాటు నా జీవితమూ కలిపి వుండాలన్నది నా కోరిక. యాభై వేల కోసం నా జీవితం పాడుచేసుకుంటానా?" అన్నాడు నందనరావు.

"ఒక్కసారిగా పెద్ద మొత్తం తీశావు కాబట్టి యిప్పుడు దొరికిపోయావుగానీ చిన్నచిన్న మొత్తాలీపాటికి చాలా కూడబెట్టి వుంటావు" అన్నాడు రంజన్.

"రంజన్ — వాడితో కబుర్లొద్దు. ఇంటికి వెళ్ళొస్తా

నన్నాడు కదా వెళ్ళిరానీ" అన్నాడు జగపతిరావు.

రంజన్ మాట్లాడలేదు.

నందనరావు జగపతిరావుకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

అప్పుడు జగపతిరావు రంజన్‌తో — "నందనరావు విషయం తేలేదాకా స్టాప్‌గాప్ ఎరేంజ్‌మెంట్ చూడు. కోడ్‌వర్డ్స్‌లో మాత్రం నువ్వే డీల్ చేయి" అన్నాడు.

రంజన్ కూడా వెళ్ళిపోయాడు.

"నందనరావు మోసగాడే అని మీరు భావించినట్లయితే అతణ్ణింటిదాకా పంపించాల్సింది కాదు. తిరిగి రాడేమో!" అన్నాడు శల్యరాజు.

"అలా జరగడానికి వీల్లేదు. మొత్తం వ్యవహారమంతా అయోమయంగా తయారయింది" అన్నాడు జగపతిరావు.

"అలాంటప్పుడు నందనరావును వదిలిపెట్టాల్సింది కాదు."

"నందనరావు చాలా ఏళ్ళుగా నా దగ్గర నమ్మకంగా పని చేస్తున్నాడు. ఆఖరుసారిగా భార్యాబిడ్డలను చూసుకునే అవకాశ మివ్వడం నా కనీస ధర్మం...." అన్నాడు జగపతిరావు గంభీరంగా.

"ఆఖరుసారిగా అంటే?"

"నందనరావు రెడ్ సెల్ నించి తిరిగిరాడు."

"ఆ విషయం ముందే మీకెలా తెలుసు?"

"నందనరావులో మొండితనం కనబడుతోంది. రెడ్ సెల్ గురించి కొంతయినా వాడికి తెలుసు. వాడన్నింటికీ సిద్ధపడే వున్నాడు. అలాంటివాడికి చావు తప్పదు."

శల్యరాజు జాలిగా "మరి అతడి భార్యాబిడ్డల గతేమవు

తుంది?" అన్నాడు.

"రెడ్ సెల్‌లో నందనరావు కొద్దిరోజులవస్థపడవచ్చు. కానీ అతడికి వారసులైన నేరానికి వాళ్ళు నాచేత జీవితాంతం వేటాడబడతారు."

"ఈ విషయం నందనరావుకు తెలుసా? అతగాడు తను పోయినా తన వాళ్ళు సుఖంగా వుంటారనుకుంటున్నాడేమో!" అన్నాడు శల్యరాజు.

"రెడ్ సెల్‌లో అతడికి భార్యాబిడ్డల భవిష్యత్తు వివరంగా చెప్పబడుతుంది" అన్నాడు జగపతిరావు.

3

"ఈ రోజు పెందరాళే వచ్చేశారు" అంది చంప. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. నందనరావా మెరుపును గమనించలేదు. అసలతడామె వంకే చూడలేదు.

"బాబేడీ?" అన్నాడు నందనరావు.

"నిద్రపోతున్నాడు."

"ఒక్కసారి వాణ్ని తీసుకురా" అంటూ కుర్చీలో కూలబడ్డాడతడు.

"ఇప్పుడు వాణ్ని లేపను. ఏం తిక్క వచ్చిందో ఏమో - చాలాసేపు ఏడ్చి ఏడ్చి పడుకున్నాడు" అంది చంప.

"నాకు కాసేపు వాడితో ఆడుకోవాలనుంది."

"కాసేపుంటే వాడే లేస్తాడు లెండి."

"ఆ కాసేపూ నేనుండాలికదా?"

చంప అదోలా అతడి వంక చూసి "ఏమిటా పిచ్చి మాటలు?" అంది.

"అర్జంటు పనిమీద వెడుతున్నాను. తిరిగి ఎప్పుడొస్తానో నాకు తెలియదు" అన్నాడు నందనరావు.

"అలాగంటారేమిటి? బాబు పుట్టినరోజు సంగతి మర్చిపోయారా?"

"లేదు-కానీ-అది నేను లేకుండానే జరుగుతుంది."

"బాగుంది.... ఇది వాడి మొదటి పుట్టినరోజు. మీరు లేకుండా ఎలా జరుగుతుంది?"

"అది నా చేతుల్లో లేదు."

చంప ఆవేశంగా—"అయితే నేను స్వయంగా జగపతి రావుగారిని కలుసుకుని మాట్లాడి మీ ప్రయాణం ఆపిస్తాను. ఆయనంటే మీకంత భయ మెందుకు? మీరు కణుగూ మిణుగూ మాట్లాడక గానీ ఆయన చెబితే అర్థం చేసుకునే మనిషే!"

నందనరావు క్షణం ఆలోచించి—"పోనీ ఓ పని చేద్దామా! మనమంతా కలిపి రహస్యంగా ఏ ఊరైనా వెళ్ళిపోదాం. బాబు పుట్టినరోజయ్యాక తిరిగొద్దాం. అనుకోకుండా టెలిగ్రాం వచ్చిందని చెప్పొచ్చు" అన్నాడు.

"అలాంటి అబద్ధాలు మనకు అచ్చిరావు. కొడుకు పుట్టినరోజు చేసుకోవడానికిక్కడ్నించి పారిపోవడ మెందుకు? ఆ రోజున జగపతిరావుగారే స్వయంగా మన బాబు నాశీర్వదించాలి" అంది చంప.

"అయితే సరే-నేనే ఆయనతో మాట్లాడతానులే...." అన్నాడు నందనరావు.

"మాట్లాడండి. ఆయన తప్పక ఒప్పుకుంటాడు" అంది చంప.

నందనరావు ఆలోచనలో వుండగా "ఏమండీ ఇందాకా మనింటి కొకాయన వచ్చాడు. మనిషి చూడ్డానికి కుర్రాడి లాగే వున్నాడు. మీకంటే కాస్త పెద్దుంటాడేమో అంతే! మన బాబునోసారి ఎత్తుకుందుకు తీసుకున్నాడు. వాడాయన

దగ్గర ఒకటే గింజుకున్నాడు. అలా గింజుకుంటావేంరా - నేను నీ తాతను - అంటూ ఆయన వాడ్ని ముద్దులాడాడు. మన బాబుకు అస్సలు క్రొత్త లేదనుకుంటాం ... కానీ ఆయన దగ్గర మాత్రం ఒకటే ఏడుపు" అని "ఆయన వెళ్లేక కూడా చాలాసేపు ఏడ్చాడు" అంది చంప.

"ఎవరో ఆ కుర్ర తాత...." అన్నాడు నందనరావు సాలోచనగా.

"ఏమో_కానీ నే నెప్పుడూ ఇదివరలో చూడలేదు."

"ఎలా ఉంటాడు?"

చంప వర్ణించింది.

"నల్లపాంటు వేసుకున్నాడా?" అన్నాడు నందనరావు ఆత్రుతగా.

"ఊఁ"

"దానిమీద తెల్లచొక్కా_ఇన్‌షర్ట్ చేశాడా?"

"అవును_మీకెలా తెలుసు?"

"ఆయనే_నా కొంప ముంచాడు...." అని_"అవునూ_ ఆయన మనింటి కెందు కొచ్చాట్ట?" అన్నాడు నందనరావు.

"ఓసారి బాబును చూడాలనిపించిందిట. మళ్ళీ మళ్ళీ వస్తూంటానని చెప్పాడు. చాలా అభిమానంగా కుశల ప్రశ్నలు వేశాడు. ఏ ఇబ్బందొచ్చినా తనకు చెప్పుకో మన్నాడు."

"ఆయ నెవరో, అడ్రసేమిటో కనుక్కున్నావా ....?" ఆత్రుతగా అడిగాడతను.

"లేదు."

"ఎందుకని?"

"ఎందుకేమిటి? ఆయనెవడో మనకు తెలియదుకదా!"

"అయితే మాత్రం ఏ యిబ్బందొచ్చినా తనకు చెప్పుకో

మన్నాడు కదా!"

"అంటే మాత్రం-ముక్కు మొహం తెలియని వాడొచ్చి కావలసినవాడిలా మాట్లాడుతూంటే మీరెవరూ అనడగడానికి మొహమాటం వేయదూ?" అంది చంప.

"నే నిప్పుడు నిజంగా యిబ్బందిలో పడ్డాను. ఆయన దగ్గరకు వెళ్ళాలి."

"మీ కిబ్బందులొస్తే తీర్చడానికి జగపతిరావుగారు న్నారు. ఆయ నెవడో మన కెందుకు?"

"నువ్వొ త్త ఫూల్‌వి ..." అన్నాడు నందనరావు కోపంగా.

చంప కళ్ళలో నీళ్ళు తిరిగాయి—"ఎప్పుడూ మీరు నన్నింతమాటనలేదు. గుర్తుంచుకుంటాన్లెండి" అంది.

నందనరావు తన్నుతాను తమాయించుకుని—"అయాం సారీ చంపా! నిజానికి ఫూల్ని నేను. నా తప్పుకు నిన్ను నిందించాను. నువ్వు నా అదృష్టదేవతవు. నన్ను కాపాడితే నీ అదృష్టమే కాపాడాలి. పద—ఒక్కసారి బాబును చూద్దాం...." అన్నాడు.

భర్త విపరీతధోరణి అర్థం కాకపోయినా అతడి ననుసరించింది చంప. ఇద్దరూ పడకగదికి వెళ్లారు.

మంచంమీద రబ్బరు గుడ్డ—దానిమీద నోట్లో బొటనవ్రేలు వేసుకుని నిద్రపోతున్నాడు బాబు. నందనరావు ఆప్యాయంగా వాడిమీద చేయివేసి ఉలిక్కిపడి—"ఇదేమిటీ వీడి వళ్ళు కాలిపోతోందీ" అన్నాడు.

చంప కూడా బాబు వళ్ళుచూసి—"అవునండీ—ఇందాకా లేదు. ఇప్పుడే జ్వరం వచ్చింది. ఆ వచ్చి వెళ్ళినాయన బాబు అందాన్ని తెగమెచ్చుకున్నాడు. ఆయనవి దిష్టి కళ్ళనుకుంటాను" అంది కంగారుగా.

"ఉండు—నేను వెళ్ళి డాక్టర్ని పిల్చుకునివస్తాను...." అంటూ నందనరావు ఇంట్లోంచి బయటకు వచ్చాడు.

సరిగ్గా అప్పుడే అక్కడ కారొకటి ఆగింది. అందు లోంచి ఓ యువకుడు దిగాడు. అతడిని నందనరావంతకు ముందెన్నడూ చూడలేదు

"నందనరావుగారు మీరే కదూ?" అన్నాడా యువకుడు.

"అవును."

"అయితే కారెక్కండి?"

"ఎందుకు?"

"తర్వాత చెబుతాను...."

"నే నిప్పుడు అర్జంటుగా డాక్టరు దగ్గరకు వెడుతు న్నాను. మా బాబుకు వళ్ళుతెలియని జ్వరం...." అన్నాడు నందనరావు.

"అర్జంటుగా అంటున్నారు గదా—పోనీ కార్లోనే డాక్టరు దగ్గరికి వెడదాం. తర్వాతే మా పని...." అన్నా డా యువకుడు. నందనరావు కారెక్కాడు.

ఈలోగా చంప కూడా బయటకు వచ్చింది. భర్త కారెక్కడం చూపి "డాక్టరు దగ్గరకు కార్లో వెడు తున్నారా?" అంది.

"ఊఁ ఇప్పుడే వచ్చేస్తాను...." అన్నాడు నందనరావు. చంప చేయి ఊపింది.

ఆ యువకుడు కారు స్టార్టుచేశాడు. కారు సందులోంచీ రోడ్డుమీదకు వచ్చింది. నందనరా వా యువకుడితో—"కుడి పక్కకు పోనివ్వండి" అన్నాడు.

కారు ఎడమ పక్కకు తిరిగింది.

"అరె—మా డాక్టరుండే దిటువైపుకాదు— అటు" అన్నాడు నందనరావు కంగారుగా.

"నేను మిమ్మల్ని మా డాక్టరువద్దకు తీసుకుని వెడతాను...." అన్నాడా యువకుడు శాంతంగా.

"ఎవరు మీ డాక్టరు?"

"ఆయన పేరు నాకు తెలియదు" అన్నాడా యువకుడు.

"పోనీ—ఎక్కడుంటారు?"

"రెడ్ సెల్‌లో!"

కారు వేగం పుంజుకుంది.

4

డాక్టర్ జయరాజా ఊళ్లో పేరుపొందిన సైంటిస్టు. ఎలక్ట్రానిక్స్ పుంజుకున్నాక ఆయన పేరు మరింత పెరిగింది. అటు వ్యాపారస్థులకూ, ఇటు నేరపరిశోధనశాఖకూ తన శాస్త్రవిజ్ఞానంతో ఆయన ఎన్నోవిధాల తోడ్పడుతున్నాడు.

ఊరుకు దూరంగా వుంటుందాయన బంగళా. అయినా ఎప్పుడూ వచ్చేపోయేవాళ్ళుంటూనే వుంటారు.

జయరాజుకు ఏకాంతమంటే యిష్టం. అందుకే ఆయన నలుగురు అసిస్టెంట్సును నియమించాడు. ఇద్దరు యువకులు, ఇద్దరు యువతులు. ప్రకాష్, సూర్యం, గోమతి, స్వప్న—వాళ్ళ పేర్లు. నలుగురూ చురుకైనవాళ్ళు. ఆకర్షణీయంగా కనబడతారు. సైన్సంటే ప్రాణం పెడతారు.

ఇంటికి వచ్చిన వాళ్ళతో ఎక్కువగా ఈ నలుగురే మాట్లాడతారు. ఈ నలుగురినీ మించి ఇంకా ఏమైనా మాట్లాడాలంటే సత్యేంద్రకుమార్ ఉన్నాడు.

సత్యేంద్రకుమార్‌కు ఆ బంగళాలో జయరాజు తర్వాత ఆయనంతటి స్థానం ఉంది. జయరాజ్ కుమార్తె శ్వేత అమెరికాలో చదువుకుంటోంది. ఆమె తిరిగి రాగానే సత్యేంద్రకుమార్‌ని పెళ్ళిచేసుకుంటుందని అంతా అనుకుం

టున్నారు.

జయరాజ్ భార్య చంద్రమతి ఆమె ఆరోగ్యం మంచిది కాదు. ఎప్పుడూ మంచంమీదనే ఉంటుంది మంచంమీద ఆమెను చూసినవారెవ్వరూ ఆమె జబ్బులో వుందనుకోరు. ఆమె ముఖం కళగానూ, అందంగానూ వుంటుంది. ఆమె జబ్బు నిజమో, ఆమె మన స్తత్వమే అంతేనో తెలియదు. కానీ జయరాజ్ జీవితం సైన్సుకు అంకితం కావడాని కామెకూడా ఒక ముఖ్యకారణమని అంతా అనుకుంటారు.

జయరాజ్‌కు భార్యంటే ప్రేమ ఉంది. కానీ ఆమెవల్ల సుఖంలేదు.

ఒక సామాన్య గృహిణిగా ఆమె తన విద్యుక్త ధర్మాన్నెన్నడూ నిర్వహించలేదు. అందుకు జయరాజామెను తప్పు పట్టలేదు. ఆయన ఆమెను పల్లెత్తుమాటనగా ఎవరూ ఎరుగరు.

మొదట్లో జయరాజామెను చాలామంది డాక్టర్లకు చూపించాడు. ఎవరూ ఆమె జబ్బేమిటో కనుక్కోలేక పోయారు. లేడీ డాక్టర్ మాల ఆమె జబ్బేమిటో కనుక్కుంది. మాల చెప్పిన ప్రకారం చంద్రమతికి జబ్బేమీ లేదు. తనకేదో జబ్బున్నదనుకోవడమే ఆమెకున్న జబ్బు. అది మానసికం. జబ్బు లేదంటే ఆమె ఒప్పుకోదు. ఆమెకేదో ఒక మందివ్వాలి. అప్పుడే ఆమె జబ్బు తగ్గుతుంది.

చంద్రమతి భాగ్యవంతుల బిడ్డ. లక్షరూపాయల కట్నంతో జయరాజ్‌కు భార్యగా వచ్చింది.

చంద్రమతికి చిన్నప్పట్నించీ రోగాల వెర్రివుంది. కానీ యింట్లో తండ్రి ఆమెకు మందులిచ్చేవాడుకాదు. ఆయన ప్రకృతి వైద్యాన్ని నమ్మినవాడు. ఆమె కేజబ్బు చేసినా

కాయగూరలు, పళ్ళు ఉపయోగించేవారు. చంద్రమతి తగ్గ లేదని అబద్ధమాడితే లాయర్లా క్రాస్‌పరీక్షలుచేసి ఆమె అబద్ధాల్ని బయటపెట్టేవాడు. అందువల్ల తన జబ్బు గురించి తండ్రికి చెప్పుకునేందుకు చంద్రమతికి భయంగా ఉండేది. అసలే ఆమెకు తండ్రిదగ్గర చనువు తక్కువ.

ఆమెకు టెంపరేచర్ తరచుగా చూసుకోవాలనీ, తరచు డాక్టరు స్టెతాస్కోపుతో తన్ను పరీక్షించాలనీ, తను చాలా ఎక్కువ మందులు వేసుకుంటూండాలనీ, అందరూ తరచుగా తనను ఆరోగ్యం గురించి అడుగుతూండాలనీ కోరిక.

జయరాజ్‌కు భార్య అయ్యాక ఆమె తన కోరిక తీర్చుకుంటోంది.

డాక్టర్ మాల సలహా ప్రకారం చంద్రమతికి జబ్బు లేదన్న విషయం చెప్పకూడదు. ఎప్పుడూ భర్త ఆమె ఆరోగ్యం గురించి కలవరపడాలి.

"అట్టే ప్రమాదంలేని టానిక్కులాంటి మందులు నేనామె కిస్తూంటాను. మీరవి వేళతప్పకుండా వాడుతూండండి" అని మాల జయరాజ్‌కు చెప్పింది.

ఆ మందులు వేళతప్పి వాడినా ప్రమాదంలేదు. కానీ చంద్రమతి మానసిక తృప్తికోసం ఆయనలా చేయక తప్పదు.

ఇది ఒకరోజు వ్యవహారంకాదు. అలాగే సంసారం చేస్తూ ఆమె ఇద్దరు పిల్లల్ని కంది పెద్దకొడుకు ఆనంద్ కెనడాలో మెటలర్జికల్ ఇంజనీరు. ఆనంద్ చెల్లెలు శ్వేత అమెరికాలో చదువుకుంటోంది.

జయరాజ్ తన కాలాన్ని భార్యను సేవించడంలోనూ, లాబొరేటరీ ప్రయోగాలలోనూ వినియోగిస్తాడు. ఇంట్లోనే

ఆయనకు ప్రత్యేకమైన ప్రయోగశాలవుంది. అది అధునాతన పరికరాలతో కళ్ళకు మిరుమిట్లుగొలపుతూంటుంది. ఆ ప్రయోగశాలలోనే ఆయన శాస్త్రపరిశోధనలతోపాటు రాస లీలలు కూడా కొనసాగిస్తాడని కొందరు చెప్పుకుంటారు. సమాజంలో ఆయనకున్న గౌరవస్థానంవల్ల ఆ విషయానికి మరీ ఎక్కువ ప్రచారంలేదు.

తన ఎలక్ట్రానిక్ పరికరాలతో జయరాజ్ ఎందరి సమస్య లనో పరిష్కరించాడు. అందువల్ల తన పరిశోధన ఆయనకు వ్యాపార సాధనంగా కూడా వుంటోంది.

ఆ రోజు డాక్టర్ జయరాజ్ చిరాగ్గా వున్నాడు. లాబొ రేటరీనుంచి గోమతికి ఫోన్ చేసి "సత్యేంద్ర వచ్చేడా?" అనడిగాడు.

"లేదు డాక్టర్!"

"రాగానే అర్జంటుగా నా దగ్గరకుపంపు...."

"ఎస్ డాక్టర్!"

జయరాజ్ ఫోన్ పెట్టేశాడు.

సత్యేంద్రకుమార్‌తో ఆయనకు అర్జెంటుపనివుంది. ఇద్దరూ కలిపి ప్రారంభించిన ఓ కొత్తస్కీము ఆపరేషన్ టైములో అతడు చెప్పా చెయ్యకుండా మాయమయ్యాడు. అతడి యిల్లు తాళంవేసివుంది. రెండురోజుల్నించీ ఆ తాళం అలాగే తీయకుండా వుందని వాకబుచేయగా తెలిసింది. మధ్యలో ఒకసారి మాత్రం కాబోలు సూర్యానికి ఫోన్ వచ్చింది. "అర్జంటుపనిమీద ఎక్కడికో వెడుతున్నాను. తిరిగి వచ్చేక అన్నీ వివరంగా చెబుతానని జయరాజ్‌గారికి చెప్పు...." అన్నాడతడు ఫోన్లో.

"వెళ్ళేముందు నాకొక్కసారి చెప్పవలసింది" అను కున్నాడు జయరాజ్.

రోజులు గడుస్తున్నాయి. సత్యేంద్రకుమార్ రావడం లేదు.

జయరాజ్‌కు చిరాకు పెరిగిపోతోంది. "ఇక లాభంలేదు. మొత్తంవ్యవహారమంతా నేనొక్కడినే స్వయంగా నడపాలి" అనుకున్నాడాయన. అనుకొంటూనే కుర్చీలోంచి లేచాడు. లాబొరేటరీలోని ఒక ఆల్మరాదగ్గరకు వెళ్ళాడు. జేబులోంచి తాళంచెవి తీసి ఆల్మిరా తలుపులు తెరిచాడు. అందులో మధ్య అరలోంచి ఓ ఫైలు తీశాడు అది ఎర్రకవరున్న ఫైలు ఫైలుమీద "నరసింహావతారం" అని వ్రాసివుంది.

జయరాజ్ ఆ ఫైలు తీసుకుని ఆల్మిరా తలుపులు మూసి మళ్ళీవెళ్ళి ఓ కుర్చీలో కూర్చున్నాడు ఫైలు తెరిచి శ్రద్ధగా చదవనారంభించాడు.

క్రమంగా జయరాజ్ కళ్ళు ఎర్రబడ్డాయి. ఎవరైనా అప్పుడాయన ముఖంచూస్తే సాక్షాత్తూ ఆ నరసింహుడే అవతరించాడా అనుకుంటారు.

5

అది ఒకగది. గది తలుపులకు ఎర్రటిరంగు.

"ఇదే రెడ్ సెల్!" అన్నాడు రంజన్.

"మా బాబుకు వైద్యం జరిగితే నేను సంతోషంగా యిందులో అడుగుపెట్టగలిగి వుండేవాణ్ణి" అన్నాడు నందన రావు.

"జీవితమన్నాక ఎన్నో సమస్యలుంటాయి. మనిషికి సమస్యలేని క్షణమంటూ వుండదు. నువ్వు నీ వాళ్ళను చూడాలనుకున్నావు. అందుకు గడువిచ్చాం. ఆ గడువు ప్రకారం నువ్వెలాగూ రావని తెలుసు. అందుకే మనిషిని పంపించి రప్పించాను నీకు సంతోషంగావున్నా, దుఃఖంగా వున్నా ఈ రెడ్ సెల్‌లో అడుగుపెట్టక తప్పదు...."

అన్నాడు రంజన్.

"తప్పకుండా లోపలకు వెడతాను. నా బాబుకు వైద్యం జరుగుతుందని మాటివ్వు...." అన్నాడు నందనరావు.

"నీ బాబుకేం—నీ భార్యకూ జరుగుతుంది వైద్యం" అన్నాడు రంజన్.

నందనరావు కళ్ళు ఎర్రబడ్డాయి. "మిస్టర్ రంజన్! నా వాళ్ళకేమైనా జరిగిందో నేను చచ్చినా దెయ్యమై తిరిగివచ్చి పగ తీర్చుకుంటాను" అన్నాడు.

రంజన్ నిర్లక్ష్యంగా నవ్వి "ఐ లైక్ ఛాలెంజెస్" అన్నాడు. అంటూనే గదిముందర బటన్ నొక్కాడు.

వెంటనే రెడ్ సెల్ తలుపులు తెరుచుకున్నాయి. అందు లోంచి ఇద్దరు మనుషులు వచ్చారు. ఇద్దరూ పూర్తి ఎరుపు రంగు దుస్తుల్లోవున్నారు ముఖానికి కూడా ఎర్రటి ముసుగు లున్నాయి. ఇద్దరూ కళ్ళజోళ్ళు ధరించారు.

"ఆ కళ్ళజోళ్ళు లేకుండా లోపల నరకం చూస్తావు. వెళ్ళు...." అన్నాడు రంజన్. వెనువెంటనే ఎర్ర దుస్తుల మనుషులిద్దరూ నందనరావును చెరోరెక్కా పట్టుకుని లోపలకు తీసుకుని వెళ్ళారు. వారి వెనుకనే తలుపులు మూసుకున్నాయి.

నందనరావు దేవుడిమీదనే భారంవేసి కళ్ళు మూసు కున్నాడు.

"ఏయ్ కళ్ళు తెరు!" అన్నాడోమనిషి.

నందనరావు కళ్ళు తెరిచాడు.

గది మామూలుగానే వుంది.

చాలా చిన్నగది అది. అందులో ఒకబల్ల బల్లవెనుక ఒక స్త్రీ

ఆమె నల్లగా వుంది. ఎత్తుపళ్ళు. ముక్కువంకర.

పూర్వకాలంలో మంత్రగత్తెలని వుండేవారు. వారికి చిత్ర కారుల రూపకల్పనలా వున్నదామె.

"కూర్చో!" అందామె.

గొంతు డబ్బాలో రాళ్ళు గలగలలాడించినట్లుంది.

నందనరావును తెచ్చిన మనుషులతడిని వదిలిపెట్టారు. నందనరావు బల్లకివతల కుర్చీలో కూర్చున్నాడు.

"ఇది చూడు...." అందామె అతడి ముందుకో ఆల్బం తోస్తూ.

నందనరావు ఆల్బం అందుకొని పేజీలు తిప్పాడు.

అందులో ప్రతిఫోటోలోనూ ఓ క్రూరమైన శిక్ష అమలు జరుపబడుతోంది. ఆ ఫోటోలు చూస్తుంటే వళ్ళు జలదరిస్తుంది.

"చూడ్డానికే వళ్ళు జలదరించే ఈ శిక్షలు అనుభవంలోనికి వస్తాయి" అందామె.

"ఎవరికి?" అన్నాడు నందనరావు.

"నీకే అనుకో...."

"నా కెందుకు?" అన్నాడు కానీ అతడి శరీరం భయంతో వణికింది.

"ఎందుకో నీకే తెలుసు...."

"నాకు తెలియదు...."

ఆమె నవ్వి "అది నీ దురదృష్టం...." అంది.

"అవును—నేను దురదృష్టవంతుణ్ణే" అన్నాడు నందనరావు.

"దురదృష్టం నీతో ఆగదు...."

"అంటే?"

ఆ స్త్రీ మరో ఆల్బం అతడి ముందుకుతోసింది. నందనరావు కంగారుగానూ, భయంగానూ ఆ ఆల్బం తిరగేసి

అపరాధ పరిశోధన పోటీ-207

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-10-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు డిసెంబరు '85 నెలసంచికలో ప్రచురిస్తాము.

1. సిక్కు టెర్రరిస్టుల ఘాతుకానికి బలైన మరో ప్రముఖ నాయకుడు—?
(లోంగోవాల్, లలిత్ మకెన్)
2. నేడు యీ ప్రయాణమంటే ఎందరికో భయం—?
(నౌకా ప్రయాణం, విమాన ప్రయాణం)
3. 'తెలుగు గంగ' పథకానికి అడ్డు నిలుస్తున్న రాష్ట్రము—? (కర్ణాటక, మహారాష్ట్ర)
4. ఈ సినిమాలంటే కొందరికి భలే ఇష్టం—?
(కార్టూన్ చిత్రాలు, క్రైమ్ చిత్రాలు)
5. 'కాన్సరు' కు దగ్గరి దారి—?
(మద్యం, పొగాకు)

చూశాడు. ఇందాకటి ఆల్బంచూస్తే ఈ ఆల్బం అంత భయంకరంగా లేదు ఇవి శిక్షలకు సంబంధించిన ఫోటోలు కావు. కరువుకాలంలో ఇథియోపియో అన్నార్తులగురించి వచ్చిన ఫొటోల్లాంటివే అన్నీ. అందులో స్త్రీ బాలవృద్ధులందరూ వున్నారు.

"ఇందులో వున్నవారు గొప్పవాళ్ళే దర్జాగా బ్రతికిన వాళ్ళే. కానీ ఇప్పుడిలాగై పోయారు."

"ఎందుకని?"

"నీ వీ రెడ్ సెల్‌లోంచి బయటపడకపోతే కొన్నాళ్ళకు నీ భార్యాబిడ్డల ఫోటోలు కూడా యిందులో యివే ఆకారాలతో వుంటాయి."

నందనరావుకు వళ్ళు జలదరించింది. అప్పుడతనికి రెండో ఆల్బం మొదటి ఆల్బంకంటె భయంకరమైనదనిపించింది....

"ఇందులోంచి బయటపడాలంటే ఏంచేయాలి?"

"ఆ ఉపాయమేదో నీకే తెలియాలి...."

"నాకేమీ తెలియదు నిజంగా తెలియదు."

"చూడు. నువ్వ నేరం ఒప్పుకోలేదనుకో_రెడ్ సెల్‌లో ఎర్రటి వెలుగులో కళ్ళజోళ్ళు ధరించిన ముసుగు మనుషులు నీ పైన క్రూరమైన శిక్షలమలు జరుపుతారు...."

నందనరావు వెంటనే "నేరం ఒప్పుకుంటే?" అన్నాడు.

"ఏ బాధలూ లేకుండా సుఖంగా నీ ప్రాణం తీస్తారు."

"అంటే ఇందులోంచి బయటపడడం ఎలా?"

"ఆ వుపాయం నీకే తెలియాలి ..."

"నేను నేరం చేయలేదనుకో. అపార్థంలో ఇక్కడకు రప్పించబడ్డాను అనుకో —అప్పుడెలా బయటపడతాను?" అన్నాడు నందనరావు మళ్ళీ.

సెప్టెంబర్ '85 విడుదలలు

నవరస నవలా చక్రవర్తి

మల్లాది వెంకటకృష్ణమూర్తి

డబ్బెవరికి చేదు

రు. 15-00

కథాకళి

రు. 18-00

చిట్టారెడ్డి సూర్యకుమారి

సోనీ! మై సోనీ!

కురుమద్దాలి విజయలక్ష్మి

ప్రేమ పురాణం

శ్రీమతి హరిచందన

అనురాగ బంధాలు

త్వరలో విడుదల:....

రుద్రవీణ — ఇల్లాదేవి

ది ఫూల్ — నండూరి రామకృష్ణ

పద్మాలయా పబ్లికేషన్స్

లీలామహల్ ప్రక్కసందు, విజయవాడ - 2

"అది నిర్ణయించడానికి నిన్నిప్పుడింకో గదికి పంపిస్తాను" అందా కురూపియువతి.

"అంటే నన్నప్పుడే రెడ్ సెల్‌కి పంపించవా?" అన్నాడు నందనరావు ఆశగానూ, ఆత్రుతగానూ.

ఆమె తల అడ్డంగా ఊపి—"కానీ నువ్వు తప్పించుకున్నాననుకోకు. నా సర్వీసులో ఇందులో అడుగుపెట్టి బయటపడ్డ వాడొక్కడు కూడా లేడు" అంది.

నందనరావా స్త్రీవంక పరీక్షగాచూపి ఈ సెల్‌లో వుండతగ్గ మనిషి అనుకున్నాడు. ఇప్పుడతడి శరీరంలో వణుకు తగ్గింది కానీ మనసులోంచి భయంపోలేదు.

"నా విషయంలో నీ అభిప్రాయమేమిటి?" అన్నాడతడు.

"పక్కగదిలోకి వెళ్ళు...." అందామె వేలితో దారి చూపిస్తూ.

నందనరావటువెళ్ళాడు అతడు గదిముందుకు వెళ్ళగానే తలుపులు తెరుచుకున్నాయి. అతడు లోపల అడుగుపెట్టగానే తలుపులు వాటంతటవే మూసుకున్నాయి.

అంతవరకూ చీకటిగావున్న ఆ గదిలో దీపం వెలిగింది.

నందనరావుకు కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. అందుకు కారణం వెలుగుకాదు. ఆ చిన్నగదిలో గోడనానుకుని మెరుపుతీగవంటి యువతి నిలబడివుంది. ఆమెవంటిమీద ఏ విధమైన ఆచ్ఛాదనాలేదు.

అప్పుడున్న పరిస్థితుల్లో కూడా నందనరావుకు వళ్ళు వేడెక్కింది. అతడలా కొద్ది క్షణాలామెవైపే చూసి చటుక్కున కళ్ళు దించుకున్నాడు.

అప్పుడు వినిపించిందతడికి మెత్తటి పాదాలసవ్వడి... ఆ చప్పుడు క్రమంగా అతడిని సమీపించి ఆగిపోయింది.

"నేను నీకు నచ్చలేదా?"

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ (ఏడాదికి రు. 44/-లు) మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లి మెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 78/-లు మాత్రమే. మధ్యలో సభ్యులుగా చేరినవారికి మాత్రం తర్వాత నెలలకు లెక్కవేసి మొదటి వి.పి. పంపబడుతుంది.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది. మీ చిరునామా మారి నప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబ రును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా వి.పి. ద్వారా పత్రికలు తెప్పించు కునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 16-60 లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!— పత్రికలకు గ్యారంటీ!!

వీణ మీటినట్లుందాస్వరం....

"ఎవరునువ్వు?" తడబడుతున్న గొంతుతో తలెత్త కుండానే అడిగాడతడు.

"నీ కోసం వున్నానిక్కడ!"

"నేను నీకెలా తెలుసు?"

ఆమె నవ్వి "నన్ను నువ్వు దగ్గరగా తీసుకుంటే నేను నీ కౌగిలిలో కరిగిపోతే అందుకు ఒకరికొకరు తెలియాలా?" అంది.

నందనరావు కంతా అయోమయంగా ఉంది.

తనేదో కఠిన శిక్షకు గురికానున్నట్లు భావిస్తున్నాడు. తన ఎదుట బంగారు తీగలా మెరిసిపోతున్న ఈ యువతి ఏమిటి?

తను కలగంటున్నాడా? లేక షాక్ తిని ప్రాణాలు పోగొట్టుకుని స్వర్గానికి వచ్చేడా? ఈ రెండూ కాకపోతే ఇది జగపతిరావు తనకు పెట్టిన పరీక్ష అయుంటుంది. ఈ పరీక్షలో జగపతిరావేం సాధించ దల్చుకున్నాడు. అతడికీ పరీక్ష యిచ్చే ప్రయోజనమేముంది?

అతడాలోచిస్తూనే వున్నాడు. ఆమె అతడిని లతలా చుట్టుకొనిపోయింది. అప్రయత్నంగానే అతడూ ఆమెను కౌగలించుకున్నాడు.

"నేను నీకు నచ్చేనా?" అందామె మళ్ళీ.

"నచ్చితే నీకు ప్రయోజనం...."

"నాకేమీ ప్రయోజనంలేదు. నీకే!"

"ఏమిటది?"

"జీవితంలో నీ వనుభవించబోయే చివరి సుఖమిది!"

నందనరావు మళ్ళీ వాస్తవంలోకి వచ్చాడు. చివరి సుఖం అన్నమాట అతడి చేతులకు మరింత బలాన్నిచ్చింది.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-10-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు డిసెంబరు '85 నెల సంచికలో ప్రకటిస్తాము.

ఆగస్టు '85 పోటీ ఫలితాలు:

(1) ఆగస్టు '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మగువ మనసు గెలుచుకో!
మర్మమేదో తెలుసుకో!!

పంపినవారు: శ్రీ యం. శంకర్‌రెడ్డి, విజయ సైకిల్ షాపు, బెల్లంపల్లి (ఆదిలాబాదు జిల్లా).

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

అందగా నిలిచింది అశ్వం!
వింతగా వుంది విశ్వం!!

పంపినవారు: శ్రీ ఎస్.వి. కిరణ్, S/O ఎస్.వి. కృష్ణారావు, ఎస్.బి.వి. నిలయం, ఆర్.ఎస్. పేట, తుని - 533 401.

అతడి కౌగిలి బిగిపింది.

"ఈ రెడ్ సెల్‌లో కూడా సుఖానికి అవకాశముందన్న మాట!" అన్నాడతడు.

"మరోవిధంగా చెప్పాలంటే ఇదీ ఒకశిక్ష!" అందామె.

"ఎలా?"

"ఈ సుఖంలో జీవితంమీద మోజు పుడుతుంది. శరీరంపై మమకారం పెరుగుతుంది. అసలే క్రూరమైన శిక్షలు—ఈ కారణంగా మరింత క్రూరంగా అనిపిస్తాయి."

నందనరావామెను వదలలేదు. "నువ్వు చెప్పింది నిజం. నీ శరీరమెంతో కోమలంగావుంది. నీ మాటలు మృదుమధురంగా ఉన్నాయి. నువ్వు రెడ్ సెల్‌కు నీ జీవితాన్నంకితం చేయడం నీ దురదృష్టమేకాదు—ప్రకృతికి ఒక అందం కనుమరుగయింది."

ఆమె నిట్టూర్చింది. "నే నిక్కడకు నాకై నేను రాలేదు. తీసుకుని రాబడ్డాను. నా కీ జీవితంపై మోజు లేదు. ఈ గదిలో అడుగుపెట్టిన ప్రతి మగాడూ దొంగ, హంతకుడు, మోసగాడు—అయి ఉంటాడు. నావంటి యువతిని క్రూరంగా అనుభవించడం వారి ప్రవృత్తి. ఆ ప్రవృత్తికి బలికావడం నా జీవితం. ఇంతే నా జీవితం."

నందనరావాశ్చర్యంగా—"నువ్విక్కడి కెలా తీసుకుని రాబడ్డావు?" అన్నాడు.

"నా భర్త జగపతిరావును మోసంచేశాడని అభియోగం. అతదేమయ్యాడో నాకు తెలియదు. నేనుమాత్రం ఇక్కడకు రప్పించబడ్డాను...."

"కొంతలో కొంత నీ శిక్ష మేలు...." అన్నాడు నందనరావు సాలోచనగా.

"ఇది శిక్షకు ఆరంభం మాత్రం. కొంతకాలం గడిచేక

శ్రీమహాలక్ష్మివారి వెరైటీ నవలలు

సెప్టెంబరు 10 విడుదల !

1. పోస్టుబాక్సు నెం 1807
మల్లాది వెంకటకృష్ణమూర్తి 15-00

2. తెల్ల గులాబి 'మీరా' లక్ష్మి 25-00
(డైరక్టు నవల)

3. మీరా ,, లక్ష్మి 30-00

4. వింత మనుషులు వసుంధర 18-00

5. వాడిన మల్లెలు
వేలూరి సుభద్రాదేవి 15.00

6. విషసర్పాలు సికిందర్ 18.00
(అపన సీరియల్)

7. కల్యాణదుర్గం బొమ్మిడి
(అపన సీరియల్) అచ్చారావు 20.00

8 వారసులు మాదిరెడ్డి సులోచన 20.00

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ - 2.

నాగతి ఏమవుతుందంటే....". అని ఆమె ఒక్కక్షణం ఆగి—"అవతల గదిలో ఆల్బం చూసేవుంటావు" అంది.

నందనరావు ఒళ్లు జలదరించింది.

ఆ యువతి మళ్ళీ-"నీకు పెళ్ళయిందా?" అనడిగింది.

"ఊఁ"

"అయితే నీ భార్య త్వరలో నాకు స్నేహితురాలవు తుంది..."

నందనరావు చటుక్కున ఆమెను వదిలేశాడు. ఉన్న పళంగా కూలబడిపోయి "నో... నో...అలా జరగడానికి వీల్లేదు" అన్నాడు.

ఆమె కాసేపు మాట్లాడలేదు. నందనరావు నేలమీదనే వెనక్కువాలి పడుకున్నాడు. అతడు కళ్ళుమూసుకుని ఆలో చిస్తున్నాడు.

నిన్నటిదాకా ఆనందంతో నిండివున్న జీవితం తనది. ఒక్కరోజులో మొత్తం జాతకం మారిపోయింది. అదీ ఒక్క మనిషి ద్వారా!

"నీ కిక్కణ్ణించి తప్పించుకోవాలనుందా?" అందా యువతి.

నందనరావు చటుక్కున లేచి కూర్చుని-"నా కా అవ కాశముందా?" అన్నాడు.

"ఉంది. అది పూర్తిగా నీ అదృష్టంమీద ఆధారపడి వుంది" అందామె.

"చెప్పు. నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను...." ఆత్రుతగా అన్నాడతడు. —(ఇంకావుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600001.